మంగళవారం
9•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 14
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



LOVED IN 70 COUNTRIES

BAJAJ | THE WORLD'S FAVOURITE INDIAN

H GEAR టెక్నాలజి ఎలాంటిదంటే
కొత్త ప్లాటినా 110 సవారి స్మూత్‌గా




సమర్పిస్తున్నాము మొదటి H-GEAR టెక్నాలజి.
దీనిలో ఉన్నాయి ఎక్స్‌ట్రా హైవే గేయర్ మరియు ఆధునిక
గేయర్ షిఫ్ట్ గైడ్, ఇవి కంఫర్టెక్ టెక్నాలజితో కొనసాగిస్తాయి
మీ ప్రతి సవారీని హాయిగా. ఇప్పుడిక ప్లాటినా 110 H-GEAR తో
కుదుపులు నిషేధం.




₹0/-# డౌన్ పేమెంట్
₹53 504/-* నుంచి ప్రారంభం

Call 721 982 1111 | www.bajajauto.com

PLATINA
కుదుపులు నిషేధం

O&M 3200 TEL

For Institutional/Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in | *Ex-showroom Price Telangana drum variant. #Down payment excluding the processing fee. Finance at the sole discretion of financier at dealership. Terms & Conditions apply.

**Authorised Dealers For Bajaj Auto Ltd.:** Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545 • Mancherial MAHI BAJAJ 08736-259088 ,9912278641 • Adilabad SRR MOTORS 9491249451,9491159452. **Authorised Service Centre:** JAGITIAL 8522038460, 9949565692, SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849362096, MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064, JANNARAM 9440004495, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9491777000,GAJWEL 9848347349,MEDAK 7702014433,SIDDIPET 7702015577.

# 150 కిలోల బంగారం పట్టివేత?

- శంషాబాద్ విమానాశ్రయంలో ఘటన
- ధ్రువీకరించని కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు

**శంషాబాద్:** రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. సోమవారం సుమారు 150 కిలోల అక్రమ బంగారాన్ని కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొన్నట్టు విశ్వసనీయ సమాచారం. పట్టుబడిన బంగారం విలువ రూ.45 కోట్ల మేర ఉంటుందని భావిస్తున్నారు. కొంతకాలంగా రిజర్వ్ బ్యాంకు అనుమతి లేని పలు సంస్థలు మలేషియా, సింగపూర్ తదితర ప్రాంతాల నుంచి బంగారం దిగుమతి చేసుకొని వ్యాపారులకు సరఫరా చేస్తున్నట్టు కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. దాంతో ఆయా దేశాల నుంచి వచ్చిన పార్సిళ్లను తనిఖీ చేయడంతో అక్రమ 150 కిలోల బంగారం గుట్టు రట్టయింది. ఎంత కాలం నుంచి ఇలా తరలిస్తున్నారనే అంశంపై అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఓ మధ్యవర్తి సంస్థ బంగారం తీసుకొచ్చినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. బంగారం స్మగ్లింగ్ వెనుక పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తున్నది. హైదరాబాద్ మాత్రమే కాకుండా అహ్మదాబాద్, ఇతర ప్రాంతాలకు చెందిన బడాబాబులు తెర వెనుక ఉన్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. పూర్తి సమాచారం సేకరించే పనిలో కస్టమ్స్ అధికారులు నిమగ్నమయ్యారు. బంగారం పట్టివేతను కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు ధ్రువీకరించడంలేదు.

## సూడాన్ దేశం నుంచి
## అక్రమంగా తరలిస్తుండగా..

**శంషాబాద్:** సూడాన్ దేశానికి చెందిన ఓ ప్రయాణికురాలు సోమవారం అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. దుబాయ్-కువైట్ మీదుగా వచ్చిన విమానంలో సూడాన్ దేశానికి చెందిన మహ్మద్ ఉస్మాన్ అబాషర్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగగానే అనుమానంతో కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆమెవద్ద రూ.6,58,580 విలువచేసే 19 తులాల 3.7 గ్రాముల బంగారం అక్రమంగా ఉన్నట్టు గుర్తించారు. బంగారాన్ని స్వాధీనం చేసుకుని, ఆమెను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు అధికారులు తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్న బంగారం

## 72 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల
## నియామక కౌన్సెలింగ్ పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బంది నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఎంపికచేసిన నాన్‌క్లినికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సోమవారం డీఎంఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీల జాబితా ప్రకారం అభ్యర్థులను ఎంపికచేశారు. 76 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉండగా 72 మంది హాజరయ్యారని, మంగళవారం నియామక పత్రాలను జారీచేస్తామని డీఎంఈ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలో క్లినికల్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక కౌన్సెలింగ్‌ను కూడా చేపట్టనున్నట్లు తెలిపారు.



# ప్రజలను రెచ్చగొడుతున్న బీజేపీ

- బెంగాల్ మాదిరిగా హింసను ప్రేరేపిస్తే చూస్తూ ఊరుకోం
- కేంద్రమంత్రి హోదాలో అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- వీధి పోరాటాలు ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్



సోమవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఐడీసీ రాష్ట్ర చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్ కూడా ఉన్నారు.

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తెలంగాణ ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. హైదరాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించడానికి వచ్చిన అమిత్‌షా.. అడ్డగోలు మాటలు మాట్లాడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ మాదిరిగా తెలంగాణ కావాలంటూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బెంగాల్ మాదిరిగా తెలంగాణకావాలని కోరడమంటే హింసను ప్రేరేపించడమే అవుతుందని దుయ్యబట్టారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వినోద్ మాట్లాడారు. దేశ హోంమంత్రి అంతర్గత భద్రతను కాపాడేలా మాట్లాడాలే తప్ప, రెచ్చగొట్టేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. తెలంగాణలో బెంగాల్‌తరహా రాజకీయ హింసను ప్రేరేపిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. హింసకు తావులేకుండా తెలంగాణ సాధించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతున్నదని, తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీలు కూడా ఉద్యమ సమయంలో హింసను కోరుకోలేదని గుర్తుచేశారు. అలాంటి తెలంగాణలో అలజడి సృష్టించాలని చూస్తే తెలంగాణ సాధించిన ఉద్యమ పార్టీగా టీఆర్‌ఎస్ ఊరుకోదని తేల్చి చెప్పారు. శాంతి ఉన్న చోటే అభివృద్ధి ఉంటుందని, దానినే తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో వీధిపోరాటాలు చేస్తామని, ప్రతి పదిహేను రోజులకో మంత్రిని పంపిస్తామంటూ అమిత్‌షా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, వీధి పోరాటం చేయాల్సిన అవసరం ఏమిటో ముందుగా తెలంగాణ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని డిమాండ్‌చేశారు. లేనిపోని మాటలతో రెచ్చగొట్టి ఇక్కడి పోలీసులకు పని కల్పించాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు.

**ముందు నీటిపారుదలశాఖ మంత్రిని పంపండి**

నిజానికి ప్రతి 15 రోజులకో కేంద్ర మంత్రిని పంపుతామంటూ చెప్పడాన్ని టీఆర్‌ఎస్ స్వాగతిస్తుందని వినోద్ అన్నారు. కానీ అది మంచి పనుల కోసం మాత్రమే అయి ఉండాలని, ముందుగా నీటిపారుదలశాఖ మంత్రి షెకావత్‌ను పంపించి కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు చూడాలని చెప్పాలంటూ అమిత్‌షాకు సూచించారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ప్రకటించడం, ప్రాజెక్టులకు నిధులు ప్రకటించి వెళ్లాలని చెప్పాలంటూ అంటూ డిమాండ్ చేశారు. ఆ తదుపరి నితిన్ గడ్కరీని పంపించి గతంలో తెలంగాణ ఎంపీలు సాధించిన మూడువేల కిలోమీటర్ల జాతీయ రహదారులకు శంకుస్థాపనచేసి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలంటూ సూచించారు.

**తెలంగాణ అవసరాలు తీర్చాలి**

మరో 15 రోజులకు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను పంపించి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భూమి పూజ చేసి తెలంగాణకు కావాల్సిన అవసరాలు తీర్చేవిధంగా ప్రకటనలు చేయించాలని వినోద్ డిమాండ్‌చేశారు. వ్యవసాయం, వైద్యరంగాల్లో కేంద్రం నుంచి గతంలో అనేక హామీలు పొందామని, వాటిని అమలు చేసి వెళ్లాలని సూచించారు. కేంద్ర మంత్రులకు ఏడాదికి సరిపడా ఎజెండా ఇవ్వడానికి టీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందన్నారు. ఇటువంటి మంచి పనులు కాకుండా అమిత్‌షా తెలంగాణ వ్యతిరేక అజెండా అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఐడీసీ రాష్ట్ర చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



హజ్ క్యాంపు ఏర్పాటుపై ఉన్నతాధికారుల సమీక్షలో పాల్గొన్న మంత్రులు మహమూద్‌అలీ, కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ తదితరులు

## హజ్ యాత్రికులకు అసౌకర్యం కలుగొద్దు

- అధికారులతో మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హజ్ యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లుచేయాలని మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్ అధికారులకు సూచించారు. హజ్ క్యాంపు ఏర్పాటుపై సంబంధిత 22 శాఖల ఉన్నతాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది యాత్రికుల కోసం ఎనిమిది సహాయ కేంద్రాలు అందుబాటులో ఉంటే ఈసారి మరో రెండు కేంద్రాలను పెంచే అంశంపై చర్చించామని చెప్పారు. గతంలో హజ్‌క్యాంపులో విద్యుత్ సమస్య తలెత్తిందని, ఈసారి ముందజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. యాత్రికులు అనారోగ్యానికి గురైతే దవాఖానకు తరలించే ఏర్పాట్లుచేయాలని, నాలుగు రాష్ట్రాలకు చెందిన హజ్ యాత్రికులు తెలంగాణ హజ్ క్యాంపునకు వస్తారని, పొరపాట్లు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని చెప్పారు. గతేడాది ఎనిమిది వేలకుపైగా యాత్రికులను హజ్‌యాత్రకు పంపామని, ఈసారి పెరిగే అవకాశముందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ షఫిఉల్లా, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్‌ఖాసీం, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వోఎఫ్‌ఆర్ దరఖాస్తులెన్ని?

అటవీ అధికారుల సమీక్షలో సీఎస్ జోషి ఆరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అటవీ భూముల్లో ఆర్వోఎఫ్‌ఆర్ భూమి హక్కు పత్రాలజారీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అటవీశాఖ, గిరిజనశాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్వోఎఫ్‌ఆర్ కింద ఇంకా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.. ఉమ్మడి ఏపీలో దరఖాస్తుదారులకు ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు ఎందుకు ఇవ్వలేకపోయారనే విషయంపై సమీక్షించారు. సమావేశంలో అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా, గిరిజన శాఖ కమిషనర్ క్రిస్టినా చోంగ్తుతో పాటు పలువురు కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్కే భవన్‌కు సచివాలయం!

- సీఎం చాంబర్, సీఎస్ పేషీ అక్కడే
- నాలుగు రోజుల్లో శాఖల తరలింపు
- సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- ఈఎన్సీలతో సాంకేతిక కమిటీ



సచివాలయ తరలింపు, నూతన సచివాలయ, అసెంబ్లీ భవన నిర్మాణం అంశాలపై సోమవారం సమావేశమైన మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన భవన నిర్మాణం నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం తరలింపునకు రంగం సిద్ధమైంది. ఏ క్షణమైనా తరలివెళ్లడానికి జీఏడీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ మేరకు జీఏడీశాఖలో ఫైళ్లన్నీ క్రమపద్ధతిలో ప్యాక్‌చేస్తున్నారు. నూతన సచివాలయ భవన నిర్మాణానికి వీలుగా సచివాలయ శాఖలను పాత సచివాలయానికి అతి సమీపంలో ఉన్న బూర్గుల రామకృష్ణారావు భవన్‌కు తరలించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యంగా సచివాలయానికి వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పరిపాలనా సౌలభ్యం కోసం, ఐటీ నెట్ వర్క్ అవరోధాలు ఏర్పడకుండా, అన్నివిభాగాలను ఒకే చోటుకు మార్చితేనే మంచిదని భావించారని సమాచారం. ఈ క్రమంలోనే జీఏడీలో ఫైళ్లన్నింటినీ ప్యాక్ చేయడంతోపాటు ఇతర సామాగ్రిని తరలించడానికి వీలుగా సిద్ధంచేస్తున్నారు. దీంతో సోమవారం నుంచే శాఖల తరలింపు ప్రక్రియ అధికారికంగా మొదలైనట్లేనని అధికారులు అంటున్నారు. బూర్గుల రామకృష్ణారావు భవనంలోని 8, 9 అంతస్తులలో ముఖ్యమంత్రి చాంబర్, సీఎం కార్యాలయ అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆయన పేషీలతోపాటు జీఏడీ శాఖలు ఉండనున్నాయి. ఆటవీశాఖ కార్యాలయాన్ని పక్కనే ఉన్న అరణ్యభవన్‌కు మార్చనున్నారు. రోడ్లు భవనాలశాఖ, సాగునీటి శాఖలను ఎర్రమంజిల్‌లోని ఈఎన్సీ భవనం, జలసౌధలకు తరలించనున్నట్లు తెలిసింది. మిగిలిన శాఖలను బీఆర్‌కే భవన్‌తోపాటు పక్కనే ఆదర్శనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోకి తరలించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇందులో ఏపీకి అప్పగించిన సుమారు 50 క్వార్టర్లు ఖాళీగానే ఉన్నాయి. వాటిల్లో 15 క్వార్టర్లను తాత్కాలికంగా సచివాలయ విభాగాలకోసం వినియోగించాలని అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. సచివాలయ తరలింపు ప్రక్రియ అంతా మూడు, నాలుగు రోజుల్లో పూర్తికావాలని అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. ప్రస్తుతం బీఆర్‌కే భవన్‌లో వినియోగించని కార్యాలయాలన్నింటినీ ఖాళీచేయాల్సిందిగా మౌఖికంగా ఆదేశించారని సమాచారం.

**భేటీ అయిన మంత్రివర్గ ఉపసంఘం**

సచివాలయ తరలింపు, నూతన సచివాలయ నిర్మాణం, అసెంబ్లీ నూతన భవన నిర్మాణం అంశాలపై రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షుడిగా, మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్ సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సచివాలయంలో సమావేశమైంది. వీలైనంత మేరకు అన్నిశాఖలు ఒకే దగ్గర ఉండేలా సచివాలయాన్ని తరలిస్తే మంచిదన్న అభిప్రాయానికి మంత్రివర్గ ఉపసంఘం వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుత సచివాలయం, అసెంబ్లీ భవనాలలో ఉన్న సౌకర్యాలను, భవనాల పరిస్థితిపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం ఇంజినీరింగ్ చీఫ్‌లతో సాంకేతిక కమిటీని నియమించారు. రోడ్లు భవనాలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి మెంబర్ కన్వీనర్‌గా ఉండే ఈ సాంకేతిక కమిటీలో ఈఎన్సీలు రవీందర్, మురళీధర్, సత్యనారాయణరెడ్డి ఉంటారు. పాత సచివాలయం, అసెంబ్లీ భవనాల్లో ఉన్న సౌకర్యాలు, భవనాల పరిస్థితిని పరిశీలించి, నూతన భవనాల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండాలి? భవనాలు ఎలా ఉండాలి? అనే అంశాలపై సిఫారసులు ఇవ్వాలని సాంకేతిక కమిటీని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది.

## బోధకులు లేకున్నా డెంటల్ కాలేజీలకు అనుమతులా?

- రాజ్యసభలో ప్రస్తావించిన టీఆర్‌ఎస్ ఎంపీ కే కేశవరావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డెంటల్ కాలేజీల్లో బోధించడానికి అర్హతగలవారు లేకపోయినా కాలేజీలకు అనుమతులు ఇస్తున్నారని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు పేర్కొన్నారు. రాజ్యసభలో సోమవారం డెంటిస్ట్ అమెండ్‌మెంట్ బిల్లు- 2019పై జరిగిన చర్చలో టీఆర్‌ఎస్ తరపున కేకే మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎండీఎస్ చేసిన వారు చాలా తక్కువమంది ఉన్నారని తెలిపారు. డెంటిస్ట్ కమిటీలో ఆరుగురికే అవకాశం కల్పించారని, ఎక్కువమందికి ఇవ్వాలని కోరారు.

## ఆయిల్‌పామ్ సాగుకు సహకరించండి



సోమవారం ఢిల్లీలో జరిగిన వ్యవసాయశాఖ మంత్రుల సమావేశంలో అభివాదంచేస్తున్న రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- తెలంగాణలో వేరుశనగ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి
- వ్యవసాయశాఖ మంత్రుల సమావేశంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆయిల్‌పామ్ సాగుచేసేందుకు తెలంగాణకు సహకరించాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఢిల్లీలో జరిగిన వ్యవసాయశాఖ మంత్రుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. పామ్‌ఆయిల్ ఉత్పత్తిని పెంచి ఎగుమతి స్థాయికి ఎదగాలని సూచించారు. తెలంగాణలో వేరుశనగ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. కేంద్రం కొన్ని పంటలకు మాత్రమే మద్దతు ధరలు ప్రకటించడంతో ఇతర పంటలు పండించిన రైతులకు అన్యాయం జరుగుతున్నదని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతున్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజనకు తెలంగాణ రైతుబంధు అమలు విధానాలు మార్గదర్శకం కావడం సంతోషకరమని తెలిపారు.

**ముహూర్తం**



సూర్యోదయం: 5.52 గంటలకు



సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, అష్టమి, నక్షత్రం: హస్త సాయంత్రం 5.16 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: ఉదయం 11.36 నుంచి మధ్యాహ్నం 1.12 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.36 నుంచి సాయంత్రం 5.14 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.28 నుంచి 9.20 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.31 నుంచి 3.23 వరకు, వర్జ్యం: లేదు.

## సిలికాన్ టైర్లు.. నైట్రోజన్ వాయువు!

- ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్రం కొత్త యోచన
- తయారీదారులకు ఆదేశాలిచ్చే విధంగా కసరత్తు
- నైట్రోజన్ నింపిన టైర్లతో లాభమేనంటున్న నిపుణులు

**న్యూఢిల్లీ, జూలై 8:** రోడ్డు ప్రమాదాలను నివారించడానికి వాహనాల టైర్లను సిలికాన్, రబ్బరు మిశ్రమంతో తయారుచేస్తూ.. ఆ టైర్లలో సాధారణ గాలికి బదులు నైట్రోజన్ నింపడం తప్పనిసరిచేస్తూ తయారీదారులకు ఆదేశాలిచ్చే ప్రతిపాదనపై కేంద్రం యోచిస్తున్నది. ఈ విషయాన్ని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం రాజ్యసభలో తెలిపారు. ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం.. సిలికాన్, రబ్బరు మిశ్రమంతో తయారుచేసి, నైట్రోజన్‌తో నింపిన టైర్లు ఉష్ణోగ్రతలను తట్టుకుంటాయి. ఇలాంటి టైర్లు తక్కువగా పేలుతాయి. అయితే, వాహనాల టైర్లలో సాధారణ గాలికి బదులు నైట్రోజన్‌ని నింపితే ప్రమాదాలు తగ్గుతాయా? అనే ప్రశ్న ప్రస్తుతం చర్చనీయాంశం అవుతున్నది. గాలిలో సుమారు 78 శాతం నైట్రోజన్ ఉంటుంది. 21 శాతం ఆక్సిజన్ ఉంటుంది. సాధారణ వాయువులో నీటి ఆవిరి కూడా ఉంటుంది. మామూలు వాయువుతో పోలిస్తే రబ్బరు టైరులో నైట్రోజన్ స్థిరంగా ఉంటుంది. దీంతో టైరు లోపలి పీడనం స్థిరంగా ఉంటుంది. అందుకనే, రేసర్లు తమ వాహనాల టైర్లను శుద్ధ నైట్రోజన్‌తో నింపుతారు. నైట్రోజన్‌తో నింపిన టైర్లలో పీడనం స్థిరంగా ఉండటంతో టైర్లు ఎక్కువ కాలం మన్నికగా ఉండటంతో పాటు... ఇంధన ఖర్చు కూడా కొంచం తగ్గుతుందని అంటారు. మాములు గాలితో నింపిన టైర్లలో పీడనంలో హెచ్చుతగ్గులు ఉంటాయి.

**అల్యూమినియం రిమ్‌కు తుప్పు**

సాధారణ గాలిలో నీటి ఆవిరి ఉండటం వల్ల స్టీలు లేదా అల్యూమినియంతో తయారుచేసే రిమ్‌తో నీటి ఆవిరి రసాయనిక చర్య జరిగి తుప్పు పట్టే అవకాశమున్నది. టైర్లలో నింపే నైట్రోజన్‌లో నీటి ఆవిరి ఉండదు. దీంతో రిమ్ తుప్పుపట్టే అవకాశం ఉండదు. టైర్లు క్రియాశీలంగా, పాడవకుండా ఉండటానికి నైట్రోజన్‌ను వాడితే సరిపోదని అమెరికాలోని బ్రిడ్జ్ స్టోన్ టైర్ల సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్ కెయిత్ విల్‌కమ్ అంటున్నారు. 'బ్రిడ్జ్ స్టోన్ సంస్థ టైర్లలో గాలి లేదా నైట్రోజన్ వాయువును నింపడానికి ప్రాముఖ్యత ఇవ్వదు. రెండు వాయువులు కూడా సమానమే. టైరుపై రెండు వాయువులూ సమానంగానే పీడనాన్ని కలుగజేస్తాయి. వాతావరణంలో మారే ప్రతీ 10 డిగ్రీల సెంటీ గ్రేడ్ ఉష్ణోగ్రత మూలంగా టైర్లలో 1 పీఎస్ఐ(పీడనం) మారుతుంది. దీంతో టైరుపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ మార్పు నైట్రోజన్ వాయువుతో నింపిన టైర్లలో, మామూలు గాలితో నింపిన టైర్లలో ఒకే విధంగా ఉంటుంది. టైర్లలోని పీడనంలో హెచ్చుతగ్గులను సరిగ్గా చూసుకుంటే టైర్ల ప్రమాదాలు తగ్గి, మన్నిక పెరుగుతుంది' అని కెయిత్ అన్నారు. అయితే, టైర్లలో సాధారణ వాయువును నింపడం కంటే, నైట్రోజన్‌ను నింపితే, టైర్ల మన్నిక, ఇంధనం ఆదాతో పాటు రిమ్ తుప్పుపట్టకుండా చూసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**లోకం పోకడ**





# ఘోర రోడ్డు ప్రమాదం

- దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన.. ఐదుగురు దుర్మరణం
- మృతులందరిదీ ఒకే కుటుంబం
- రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలో ఘటన
- మృతుల్లో వరంగల్ హెడ్‌కానిస్టేబుల్



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు వద్ద హైదరాబాద్ -శ్రీశైలం ప్రధాన రహదారిపై ఢీకొన్న ఇన్నోవా-లారీ



మృతులు దుర్గాప్రసాద్, విజయలక్ష్మి (ఫైల్)



మృతులు శంతన్, పద్మ (ఫైల్)

**ఆమనగల్లు, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలోని హైదరాబాద్- శ్రీశైలం ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఇన్నోవా వాహనంలో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్ (52).. భార్య విజయలక్ష్మి (48), కుమారుడు శంతన్ (26), అక్క పద్మజ (54), బావ రాజు(56)తో కలిసి డ్రైవర్ ఖలీల్‌ను తీసుకుని హైదరాబాద్ నుంచి వాహనంలో ఆదివారం శ్రీశైలం వెళ్లారు. దైవదర్శనం అనంతరం సోమవారం తిరుగుపయనమయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సున్నిపెంట వద్ద భోజనం చేసి.. హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆమనగల్లు సమీపంలోని మేడిగడ్డ వద్ద పలుగు నింపుకుని వస్తున్న లారీ వేబ్రిడ్జికి మళ్లుతుండగా.. ఇన్నోవా బలంగా ఢీకొన్నది. దీంతో ఇన్నోవా ముందుభాగం నుజ్జునుజ్జయింది. అందులో ఉన్న దుర్గాప్రసాద్, శంతన్, రాజు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా విజయలక్ష్మి, పద్మజ మార్గమధ్యంలోనే మృతిచెందారు. ఖలీల్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దుర్గాప్రసాద్ వరంగల్ కాజీపేటలోని రహ్మాత్‌నగర్‌లో నివాసం ఉంటుండగా.. బావ రాజు మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌కాలనీ వార్డు -2లో ఉంటున్నారు. సమాచారం అందుకొన్న ఎస్సై మల్లేశ్వర్.. స్థానికుల సాయంతో మృతదేహాలను ఇన్నోవా నుంచి బయటకు తీసి కల్వకుర్తి దవాఖానకు తరలించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ విజయ్‌కుమార్ ఘటనాస్థలి సందర్శించారు.

**కాజీపేటలో విషాదం..**

ఆమనగల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో వరంగల్ జిల్లా కాజీపేటలో విషాదం అలుముకున్నది. ప్రమాదంలో కుమారుడు, కోడలు, మనుమడు, కూతురు, అల్లుడు మృతిచెందారనే వార్త తెలియడంతో దుర్గాప్రసాద్ తల్లి పూలమ్మ శోకసంద్రంలో మునిగిపోయారు. రహమత్‌నగర్‌కు చెందిన పగడాల పుల్లయ్య- పుల్లమ్మకు కుమార్తెలు పద్మ, అంజనీ, కుమారుడు దుర్గాప్రసాద్ ఉన్నారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రేయాజ్ ఆస్ట్రేలియాలో ఎంఎస్ చదువుతుండగా.. చిన్న కుమారుడు శంతన్ వరంగల్ అనంతసాగర్‌లో ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ప్రమాదంలో దుర్గాప్రసాద్, భార్య విజయలక్ష్మి, శంతన్ మృతిచెందడంతో కుటుంబంలో ఆయన తల్లి, పెద్ద కుమారుడే మిగిలారు.

**సీటు బెల్టు ధరిస్తే ప్రాణాలు దక్కేవి!**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** అమనగల్లు సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఇన్నోవాకారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్టు ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని తెలుస్తున్నది. సీటుబెల్టు పెట్టుకున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డట్టు సంఘటన్నా స్థలాన్ని పరిశీలిస్తే అవగతమవుతున్నది. సీటుబెల్టు పెట్టుకుని ఉంటే బతికేవారని పోలీసులు ప్రాథమిక విచారణలో భావిస్తున్నారు. కాగా, ప్రమాదానికి మీడియన్ (డివైడర్) లేకపోవడం కూడా ప్రధాన కారణంగా పోలీసులు గుర్తించారు.

**డ్రైవింగ్ నేను చేయలేదు: డ్రైవర్ ఖలీల్**

ఆమనగల్లు సమీపంలో ప్రమాదానికి గురైన ఇన్నోవా వాహనాన్ని తాను నడిపించలేదని డ్రైవర్ ఖలీల్ తెలిపారు. ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయనను ప్రమాద ఘటనపై ఆరాతీయగా.. దుర్గాప్రసాద్ కొడుకు శాంతన్ వాహనాన్ని నడుపుతుండగా.. తాను పక్క సీట్లో కూర్చున్నట్టు చెప్పారు. లారీ అకస్మాత్తుగా కుడివైపుకు తిప్పడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. తాత్కాలిక డ్రైవర్‌గా వాహనం నడిపేందుకు వచ్చానని పేర్కొన్నారు.



డ్రైవర్ ఖలీల్

మంగళవారం
9•7•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE





కోహ్లీ ఉత్సాహం

## కివీస్‌తో నేడు అమీతుమీ

**వరల్డ్‌కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఢీ కొట్టనున్న కోహ్లీ సేన**

**ప్రపంచకప్** తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో తలపడేందుకు టీమ్‌ఇండియా రెడీ అవుతున్నది. రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి సెమీస్‌కు వచ్చిన న్యూజిలాండ్‌ను ఓడించి తుదిపోరుకు చేరాలని కోహ్లీ సేన తహతహలాడుతున్నది. వరుస శతకాలతో జోరుమీదున్న హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ మరోసారి చెలరేగాలని చూస్తుంటే.. బుమ్రా బంతితో ప్రత్యర్థిని బెంబేలెత్తించేందుకు సిద్ధమవుతున్నాడు. 1983 ప్రపంచకప్ సెమీఫైనల్ జరిగిన మాంచెస్టర్‌లోనే మరోసారి సెమీస్ జరుగనుండటంతో హిస్టరీ రిపీట్ కావాలని యావత్ భారతం కోరుకుంటున్నది.

వివరాలు ఆటలో


సోమవారం కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మూడు మోటర్ల ద్వారా ఎత్తిపోసిన గోదావరి జలాలు డెలివరీ సిస్టర్నుల ద్వారా గ్రావిటీ కెనాల్‌లోకి పడుతున్న దృశ్యం

## పొంగుతున్న గంగ

### కన్నెపల్లి పంపుహౌస్‌లో మరో మోటర్ స్విచాన్

4

- మూడు మోటర్లతో నిరంతరం నీటి ఎత్తిపోత
- గ్రావిటీ కెనాల్‌లోకి దుంకుతున్న గోదావరి నీరు
- అన్నారం బరాజ్‌కు రోజుకు 6,300 క్యూసెక్కులు
- నేటినుంచి పనిచేయనున్న నాలుగో మోటర్
- మేడిగడ్డ బరాజ్‌లో మొత్తం నలభై గేట్ల మూసివేత

## టీఆర్టీ అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు రేపట్నుంచే

- 15న పోస్టుల్లో చేరిన టీచర్ల రిపోర్టింగ్
- 20 నాటికి నియామక ప్రక్రియ పూర్తి
- షెడ్యూల్ జారీచేసిన పాఠశాల విద్యాశాఖ
- చర్యలు చేపట్టాలని డీఎల్సీలకు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో మరో కీలక అడుగుపడింది. టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపట్టిన టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)లో ఎంపికైన అభ్యర్థులకు నియామక ఆర్డర్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. ఈ నెల 20 వరకు పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయ్యేలా పాఠశాల విద్యాశాఖ సోమవారం షెడ్యూల్ విడుదలచేసింది. ఎస్జీటీ నియామక ప్రక్రియపై హైకోర్టు స్టే ఉన్నందున.. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, భాషా పండితుల నియామక ప్రక్రియను ఈ నెల పది నుంచి 20 వరకు పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ జిల్లాస్థాయి కమిటీ (డీఎల్సీ)లకు ఆదేశాలిచ్చారు. ఒకవేళ ఏదైనా స్కూల్‌లో రెగ్యులర్ టీచర్ లేనప్పుడు కనీసం ఒక సబ్జెక్టు టీచర్‌ను నియమించేవిధంగా డీఎల్సీ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు, ఖాళీల

మిగతా 8వ పేజీలో



• హైదరాబాద్ తాగునీటి ఎద్దడికి చెక్

# కేశవాపూర్‌లో జలాశయం

- మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నీటితో ప్రతిపాదిత రిజర్వాయర్‌ను ఎప్పటికప్పుడు నింపాలి
- నగర ప్రజల అవసరాలు తీర్చలేకపోతున్న ప్రస్తుత కృష్ణా, గోదావరి నీటి తరలింపు
- వాటిని కొనసాగిస్తూనే కొత్త రిజర్వాయర్ కట్టాలి • అధికారులను ఆదేశించిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ నగరానికి భవిష్యత్తులో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు మేడ్చల్ జిల్లా కేశవాపూర్ గ్రామం దగ్గర వెంటనే మంచినీటి రిజర్వాయర్ నిర్మించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నుంచి గోదావరి నీటిని తరలించి, ప్రతిపాదిత మంచినీటి రిజర్వాయర్‌ను ఎప్పటికప్పుడు నింపుతూపోవాలని సూచించారు. ఈ మేరకు సాగునీటిపారుదలశాఖ, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖ అధికారులు సంయుక్తంగా సమావేశమై అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రతి ఇంటికీ మంచినీటి కనెక్షన్ ఇవ్వాలని చెప్పారు. హైదరాబాద్ నగరానికి మంచినీటి రిజర్వాయర్ నిర్మించే విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతం గోదావరి, కృష్ణానీళ్లను చాలాదూరంనుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. అయినా ఆ నీళ్లు సంవత్సరం పొడవునా నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. భవిష్యత్‌లో ఇలా జరుగటానికి వీలులేదు. కాళేశ్వరం ప్రాజెక్టుద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు నీటి సరఫరా జరుగుతుంది. ప్రాజెక్టుల నీటిలో 10 శాతాన్ని మంచినీటి అవసరాలకు వాడుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు కూడా ఇచ్చింది. కాబట్టి ఈ రెండు రిజర్వాయర్ల నుంచి హైదరాబాద్‌కు మంచినీళ్లు అందించాలి. దీనికోసం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి సమీపంలోని కేశవాపూర్ దగ్గర రిజర్వాయర్, మంచినీటి శుద్ధికేంద్రం నిర్మించాలి. ఇక్కడినుంచి నగరానికి మంచినీటి సరఫరా జరుగాలి. దీనికోసం వెంటనే అంచనాలు రూపొందించాలి. గోదావరి, కృష్ణానీటిని ప్రస్తుత పద్ధతిలో తరలిస్తూనే ప్రత్యామ్నాయంగా రిజర్వాయర్ కూడా నిర్మించాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు స్పష్టంచేశారు. ఈ సమావేశంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎం కార్యాలయ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, మేడ్చల్ కలెక్టర్ ఎంవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



9

అంతులేని వేదన: కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి (ఫైల్)

## రిసార్టుల్లో కర్ణాటకం!

- క్షణక్షణం మారుతున్న రాజకీయం.. మంత్రుల సామూహిక రాజీనామా
- అసంతృప్తులకు చోటు కల్పించేందుకేనంటున్న అధికార పార్టీలు
- మంత్రి పదవులు ఊడటంతో సర్కార్‌కు ఇద్దరు ఇండిపెండెంట్ల గుడ్‌బై
- త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న సీఎం కార్యాలయం
- రెబల్ ఎమ్మెల్యేల మకాం ముంబై టు గోవా!

**కర్ణాటకలో** రాజకీయాలు పతాకస్థాయికి చేరుకున్నాయి. తమ పద్నాలుగు నెలల సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు త్యాగాలకు సిద్ధపడ్డాయి. అసంతృప్తులను బుజ్జగించేందుకు వారికి మంత్రి పదవులను ఆశ చూపాయి. ఇందుకోసం ప్రస్తుతం పదవుల్లో ఉన్న మంత్రులందరితోనూ రాజీనామాలు చేయించారు. మరోవైపు మూలిగే నక్క మీద తాటిపండు పడిన చందంగా మంత్రి పదవులకు రాజీనామా చేసిన ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు తాము కుమారస్వామి ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. వీరిలో ఒకరు బీజేపీ పక్షాన చేరుతున్నట్టు తెలిపారు. దీంతో సంక్షోభం మ రింత ముదిరింది. ఇదే అదనుగా భావిస్తున్న బీజేపీ.. ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. కర్ణాటక ప్రకంపనలు పార్లమెంట్‌లోనూ ప్రతిధ్వనించాయి. మరోవైపు ముంబైలో ఉన్న తిరుగుబాటు ఎమ్మెల్యేలను గోవాకు తరలించారు. జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు కొడగులోని రిసార్టుల్లో మకాం వేశారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం



- వంతెనపై అదుపుతప్పి కాల్వలో పడిన బస్సు
- 29 మంది మృతి
- డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం!

9

సోమవారం తెల్లవారుజామున యమునా ఎక్స్‌ప్రెస్‌వే కాల్వలో పడిన బస్సును వెలుపలికి తీస్తున్న దృశ్యం

### సభ్యత్వ నమోదులో

## మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి

**కాలనీ అసోసియేషన్ల సభ్యులను పార్టీలో చేర్చాలి**

- యువకులు, విద్యావంతులకు ప్రత్యేక కౌంటర్లు
- సభ్యత్వ నమోదుపై టెలీకాన్ఫరెన్స్‌లో కేటీఆర్
- చురుకుగా చేస్తున్నారంటూ పార్టీ నేతలకు అభినందనలు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పట్టణప్రాంతాల్లో త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మున్సిపల్ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదుపై ప్రత్యేకదృష్టి సారించాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదుపై సోమవారం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, సభ్యత్వ నమోదు ఇంచార్జులు, సీనియర్ నాయకులతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు ఎంత సభ్యత్వం నమోదైందో తెలుసుకున్నారు. పట్టణప్రాంతాల్లో విద్యావంతులు, వృత్తినిపుణులను స్వయంగా కలిసి సభ్యత్వం ఇచ్చేలా చూడాలని సూచించారు. పట్టణాల్లో రెసిడెంట్స్, కాలనీవెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యులను కలిసి పార్టీలో చేరేలా చూడాలన్నారు. పట్టణాల్లోని యువకులు, విద్యావంతులు పార్టీలో చేరేందుకు

మిగతా 4వ పేజీలో

## లక్ష ఇస్తేనే పాస్‌బుక్!

ధర్మగంట

- జారీ అయిన పాస్‌పుస్తకానికి వీఆర్వో మోకాలడ్డు
- లంచం ఇవ్వలేదని కౌలుదారుతో కలిసి పట్టా మార్పునకు కుట్ర
- సాదాబైనామా సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన తాసిల్దార్
- పట్టాని కోర్టు ఇన్‌జంక్షన్ ఆర్డర్.. ఆన్‌లైన్‌లో మరొకరి పేరుతో పహాణీ
- ధర్మగంటను ఆశ్రయించిన పెద్దపల్లి జిల్లా బాధితురాలు నర్సమ్మ

5

## దలాల్ స్ట్రీట్ ఢమాల్

సెన్సెక్స్ 793, నిఫ్టీ 252 పాయింట్లు పతనం

- ఈ ఏడాదిలోనే గరిష్ఠ స్థాయి క్షీణత
- బడ్జెట్ నిర్ణయాలను మెచ్చని మదుపరులు
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

11


రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

## పురపోరుకు 15న నగారా?

- నెలాఖరులోగా ఎన్నికలు
- 14లోగా ఓటరు జాబితా, వార్డుల విభజన
- మున్సిపాలిటీల్లో వ్యయపరిమితి రెండు లక్షలకు.. కార్పొరేషన్లలో మూడు లక్షలకు పెంపు!
- రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం వెల్లడి

12






# క్రీడా అకాడమీలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

- 5-8 తరగతుల విద్యార్థులకు అవకాశం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 21 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 20 క్రీడా అకాడమీల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులు చదువుతున్న ఎస్సీ బాలబాలికలు ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎస్సీ గురుకుల సొసైటీ సోమవారం ప్రకటించింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు www.tswreis.in వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించింది.

# ముగిసిన ఎంసెట్ వెబ్ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ

రేపు ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి శనివారం ప్రారంభమైన ఎంసెట్ వెబ్ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. మంగళవారం ఒకరోజు వెబ్‌సైట్‌ను ఫ్రీజ్‌చేసి, బుధవారం (ఈ నెల 10న) ఇంజినీరింగ్ సీట్లు కేటాయిస్తామని కౌన్సెలింగ్ క్యాంపు ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు వారం గడువు ఇస్తామని, మూడోవారంలో రెండోదశ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని చెప్పారు.



లంచం తీసుకొంటూ చిక్కిన కోఆపరేటివ్ సొసైటీ సీనియర్ అసిస్టెంట్ చంద్రకిరణ్

# ఏసీబీకి చిక్కిన అధికారులు

- ఆడిట్ రిపోర్టు కోసం లంచం డిమాండ్
- పట్టుబడ్డ జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అధికారులు

**బాలానగర్:** మేడ్చల్ జిల్లా కోఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ దామోదర్, సీనియర్ అసిస్టెంట్ చంద్రకిరణ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్ గండిమైసమ్మ సాయినగర్ సొసైటీలో ఆడిట్ చేసి సొసైటీ చైర్మన్ భూమిరెడ్డికి రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. సదరు అధికారులు ఆడిట్ రిపోర్ట్ ఇవ్వడానికి రూ.50 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమిరెడ్డి లంచం ఇవ్వడానికి ఒప్పుకొని ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు. పథకంలో భాగంగా ముందుగా రూ.7 వేలు ఇచ్చారు. మిగతా రూ.43 వేలు సోమవారం కీసరలోని కలెక్టర్ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్‌భవన్‌లో సీనియర్ అసిస్టెంట్ చంద్రకిరణ్ నగదు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ పట్టుకున్నారు. అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్ దామోదర్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఇద్దరినీ ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామని ఏసీబీ అధికారులు తెలిపారు.



# పొంగుతున్న గంగ

## కన్నెపల్లి పంపుహౌస్‌లో మరో మోటర్ స్విచాన్

- మూడు మోటర్లతో నీటి ఎత్తిపోత
- గ్రావిటీ కెనాల్‌లోకి దుంకుతున్న గోదావరి నీరు
- అన్నారం బరాజ్‌కు రోజుకు 6,300 క్యూసెక్కులు
- నేటినుంచి పనిచేయనున్న నాలుగో మోటర్
- మేడిగడ్డ బరాజ్‌లో మొత్తం నలభై గేట్ల మూసివేత



గేట్లు మూసివేయడంలో మేడిగడ్డ బరాజ్‌లో నిలిచిన గోదావరి జలాలు

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వర గంగ పొంగుతున్నది. గోదావరిలో కలుస్తున్న ప్రాణహిత వరదనీటి ప్రవాహానికి అనుగుణంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద జలాల ఎత్తిపోత క్రమేణా పెరుగుతున్నది. ఆదివారం వరకు రెండు మోటర్లతో నీటిని ఎత్తిపోసిన ఇంజినీర్లు.. సోమవారం మధ్యాహ్నం 12.09 గంటలకు మూడో నంబర్ మోటర్‌ను కూడా ప్రారంభించారు. ఒక్కోమోటర్ రోజుకు 2100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండటంతో కన్నెపల్లి-అన్నారం గ్రావిటీ కెనాల్ ద్వారా మూడు మోటర్ల నుంచి రోజుకు సుమారు 6,300 క్యూసెక్కుల నీరు అన్నారం బరాజ్‌కు చేరుతున్నది. నిర్విరామంగా నీటిని ఎత్తిపోస్తుండటంతో గ్రావిటీ కెనాల్ నీటితో నిండుగా కనబడుతున్నది. గ్రావిటీ కాల్వ ద్వారా గోదావరి నీరు 13.34 కిలోమీటర్లు ప్రయాణించి అన్నారం బరాజ్‌కు చేరుతుంది. సోమవారం సాయంత్రం వరకు 0.6 టీఎంసీల నీరు అన్నారం బరాజ్‌లోకి చేరినట్లు సాగునీటిశాఖ ఇంజినీర్లు వెల్లడించారు.

### నేడు నాలుగో మోటర్ ప్రారంభం

కన్నెపల్లి పంపుహౌస్ మోటర్లలో ఆరింటిని గోదావరి జలాల ఎత్తిపోతకు ఇంజినీర్లు సిద్ధం చేశారు. వీటిలో ఆరో మోటర్ వెట్‌రన్‌ను గత జూన్ 21వ తేదీన సీఎం కేసీఆర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. కొద్దిరోజులుగా మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది నుంచి వరదనీరు గోదావరిలోకి వస్తున్నది. దీనితో ఆ నీటిని ఎత్తిపోసేందుకు ఒకదాని తర్వాత ఒకటిగా మోటర్లను ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే 1, 3, 6వ నంబర్ మోటర్లు నిరంతరం గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నాయి. వీటికితోడు మంగళవారం నాలుగో నంబర్ మోటర్‌ను ప్రారంభించనున్నారు. తదుపరి దశల్లో ఐదోనంబర్, రెండో నంబర్ మోటర్లను ప్రారంభించే సన్నాహాల్లో ఉన్నారు. మంగళవారం నుంచి మొత్తం నాలుగు మోటర్లతో నిరంతరం గోదావరి జలాల ఎత్తిపోత కొనసాగనుందని ఇరిగేషన్ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు. ప్రాణహిత నుంచి వచ్చి గోదావరిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంతవరకు రివర్స్ పంపింగ్ ద్వారా అన్నారం బరాజ్‌కు తరలించే లక్ష్యంతో సాగునీటిశాఖ ఇంజినీర్లు ముందుకు సాగుతున్నారు. మోటర్ల తయారీదారులు, పంపుల డిజైనర్లు, సాంకేతిక నిపుణులు, సాగునీటిశాఖ ఇంజినీర్లు కొన్నిరోజులుగా కన్నెపల్లి పంపుహౌస్ వద్దే ఉండి శ్రమిస్తున్నారు.

### మేడిగడ్డలో మరో పది గేట్ల మూసివేత

గోదావరిలో సోమవారం 29 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు సాగునీటిశాఖ ఇంజినీర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బరాజ్ గేట్లలో మరో పదింటిని మూసివేశామని ప్రాజెక్టు ఈఈ వెంకటరమణారెడ్డి చెప్పారు. ఇప్పటికే 30 గేట్లు మూసివేసిన సంగతి తెలిసిందే. మిగిలిన 45 గేట్ల మూసివేతపై నీటిప్రవాహానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. వర్షాలు లేకపోయినా ప్రాణహిత నుంచి వచ్చే నీటితో గోదావరిలో సాధారణంగా 95 మీటర్ల నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున కన్నెపల్లి పంపుహౌస్‌లోని ఆరు మోటర్లతో నిరంతరం పంపింగ్ నిర్వహించవచ్చని చెప్పారు. రివర్స్ పంపింగ్‌తో అన్నారం బరాజ్‌లో రోజురోజుకు నీటినిల్వ పెరుగుతుండటంతో తదుపరి దశలో ఇక్కడినుంచి సుందిల్ల బరాజ్‌కు నీటిని ఎత్తిపోసేలా ఏర్పాట్లు చేపట్టారు.

# దేశానికి దిక్సూచిగా నిలుద్దాం

## విద్యాభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్న సీఎం కేసీఆర్ పథకాలు

- ప్రాథమిక విద్య దశ నుంచే పరిశోధనలను ప్రోత్సహించాలి
- విద్యార్థుల్లో ప్రశ్నించే గుణాన్ని అణిచివేయవద్దు
- అక్రెడిటేషన్ జాతీయ వర్క్‌షాప్‌లో విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి




అక్రెడిటేషన్‌పై నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్ తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అమలుచేస్తున్న గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలు వంటి అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, విద్యారంగంలో కూడా దేశానికి దిక్సూచిగా నిలిచేలా కృషిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. చదువు ఉద్యోగాలు పొందడం కోసం కాకుండా జ్ఞానాన్ని పెంపొందించేలా ఉండాలన్నారు. సోమవారం హైదరాబాద్‌లో 'అక్రెడిటేషన్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ అండ్ ర్యాంకింగ్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికీ దేశంలో బ్రిటిష్ విద్యావిధానం కొనసాగుతున్నదని, స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా ఆ విద్యావిధానాన్ని మార్చలేకపోవడం బాధాకరమన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చదివి అమెరికా పోతున్నారే తప్ప.. దేశంలోనే ఉండి పరిశోధనలపై దృష్టి పెట్టడంలేదని విచారం వ్యక్తంచేశారు. ప్రాథమిక విద్యాస్థాయి నుంచే విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే సమసమాజ నిర్మాణం గురించి బోధించాలన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే గుణాన్ని అణిచివేయకుండా చూసినప్పుడే వారిలో మేధస్సు పెరుగుతుందని చెప్పారు. మార్కులు, డబ్బులే ప్రధానంగా నేటి చదువులు కొనసాగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు రావాల్సిన అవసరంపై సదస్సులో చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్, ఇంటర్ బోర్డు కమిషనర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. విద్యాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ పీజీ కాలేజీ ఆవరణలో సుమారు రూ.15 కోట్లతో నిర్మించిన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడెక్కడ ఉన్నత విద్యా ప్రమాణాలు బాగున్నాయో.. ఆ తరహా ఇక్కడ అమలుచేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. ప్రమాణాలకు అనుగుణంగా అధ్యాపకులను నియమించాలన్న ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రామచంద్రం, రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# వాతావరణంలో అనూహ్య మార్పులు

- క్లౌడ్ బరస్ట్.. హీట్ వేవ్స్.. కుండపోతలు.. ఎండ దెబ్బలు
- భూతాపమే ప్రధాన కారణమని తేల్చిన పీఐకే అధ్యయనం
- తెలంగాణకూ ముప్పు తప్పదని హెచ్చరిక
- 'టిప్పింగ్ ఎలిమెంట్'తో కచ్చితమైన అంచనాలు
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ ఆధ్వర్యంలో విస్తృత పరిశోధన




**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఉదయం నుంచే భరించరాని ఎండలు.. ఆ తర్వాత ఉన్నట్టుండి ఆకాశం బద్దలైనట్లు కుండపోత వర్షాలు.. వానకాలంలో కూడా వేసవిని తలపించేలా అధిక ఉష్ణోగ్రతలు.. ఇలా మున్ముందు వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటాయని ఇండో-జర్మన్ వాతావరణ ప్రాజెక్ట్, పాట్స్ డామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లైమెట్ ఇంపాక్ట్ రీసెర్చ్ (పీఐకే) శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. భూతాపం వల్ల ఇప్పటికే కొంతమేర గతితప్పిన వాతావరణం.. రానున్న దశాబ్దాల్లో మరింత దిగజారుతుందని పీఐకే పేర్కొన్నది. ఈ ప్రభావం దక్కన్‌పీఠ భూమిలో ఉన్న తెలంగాణపై ఉంటుందని ఆ సంస్థ అంచనావేసింది. రాబోయే 30 లేదా 50 ఏండ్లలో వచ్చే అనూహ్య వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని ముందుగానే మేల్కోవాలని, సరైన ముందు జాగ్రత్తలు చేపట్టకపోయినా, వాతావరణానికి తగ్గట్టుగా పంట విధానాలను మార్చుకోకపోయినా భవిష్యత్‌లో తీవ్ర ప్రతికూల ఫలితాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

### గడ్చిరోలి మీదుగా 'టిప్పింగ్ ఎలిమెంట్'

పెరుగుతున్న భూతాపం, సముద్రంతోపాటు భూమి ఉపరితలంలో వస్తున్న మార్పుల వల్ల వాతావరణ అంచనాలు తరుచూ తప్పుతున్నాయి. ఈ నేపథ్యంలో పీఐకే సంస్థ 'టిప్పింగ్ ఎలిమెంట్' అనే సరికొత్త విధానం ద్వారా రుతుపవనాల రాకపోకలను కచ్చితంగా అంచనా వేయగలుగుతున్నది. మన దేశంలో రుతుపవనాలు ఎప్పుడు, ఎక్కడ మొదలవుతున్నాయి? ఏ పరిస్థితుల్లో వర్షాలు కురుస్తున్నాయి? అనే విషయంపై ఆ సంస్థ కొన్ని సంవత్సరాలపాటు అధ్యయనం చేసింది. ఇండో-జర్మన్ వాతావరణ ప్రాజెక్టు అనుసంధానకర్త, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ (వేములవాడ) ఆధ్వర్యంలో 2016లో దక్కన్ పీఠభూమిలో మొదలైన ఈ అధ్యయనం హైదరాబాద్ కేంద్రంగా చాలా రోజులపాటు కొనసాగింది. ఈ పరిశోధనలో ప్రముఖ మహిళా శాస్త్రవేత్త ఎలెనా సురోవాటికినా ప్రధాన పాత్ర పోషించారు. ఈ పరిశోధన కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) మొదలుకొని, భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వరకు వివిధ సంస్థ నుంచి డాటాను తీసుకుని వర్షాలకు అసలు మూలాన్ని కనుగొన్నారు. తూర్పు కనుమల పరిధిలోని గడ్చిరోలి అటవీ ప్రాంతాన్ని కేంద్రంగా తీసుకుని మధ్య భారతం నుంచి ఉత్తర పాకిస్థాన్ వరకు వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నారు. అరేబియా సముద్రం, బంగాళాఖాతం ఉపరితలాలతోపాటు భూఉపరితలంలో మార్పులను గమనించారు. ఓవైపు ఎండలు తీవ్రమై వేడి పెరుగడం.. అదే సమయంలో గాలిలో తేమ పెరుగడం ద్వారా ఇవి రెండూ (వేడి, తేమ) కలిసినప్పుడు రుతుపవనాలు ఆరంభమవుతున్నట్టు తేలింది. దీంతో 'టిప్పింగ్ ఎలిమెంట్' విధానం ద్వారా మూడేండ్ల నుంచి వాతావరణ మార్పులను సరిగ్గా అంచనా వేయగలిగారు. తూర్పు కనుమలను మహారాష్ట్రలోని తూర్పు దక్షిణ ప్రాంతాన్ని, ఛత్తీస్‌గఢ్‌లోని పశ్చిమ ప్రాంతాన్ని, ఉత్తర తెలంగాణను కేంద్రంగా చేసుకుని నిర్వహించిన ఈ పరిశోధనలు వాస్తవమయ్యాయి.

### యాంటీ సైక్లోన్‌తో ప్రతికూల పరిస్థితి

ఈ ఏడాది రుతుపవనాలు జూన్ రెండో వారంలో ప్రారంభమవుతాయని.. అయితే అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడే రెండు తుఫాన్లు రుతుపవనాల గమనాన్ని కొన్ని రోజుల వరకు అడ్డుకుంటాయని మే నెలలోనే పీఐకే ప్రకటించింది. మరోవైపు అరేబియా సముద్ర ఉత్తర ప్రాంతంపై యాంటీ సైక్లోన్ వాతావరణం వల్ల రుతుపవనాలు భారత ఉపఖండం వైపునకు మళ్లకుండా ప్రతికూల పరిస్థితి ఏర్పడుతుందని, కనుక తెలంగాణలో రుతుపవనాల గమనాన్ని అంచనా వేయడం సవాలేనని పేర్కొంది. ఈసారి అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య రుతుపవనాల గతిని 'వాయు' తుఫాన్ మార్చివేసిందని, దాని ప్రతికూల ప్రభావం తెలంగాణపై పడిందని పీఐకే వెల్లడించింది. గతేడాది మధ్య భారతం నుంచి రుతుపవనాల ఉపసంహారణ ఎప్పుడు మొదలవుతుందన్న విషయాన్ని ముందుగానే పసిగట్టిన పీఐకే.. 2017. 2016లో కూడా రుతుపవనాల ఆగమనాన్ని, ఉపసంహారణను చాలా కచ్చితంగా అంచనా వేసింది. ఈ సంస్థ నిర్వహిస్తున్న వాతావరణ పరిశోధనలు విజయవంతమవుతుండటంతో 'టిప్పింగ్ ఎలిమెంట్' విధానం ప్రపంచమంతటా అనుసరణీయంగా మారుతున్నది.

### మేల్కొనకపోతే మరింత ముప్పు తప్పదు: చెన్నమనేని రమేశ్



**భూతాపం** నానాటికీ పెరుగుతుండటంతో వాతావరణంలో అనూహ్య మార్పులు సంభవిస్తున్నాయని, ముంబైలో వానకాలం మొత్తంలో కురవాల్సిన 80 సెంటీమీటర్ల వర్షం కేవలం 48 గంటల్లోనే కురవడం ఇందుకు ఉదాహరణ అని పీఐకే వెల్లడించింది. హైదరాబాద్‌లో కూడా పలుసార్లు క్లౌడ్‌బరస్ట్ లాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని, ఇవి ఎక్కువైతే ఆకస్మిక వరదలతో మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని చెన్నమనేని రమేశ్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఏటా సగటున 1.2 రోజులు మాత్రమే భరించలేనంత ఎండలుంటున్నాయని, కానీ ఈ సగటు 20 రోజులకు చేరే రోజు ఎంతో దూరంలో లేదని, ఒకేచోట కుండపోతగా వానలు కురవడం, మరోవైపు ఎండలు మంటలు రేపడం లాంటి అనూహ్య పరిణామాలు 60 శాతానికి పెరుగుతాయని పేర్కొన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, సంప్రదాయ వ్యవసాయ విధానాలు పంటలను తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న 30 ఏండ్లలో సంభవించే పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే వాతావరణాన్ని కాపాడుకోవాలని, లేకపోతే పరిస్థితి చేయిదాటుతుందని హెచ్చరించారు. వాతావరణాన్ని అంచనా వేసేందుకు ఐఎండీ అనుసరిస్తున్న సంప్రదాయ పద్ధతులతో సత్ఫలితాలు రావడంలేదని, ఇందుకోసం 'టిప్పింగ్ ఎలిమెంట్' లాంటి విధానాన్ని అనుసరించడం శ్రేయస్కరమని ఎమ్మెల్యే రమేశ్ పేర్కొన్నారు.



రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ బీసీ కమిషన్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భగవాన్‌లాల్ సహానీ. చిత్రంలో వైస్‌చైర్మన్ లోకేశ్‌కుమార్ ప్రజాపతి. రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు కూడా ఉన్నారు.



సోమవారం దిల్‌కుషా అతిథిగృహంలో రాష్ట్ర బీసీ కమిషన్, బీసీ సంక్షేమశాఖ అధికారులతో సమావేశమైన జాతీయ బీసీ కమిషన్ సభ్యులు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, డీజీపీ మహేందర్‌రెడ్డి, కమిషన్ సభ్యులు కూడా ఉన్నారు.

# తెలంగాణలో బీసీ సంక్షేమ పథకాలు భేష్

- భవిష్యత్‌తరాలకు ఎంతో ప్రయోజనం
- జాతీయ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల ప్రశంస
- రాష్ట్ర బీసీ కమిషన్, ఉన్నతాధికారులతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వెనుకబడినవర్గాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు అద్భుతంగా ఉన్నాయని జాతీయ బీసీ కమిషన్ ప్రశంసించింది. జాతీయ బీసీకమిషన్ చైర్మన్ భగవాన్‌లాల్ సహానీ, వైస్‌చైర్మన్ లోకేశ్‌కుమార్ ప్రజాపతి, సభ్యులు కశలేంద్రసింగ్ పాటిల్, సుధాయాదవ్, తల్లోజు ఆచారి సోమవారం రాష్ట్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా దిల్‌కుషా అతిథిగృహంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్.రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ సభ్యకార్యదర్శి అనితారాజేంద్రతో జాతీయ బీసీ కమిషన్‌తో సమావేశమయింది. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల వివరాలు, బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల వివరాలు, బీసీ నిరుద్యోగులకు ఉపాధి హామీ పథకాలు, బీసీ స్టడీ సర్కిళ్ల నిర్వహణ వంటి అంశాలను జాతీయ బీసీ కమిషన్‌కు రాష్ట్ర అధికారులు వివరించారు. అనంతరం జాతీయ బీసీ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.. బీసీ గురుకులాలు, కల్యాణలక్ష్మి, ఓవర్సీస్ విద్యానిధి పథకాలు భవిష్యత్‌తరాలకు ఎంతో ప్రయోజనంకరంగా ఉంటాయన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ జాబితాలో ఉన్న పలు కులాలను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చకపోవడం వల్ల వారు కేంద్ర విద్య, ఉద్యోగాల్లో నష్టపోతున్నారని.. బుక్కాఅయ్యవార్లు, గోత్రాల, బొందిలి తదితర 15కు పైగా కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు జాతీయ బీసీ కమిషన్‌ను కోరారు

### వివరాలు సేకరించిన జాతీయ బీసీ కమిషన్

తెలంగాణలో వివిధ సంక్షేమ పథకాల వివరాలు, విద్య, ఉద్యోగాల్లో బీసీల వాటా, బీసీల సమస్యలపై జాతీయ బీసీ కమిషన్ వివరాలను సేకరించింది. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి పథకం ద్వారా బీసీవర్గానికి చెందిన యువతులకు రూ.1,00,116 ఆర్థిక సహాయం, బీసీ గురుకులాల ద్వారా నాణ్యమైన విద్య అందుకుంటున్న విద్యార్థులు, పూలే విదేశీ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత చదువుల కోసం బీసీ ఓవర్సీస్ పథకం ద్వారా రూ.20 లక్షల ఆర్థికసహాయం వివరాలను సీఎస్ ఎస్కే జోషి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు వివరించారు. ఈ పథకాలు బీసీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని బీసీ కమిషన్ ప్రశంసించింది. జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ భగవాన్‌లాల్ సహానీ, వైస్‌చైర్మన్ లోకేశ్‌కుమార్ ప్రజాపతి, సభ్యులు కశలేంద్ర సింగ్ పాటిల్, సుధాయాదవ్, తల్లోజు ఆచారిని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ సోమవారం దిల్‌కుషా అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాసమల్ల బాలకిషన్, ప్రధానకార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు జాతీయ బీసీ కమిషన్ ప్రతినిధులకు వినతిపత్రం సమర్పించారు.

### బీసీల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ భగవాన్‌లాల్ సహానీ

**రవీంద్రభారతి:** బీసీల జీవితాల్లో వెలుగు నింపి.. వారిని అన్నిరంగాల్లో అభ్యున్నతికి తీసుకురావడమే ధ్యేయంగా జాతీయ బీసీ కమిషన్ ముందుకెళ్తున్నదని చైర్మన్ భగవాన్‌లాల్ సహానీ అన్నారు. రాజ్యాంగహోదాతో ఏర్పడిన తర్వాత జాతీయ బీసీ కమిషన్ తన మొదటి పర్యటన తెలంగాణలో నిర్వహిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు వివిధ బీసీ కుల సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, కార్మిక సంఘాలతో జాతీయ బీసీ కమిషన్ సోమవారం రవీంద్రభారతిలో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘాల నేతలు చైర్మన్ భగవాన్‌లాల్‌కు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో వివక్షకు గురవుతున్న కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీసీ కులవృత్తులను కాపాడేందుకు కమిషన్ కృషిచేస్తున్నదన్నారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీల బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కమిషన్ కృషిచేయాలన్నారు.

# మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి

మూడోపేజీ తరువాయి...

ఉత్సాహం చూపుతున్నందున వారు స్వచ్ఛందంగా సభ్యత్వం స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేకకౌంటర్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్లో కూడా సభ్యత్వ నమోదుకు కృషిచేయాలని చెప్పారు. ఎప్పుడైనా పురపాలికల ఎన్నికలుండే అవకాశమున్న నేపథ్యంలో పట్టణాల్లో నమోదు సాధ్యమైనంత త్వరగా, వీలైనంత ఎక్కువమందిని చేర్చేలా చూడాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకుల సందేశాలను కేబుల్‌టీవీలతోపాటు సామాజిక మాధ్యమాలను వాడుకొని యువతను సభ్యత్వానికి కదిలించాలని చెప్పారు.

### పార్టీ నేతలకు కేటీఆర్ అభినందన

సభ్యత్వ నమోదు చురుకుగా సాగుతున్నదన్న కేటీఆర్.. కార్యక్రమంలో పాల్గొంటున్న పార్టీ శ్రేణులను అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సీనియర్ నాయకులు సమిష్టిగా ఎక్కడిక్కడ సభ్యత్వనమోదు కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని తీసుకుపోవాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయపనులు ప్రారంభమైన నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పార్టీ అనుబంధసంఘాలు ఈ కార్యక్రమంలో మరింత క్రియాశీలం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా బీడీ కార్మికులు, భవననిర్మాణ కార్మికులు, ఆటోడ్రైవర్ల దగ్గరికి నేరుగా వెళ్లాలన్నారు. ఇప్పటిదాకా జరిగిన పార్టీ సభ్యత్వనమోదుపై ఎప్పటికప్పుడు మండలాలు, పట్టణాలవారీగా నమోదు, పుస్తకాలు తిరిగి ఇవ్వడం, వాటి డిజిటలీకరణ ఎంతవరకు పూర్తయింది వంటి వివరాలను పార్టీకి అందించాలని కేటీఆర్ కోరారు. వాటిని ఎప్పటికప్పుడు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు అందిస్తామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో అంతటా పండుగ వాతావరణంలో సభ్యత్వనమోదు కొనసాగుతున్నదని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంచార్జులు కేటీఆర్‌కు తెలిపారు. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గానికి 50 నుంచి 60 వేల సభ్యత్వనమోదు లక్ష్యాలను గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE






రైతు శ్రీనివాస్‌రావు సమస్యపై ఆరా తీస్తున్న నల్లగొండ జేసీ చంద్రశేఖర్

## శ్రీనివాస్‌రావుకు త్వరలో పాస్‌బుక్ ఇస్తాం

- 'భూమి ఉన్నా దక్కని రైతుబీమా' కథనానికి స్పందన
- తిప్పర్తి తాసిల్‌లో విచారణచేపట్టిన నల్లగొండ జేసీ చంద్రశేఖర్

**తిప్పర్తి:** 'నమస్తే తెలంగాణ'లో 'భూమి ఉన్నా దక్కని రైతుబీమా' శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనానికి నల్లగొండ జేసీ చంద్రశేఖర్ స్పందించారు. అర్హులైన రైతులందరికీ వారం రోజుల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. తిప్పర్తి తాసిల్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలోని ఇండ్లూరుకు చెందిన రైతు నాగులంచ శ్రీనివాస్‌రావు సమస్యపై ఆరా తీశారు. శ్రీనివాస్‌రావు భూమిని రికార్డుల్లో నమోదుచేశామని, పాస్‌బుక్ జారీచేయడంలో జాప్యం జరిగిందని అధికారులు జేసీకి వివరించారు. త్వరలో పాస్‌పుస్తకం జారీచేస్తామన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 90 శాతం భూసమస్యలు పరిష్కరించామని, మిగిలినవి వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు. పాస్‌పుస్తకాల్లో ఉన్న తప్పులను వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వీఆర్వోలపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

## శ్రీనివాస్‌గౌడ్ సమస్యను పరిష్కరిస్తాం

- 'ఏడిపిస్తున్నారు' కథనానికి భిక్కనూర్ తాసిల్దార్ స్పందన
- సమస్యను రెండురోజుల్లో పరిష్కరిస్తానని బాధితుడికి హామీ

**కామారెడ్డి నమస్తే తెలంగాణ:** ఎలాంటి వివాదం లేని భూమికి పాస్‌పుస్తకం ఇవ్వకుండా 'ఏడిపిస్తున్నారు' శీర్షికతో సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథానానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు శివారులో బాధిత రైతు జేపీ శ్రీనివాస్‌గౌడ్ సర్వే నంబర్లు 1316, 1317లో వేర్వేరుగా 1.04 ఎకరాలు కొన్నారు. ఇందులో 14 గుంటల భూమి తనదేనంటూ మరో వ్యక్తి తప్పుడు పత్రాలతో అధికారులకు ఫిర్యాదుచేశారు. మిగతా 30 గుంటల భూమి విషయంలో ఎలాంటి వివాదం లేకపోయినా పార్ట్-బీలోకి నెట్టేసి పాస్‌బుక్ ఇవ్వకుండా నాలుగేండ్లుగా తిప్పుకొంటున్నారు. దీనిపై కథనం ప్రచురితం కావడంతో తాసిల్దార్ వెంకన్న స్పందించారు. బాధితుడిని పిలిపించుకొని సాఫీగా ఉన్న 30 గుంటల భూమికి పాస్‌పుస్తకం ఒక్క రోజుల్లో ఇస్తామని, మిగతా 14 గుంటల సమస్యను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు.

## తీరిన భూదేవి భూసమస్య

- 'తక్కువ భూమిరాసి.. సతాయిస్తుండ్రు' కథనానికి స్పందన

**ఆదిబట్ల:** ఏప్రిల్ 23న 'నమస్తే తెలంగాణ'లో 'తక్కువ భూమి రాసి.. సతాయిస్తుండ్రు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. భూదేవి అనే మహిళకు పాస్‌పుస్తకంలో తక్కువ భూమి రాసిన అధికారులు ఎట్టకేలకు బాధితురాలికి న్యాయంచేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ రెవెన్యూలోని సర్వే నంబర్ 377 ఆ/1లో భూదేవికి మూడెకరాల పట్టా భూమి ఉన్నది. ఇందులో 1.8 ఎకరాల భూమిని ఔటర్ రింగ్ రోడ్ కోసం తీసుకొన్నారు. మిగిలిన 1.32 ఎకరాల భూమిని కొత్త పాస్‌బుక్‌లో నమోదు చేయాల్సిన అధికారులు, కేవలం 24 గుంటలు మాత్రమే ఎక్కించారు. దీనిపై ఏప్రిల్ 23న కథనం ప్రచురితం కావడంతో అధికారులు సర్వే చేశారు. భూదేవికి 1.32 ఎకరాల భూమి ఉన్నట్టు గుర్తించి ఇబ్రహీంపట్నం తాసిల్దార్ వెంకటేశ్వర్లు రికార్డుల్లో నమోదు చేశారు. సోమవారం భూదేవికి పాస్‌పుస్తకాన్ని అందించారు.



భూదేవికి పాస్‌బుక్ అందజేస్తున్న ఇబ్రహీంపట్నం తాసిల్దార్ వెంకటేశ్వర్లు

# లక్ష ఇస్తేనే పాస్‌బుక్!

- జారీ అయిన పాస్‌పుస్తకానికి వీఆర్వో మోకాలడ్డు
- లంచం ఇవ్వలేదని కౌలుదారుతో కలిసి పట్టా మార్పునకు కుట్ర
- సాదాబైనామా సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన తాసిల్దార్
- పట్టని కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్.. ఆన్‌లైన్‌లో మరొకరి పేరుతో పహాణీ
- ధర్మగంటను ఆశ్రయించిన పెద్దపల్లి జిల్లా బాధితురాలు నర్సమ్మ



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన ఆర్కుటి నర్సమ్మ ఉపాధి నిమిత్తం తల్లిగారి ఊరైన కమాన్‌పూర్ మండలం గొల్లపెల్లికి వలసవెళ్లారు. చిన్నకల్వలలో సర్వే నంబర్ 135Eలో ఆమెకు 2.10 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. భూరికార్డుల ప్రక్షాళనలో ఈ భూమికి 1052 నంబర్‌తో పాస్‌బుక్ జారీ అయింది. గతంలో ఈ భూమిని ఆమె బంధువైన ఆర్కుటి గట్టయ్యకు కౌలుకు ఇచ్చారు. ఆరేడేండ్లు కౌలుచేసుకొన్న ఆయన.. నర్సమ్మ స్థానికంగా ఉండని విషయాన్ని ఆసరాగా చేసుకొని ఆ భూమి తనదేనని, తానే యజమానినంటూ గ్రామస్థులతో చెప్పుకొంటూవచ్చాడు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో అధికారులు వచ్చి రికార్డులను పరిశీలించి, ఆమె పేరు మీదే కంప్యూటర్ పహాణీ కూడా జారీచేశారు. త్వరలోనే పాస్‌పుస్తకం ఇస్తామనిచెప్పారు. అందరికీ పాస్‌బుక్‌లు వచ్చి, రైతుబంధు డబ్బులు అందినా.. తనకు రాకపోవడంతో నర్సమ్మ.. వీఆర్వో కృష్ణను కలిశారు. ఎన్నిసార్లు అడిగినా రేపు మాపు అంటూ బుకాయిస్తూ వచ్చాడు. పాత తాసిల్దార్ బదిలీ కావడంతో.. కొత్త తాసిల్దార్ వచ్చాక ఇస్తామని చెప్పుకొచ్చాడు. నర్సమ్మ గట్టిగా నిలదీస్తే పాస్‌బుక్ ఇచ్చేందుకు వీఆర్వో రూ.లక్ష లంచంగా ఇవ్వాలని డిమాండ్‌చేశాడు. తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయి.. మేం పేదవాళ్లం అంత డబ్బు ఇచ్చుకోలేమని బాధితురాలు ప్రాధేయపడ్డా కనికరించలేదు. లంచమివ్వనందుకు కక్ష పెంచుకొని పాస్‌బుక్ ఇవ్వలేదు.

**కౌలుదారుతో కలిసి కుట్రలు**

గతంలో కౌలుచేసిన గట్టయ్య ఈ భూమిని ఎలాగైనా స్వాధీనం చేసుకొనేందుకు నర్సమ్మపై పలుమార్లు వత్తిడి తీసుకొచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో రెవెన్యూ అధికారులతో కలిసి కుట్ర పన్నాడు. సాదాబైనామా సృష్టించి, ఫోర్జరీ సంతకాలతో పట్టా ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు పెట్టుకొన్నాడు. అతడికి వీఆర్వో సహకరించాడని బాధితురాలు ఆరోపించారు. గతంలోఉన్న తాసిల్దార్ గట్టయ్య తీసుకొచ్చిన సాదాబైనామాను అంగీకరించలేదు. కానీ కొత్తగా వచ్చిన తాసిల్దార్ అంగీకరించి గట్టయ్య పేరిట రిజిస్ట్రేషన్ చేశా డు. ఈ భూమిలో నర్సమ్మ 2018 అక్టోబర్‌లో పత్తిపంట వేసుకోగా, గట్టయ్య నాగలితో దున్ని ధ్వంసంచేశాడు. దీంతో సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. క్రైం నంబర్ 301/ 2018 యూ/ఎస్ 447,427, 506ఆర్/డబ్ల్యూ, 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ప్రస్తుతం కేసు విచారణలో ఉన్నది. భూమిలో ఇతరులు ప్రవేశించరాదని నర్సమ్మ పెద్దపల్లి కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డర్ సైతం తెచ్చుకొన్నారు. ఈ ఆర్డర్‌ను రెవెన్యూ అధికారులు పక్కనబెట్టి సాదాబైనామా కింద గట్టయ్యకు పట్టా చేశారు. వారంరోజుల క్రితం ఆరాతీస్తే ఆర్కుటి గట్టయ్య పేరుతో పహాణీ, పట్టాదారు పాస్‌పుస్తకాలు సిద్ధం చేసినట్టు తెలిసిందని, రెవెన్యూ అధికారులు వాస్తవాలను తెలుసుకొని తనకు న్యాయంచేయాలని నర్సమ్మ కోరుతున్నారు. ఈ విషయంపై వీఆర్వో కృష్ణను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన స్పందించలేదు.

# నెన్నెల తాసిల్ ఎదుట ధర్నా

అధికారులు రాత్రికి రాత్రే పట్టా మార్చారని రైతు కుటుంబం ఆరోపణ

56 ఏండ్ల కింద కొన్న భూమిని మరొకరికి చేశారని ఆగ్రహం ● హైకోర్టు కేసునూ పట్టించుకోలేదని ఆందోళన



నెన్నెల తాసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతు కుటుంబసభ్యులు

**నెన్నెల:** దశాబ్దాల కింద కొన్న భూమిని రెవెన్యూ అధికారులు రాత్రికి రాత్రే మరొకరికి పట్టాచేశారని, ఒక పక్క దీనిపై హైకోర్టులో కేసు నడుస్తుండగానే పట్టా మార్పిడిచేశారని ఆరోపిస్తూ మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం బొప్పారం బాధిత రైతు కుటుంబం సోమవారం తాసిల్ ఎదుట ధర్నాకు దిగింది. బొప్పారంలోని సర్వే నంబర్ 613లో 6.33 ఎకరాల భూమిని 1963లో మిర్జా హమ్మద్ వద్ద గ్రామానికే చెందిన కర్నకొండ లచ్చయ్య కొన్నారు. లచ్చయ్య మృతిచెందడంతో ఆ భూమిని అతడి భార్య రాజు సాగు చేస్తున్నారు. లచ్చయ్య పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ చేయాలని పలుమార్లు రాజు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇదే భూమి తమదంటూ గ్రామానికే చెందిన పల్లె భీమయ్య రికార్డులు సృష్టించారు. వాటితో ఆ భూమి తమదేనని కోర్టుకు ఎక్కారు. జిల్లా కోర్టు పల్లె భీమయ్య రికార్డులు ఫోర్జరీవని గుర్తించింది. దీంతో భీమయ్య హైకోర్టును ఆశ్రయించారు. 13 ఏండ్లుగా కేసు నడుస్తూనే ఉన్నది. ఓ వైపు ఇలా కేసు ఉండగానే పల్లె భీమయ్య కొడుకులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొని ఆ భూమి తమదని ఫిర్యాదుచేశారు. దీనిపై విచారణ జరిపి పొజీషన్‌లో ఎవరు ఉన్నారో గుర్తించాలని బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. గతంలో దీనిపై ఎస్సై, తాసిల్దార్ల సమక్షంలో సర్వే కూడాచేశారు. ఈ సర్వే కర్నకొండ రాజుకు అనుకూలంగా వచ్చింది. సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దార్ జూలై 6న రాత్రి కర్నకొండ లచ్చయ్య పేరిట ఉన్న భూమిని పల్లె వెంకటేశం, చంద్రయ్య, నర్సయ్య, కిష్టయ్య పేరిట పట్టా మార్పిడిచేశారు. విషయం తెలుసుకొన్న కర్నకొండ రాజు కుటుంబం సోమవారం తాసిల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగింది. 56 ఏండ్ల నుంచి సాగుచేస్తున్నామని, కనీసం తమకు ఎలాంటి సమాచారం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆన్‌లైన్‌లో చూసేవరకు విషయంతెలియలేదని వాపోయారు. అధికారులు లంచం తీసుకొని పట్టామార్పిడి చేశారని ఆరోపించారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా ఎట్లా పట్టా మార్పిడిచేస్తరని ప్రశ్నించారు. పురుగుల మందు డబ్బా పట్టుకొని న్యాయం చేసే వరకు కదలనని తన కుటుంబసభ్యులతో అక్కడే కూర్చున్నారు. దీనిపై తాసిల్దార్ ప్రకాశ్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను పట్టా మార్పిడి చేశానని చెప్పారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని తెలిపారు. కాస్తులో మాత్రం కర్నకొండ రాజు ఉన్నారని, రికార్డుల ప్రకారం రాజు పొజీషన్‌లో ఉన్నారని పేర్కొన్నారు.



తిరుమలాయపాలెం తాసిల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

## మా భూసమస్యలు పరిష్కరించండి

తిరుమలాయపాలెంలో తాసిల్ ఎదుట రైతుల ధర్నా

**తిరుమలాయపాలెం:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం తాసిల్ కార్యాలయం ఎదుట రైతులు తమ భూసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళన నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 150 మంది రైతులు రెండు గంటలపాటు రెవెన్యూ కార్యాలయాన్ని దిగ్బంధించారు. ఈ సందర్భంగా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ జీయాఉద్దీన్, రైతు సంఘం నాయకులు అంగిరేకుల నర్సయ్య, సమాచార హక్కు సంఘం కార్యకర్త వెంకన్న తదితరులు మాట్లాడుతూ.. రైతుల భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు వీఆర్వోలు, మండలస్థాయి అధికారులు భారీస్థాయిలో డబ్బులు తీసుకొంటున్నట్టు ఆరోపించారు. భూరికార్డుల ప్రక్షాళనలో విధి విధానాలు పాటించకుండా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు గార్చారని మండిపడ్డారు. వీఆర్వోలు గ్రామస్థాయిలో విచారణ జరిపి అర్హులైన రైతులందరికీ పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ తాసిల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం సమర్పించారు. తాసిల్దార్ స్పందిస్తూ.. విచారణ జరిపి అవినీతికి పాల్పడే వీఆర్వోలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చారు.



నిర్మల్ జిల్లా కలెక్టర్ ప్రశాంతికి సమస్యను వివరిస్తున్న రైతు రఘువీర్‌రావు

## న్యాయం కోసం అర్ధనగ్న ప్రదర్శన

- నిర్మల్‌లో కలెక్టర్, జేసీ ఎదుట రైతు నిరసన

**నిర్మల్ టౌన్:** తమ పేరిట ఉన్న భూమిని సమీప బంధువులు వారి పేరిట పట్టా చేయించుకొని అన్యా యం చేశారని, దీనిపై తాసిల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఓ బాధితుడు నిర్మల్‌లో కలెక్టర్, జేసీ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. వరంగల్ జిల్లాకు చెందిన రఘువీర్‌రావు అత్తగారి ఊరు నిర్మల్ జిల్లా, ఖానాపూర్ మండలం, సత్తన్నపల్లి. సదరు రైతు సోమవారం నిర్మల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చారు. తన సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి నోటికి నల్లగుడ్డ కట్టుకొని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సత్తన్నపల్లిలో తన మామ తనకు 6.23 ఎకరాలను గిఫ్ట్ కింద ఇచ్చారని, తనకు తెలియకుండానే బంధువులు ఆ భూమిని వారి పేరిట పట్టా చేయించుకొన్నారని పేర్కొన్నారు. ఎన్నిసార్లు తాసిల్దార్‌ను కలిసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై ఆర్డీవో విచారణ జరిపి తగిన న్యాయం చేస్తారని కలెక్టర్ హామీ ఇవ్వడంతో బాధితుడు వెనుదిరిగారు.


**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

**RASHTRIYA INDIAN MILITARY COLLEGE, DEHRADUN - ENTRANCE EXAMINATION**
**NOTIFICATION No. 04/2019**

Rashtriya Indian Military College has issued Notification for the Entrance Examination for admission to VIII Class in the R.I.M.C. Dehradun for the **July- 2020 Term.** Boys who born between 02/07/2007 and 01/01/2009 are eligible to apply to the RIMC and the dates of examination are on **01/12/2019 (Sunday) and 02/12/2019 (Monday) at Hyderabad Only. The children from the Telangana State only are eligible to apply.**

**The Applications forms may be obtained directly from the RIMC, DEHRADUN Only** and the filled in applications should reach the Commissions office on or before **30th Sept 2019.** Notification and other details are available on the **website:www.tspsc.gov.in**

Sd/-
**Date. 08/07/2019.** **SECRETARY**
DIPR R.O. No.237-pp/CL/Advt/1/2019-20. Dt: 08/07/2019

JBREC EAMCET Code: JOGI
**JOGINPALLY B.R ENGINEERING COLLEGE (JBREC)**
(Sponsored by Joginpally B.R. Educational Society)
Accredited by NAAC B++, Affiliated to JNTUH, Approved by AICTE and is included under Section 2(f) of UGC Act 1956
Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), R.R District, Hyderabad-075
Website: www.jbrec.edu.in, Ph: 08413-235684 / 9704924777 / 9000723678 / 9676466680

**ADMISSION NOTIFICATION TO B.TECH B-CATEGORY SEATS**
Applications are invited for B.Tech B-Category seats for the Academic Year 2019-20

| Course - B.Tech | CSE | ECE | EEE | IT | MECH |
|---|---|---|---|---|---|
| INTAKE | 120 | 120 | 60 | 60 | 120 |
| B-CATEGORY SEATS | 36 | 36 | 18 | 18 | 36 |

Applications are invited for admission into B.Tech courses under B-Category seats for the Academic Year 2019-20 in the prescribed format available at website www.jbrec.edu.in. A Demand Draft/ Cash for Rs.2000/- Drawn in favor of "JOGINPALLY B.R. ENGINEERING COLLEGE" Payable at Hyderabad towards Registration Fee (Non-Refundable) and Submit Xerox copies of relevant Certificates on or before **31-07-2019** at the College/ Head Office. Admissions will be made as per the rules and regulations of Government of Telangana. Sd/- SECRETARY

**Hostel Facility available at campus for both Boys & Girls**

Head Office: 6-3-248/1/1/A, 4th Floor, Bhaskar Plaza, Road No.1, Banjara Hills, Hyd-34.
Ph: 040-23391979 / 23301523 / 9866388591 / 9704130091.

**KAKATIYA UNIVERSITY**
(Accredited with 'A' Grade by NACC)
**School of Distance Learning and Continuing Education (SDLCE)**
Vidyaranyapuri, Hanamkonda, Warangal 506 009 TS, India
(Ph : 0870-2438877, 2438899), Website: www.sdlceku.co.in, www.sdlcekuems.co.in

**ADMISSION NOTIFICATION**

Applications are invited for admission to the following courses for the academic year 2019-20 under year wise examination system. Application can be submitted through ONLINE / OFFLINE.

**UNDER-GRADUATE COURSES :** B.A.,/B.Com/B.Com-Computers/BL.ISc./BBA.

**POST-GRADUATE COURSES :** M.A. Political Science/Public Administration/Economics/Hindi/History / Sanskrit/English/Rural Development/ Telugu/ Sociology/Journalism/ HRM/ M.Com / MSW/M.Sc. Maths / M.Sc Psychology / M.Sc. Environmental Science.

| | |
|---|---|
| Sale and Reciept of Application Forms | 04-07-2019 to 28-08-2019 |
| Last date for Admissions without Late Fee | 05-08-2019 |
| Admissions with a Late Fee of Rs 100/- | 06-08-2019 to 18-08-2019 |
| Admissions with a Late Fee of Rs 200/- | 19-08-2019 to 28-08-2019 |

Application forms and prospectus can be downloaded from obtained from our website and SDLCE Head Office, KU or from the SDLCE Students Learner Centers Registration fee for UG & PG is Rs. 400/-. List of Students Learner Centers, Fee Particulars, Mode of Submission and other details can be had from prospectus or visit www.sdlceku.co.in & www.sdlcekuems.co.in Candidates may visit UGC-DEB website for rules and regulations inforce for ODL Systems.

**No. 225 /DP/SDLCE/KU/19, Dt: 03-07-2019** Prof. **G. VEERANNA** DIRECTOR




డోర్నకల్ తాసిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

## డోర్నకల్ తాసిల్‌కు తాళం వేసిన రైతులు

- తమ భూమి ఇప్పించాలని నిరసన
- పోలీసుల హామీతో ధర్నా విరమించిన బాధితులు

**గార్ల రూరల్ (డోర్నకల్):** తమ భూమి తమకు ఇప్పించాలని డిమాండ్‌చేస్తూ మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ మండలం, గొల్లచర్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని బాధిత రైతులు సోమవారం తాసిల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తంచేశారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన నామ శేషయ్యకు ముగ్గురు కుమారులు నామ సత్తయ్య, నామ బాబు, నామ వెంకయ్య ఉన్నారు. వీరికి వారసత్వంగా సర్వే నంబర్లు 42 బీ, 42 సీ, 374లలో 35 ఎకరాల భూమి ఉన్నది. కాగా, వీరి పాలివాడైన నామ భద్రయ్య పట్వారీగా పనిచేస్తున్న సమయంలో ఈ ముగ్గురి భూమిని తన పేరిట పట్టా చేయించుకొన్నారు. కాస్తులో సత్తయ్య, బాబు, వెంకయ్య ఉన్నప్పటికీ పట్టా మాత్రం భద్రయ్య పేరిటే ఉన్నది. తమ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించిన భద్రయ్యపై చర్యలు తీసుకొని తమ భూమిని తమపేరిట పట్టాచేయాలని ఐదేండ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం తమ భూమిని తమకు పట్టా చేయించాలని కోరుతూ ముగ్గురు అన్నదమ్ములు కుటుంబ సభ్యులతో కలిసి తాసిల్ కార్యాలయానికి తాళం వేసి ధర్నాచేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకొన్నారు. భూములను అక్రమంగా పట్టా చేయించుకొంటున్న వారిని శిక్షించాలని కోరారు. ఈ విషయం తెలుసుకొన్న ఎస్సై రవీందర్ అక్కడికి వచ్చి బాధిత రైతులతో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు.

## మా భూములకు పాస్‌బుక్‌లు ఇవ్వండి

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ తాసిల్ ఎదుట రైతుల ధర్నా



వెల్దండ తాసిల్ ఎదుట బైఠాయించిన చెదురుపల్లి రైతులు

**వెల్దండ:** భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దం డ మండలం, చెదురుపల్లి రైతులు తాసిల్ కార్యాల యం ఎదుట ఆందోళనకు దిగారు. మండల పరిధిలో ని చెదురుపల్లి, మల్లయ్యగుండుతండా, ఉబ్బలగట్టుతండా, రావిచెట్టుబావితండా, పోచమ్మగడ్డ తండా, దుబ్బతండా, ఇదమ్మబండతండాలకు చెందిన 300 మంది రైతులకు చెదరుపల్లి శివారులోని సర్వే నంబర్ 32లో 280 ఎకరాల భూమి ఉన్నది. 70 ఏండ్లుగా సాగుచేసు కుంటున్నా కొత్త పాస్‌బుక్‌లు ఇవ్వక పోవడంతో రైతుబంధు కోల్పోతున్నామని వాపోయారు. ఉప తాసిల్దార్ వెంకట్‌రమణకు వినతిపత్రం అందజేశారు.



జల్లాపల్లిఫారం పంచాయతీలో వీఆర్వోను నిర్బంధించిన గ్రామస్థులు

## పాస్‌బుక్‌ల కోసం వీఆర్వో నిర్బంధం

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జల్లాపల్లిఫారంలో ఘటన

**కోటగిరి:** పాస్‌పుస్తకాల కోసం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జల్లాపల్లిఫారం గ్రామస్థులు వీఆర్వో కిష్టారెడ్డిని సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. గ్రామానికి చెందిన 63 మంది రైతులు పాస్‌పుస్తకాల కోసం ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై కొన్ని రోజుల కిందట గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు వీటి విషయమై ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. సోమవారం ఈ విషయమై వీఆర్వోను అడుగగా.. ఎలాంటి సమాధానం చెప్పకపోవడంతో నిర్బంధించారు. మండల ఇంచార్జి తాసిల్దార్ విఠల్‌కు విషయం చెప్పగా.. ఆయన హుటాహుటిన గ్రామానికి వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. రైతుబంధు చెక్కులు వస్తున్నా పాస్‌పుస్తకం రావడం లేదని బాధితులు వాపోయారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాస్‌పుస్తకాలు వచ్చేలా కృషి చేస్తానని తాసిల్దార్ భరోసా ఇచ్చారు. దీంతో గ్రామస్థులు వీఆర్వోను వదిలిపెట్టారు.

## భూమి కోసం తుమ్మిళ్ల రైతుల ధర్నా



పురుగుల మందు డబ్బాలతో రాజోళి తాసిల్ కార్యాలయం ఎదుట బాధిత రైతులు

**రాజోళి:** వారసత్వ భూమి కోసం తాము ఏండ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని, తమ భూమి తమకు దక్కేలాచేయాలని కోరుతూ జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం తుమ్మిళ్ల రైతులు తాసిల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తుమ్మిళ్లకు చెందిన రైతులు 1977లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొన్నందుకు అప్పటి ప్రభుత్వం తమ పెద్దలకు ఐదెకరాల చొప్పున నలుగురుకి 20 ఎకరాలు కేటాయించిందని, కౌలు పేరుతో ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన కొందరు ఆ భూమిని కబ్జాచేయగా.. అధికారులు కూడా వారి పేరిటే పట్టాచేశారని బాధితులు కమ్మరి బ్రహ్మయ్య, దాసరి శ్రీరాములు, కుర్వ మద్దిలేటి ఆరోపించారు. తమకు న్యాయంచేయాలని అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీంతో విసిగిపోయి ఆత్మహత్య చేసుకొనేందుకు పురుగుల మందు డబ్బాలను తీసుకొని ఇక్కడికి వచ్చామని తెలిపారు. తమకు న్యాయం జరుగకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. విషయం తెలుసుకొన్న ఏఎస్సై వేమన, తాసిల్దార్ పాండు నాయక్ వచ్చి సమస్యపై చర్చించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



రాజీనామాలు చేయటాన్ని కాంగ్రెస్ అగ్రనేతలే ప్రారంభించారు. కర్ణాటకలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. కర్ణాటకలో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. బీజేపీ ప్రజాస్వామ్య పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవిస్తుంది.

**రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర మంత్రి**

కర్ణాటకలో మా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేసింది. వారు మా ఎమ్మెల్యేలను ముంబాయిలోని ఫైవ్ స్టార్ హోటల్‌కు తీసుకెళ్లారు. కర్ణాటక, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేంద్ర నిఘాసంస్థలతో బెదిరించి రాజీనామాలు చేయిస్తున్నారు.



**అధిర్ రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత**

**చరిత్రలో నేడు**



**1401**
టర్క్-మంగోల్ యుద్ధం. బాగ్దాద్‌ను వశం చేసుకున్న తామర్‌లేన్ (తైమూర్)

**1810**
హాలాండ్‌ను ఆక్రమించిన నెపోలియన్.





**1926**
చైనా జాతీయ విప్లవ సైన్యానికి సుప్రీం కమాండర్‌గా చియాంగ్ కై షేక్.

ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికల వేళ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఎస్సీలకు ఉండే రిజర్వేషన్ సౌకర్యాలను ఓబీసీల్లోని 17 కులాలకు వర్తించే విధంగా నిర్ణయం తీసుకున్నది. నిజానికి ఎస్సీ విభాగంలో ఏ కులాలను కలుపాలన్నా, తీసివేయాలన్నా ఆ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉన్నది. కానీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఓబీసీలను ఎస్సీల్లో కలుపుతూ తీసుకున్న నిర్ణయానికి రాజ్యాంగబద్ధత లేదు. కాబట్టి ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు యూపీ ప్రభుత్వం కోటా రాజకీయాలను చేయటం పట్ల సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

**ది హిందూ**

ప్రపంచంలో అతిఎక్కువగా చైనాకు చెందిన షార్ట్ వీడియో-యాప్ 'టిక్‌టాక్'ను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. అయితే వినోదం కోసం అని చెబుతున్న టిక్ టాక్ యాప్ మనుషుల ప్రాణాలను కూడా బలితీసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తున్నది. ఓ మహిళ తనను నిర్లక్ష్యం చేస్తూ తన భర్త ఎక్కువ టైం టిక్‌టాక్‌లోనే కాలం గడుపటానికి నిరసనగా ఆత్మహత్య చేసుకున్నది. మరో బాలుడు ఆత్మహత్య ఎలా చేసుకోవాలో టిక్‌టాక్‌లో చూస్తూ.. తానూ బలయ్యాడు. వినోదం పంచటానికి బదులు విషాదాన్ని మిగులుస్తున్న ఇలాంటి యాప్‌లను నియంత్రించాలి.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# బాధ్యతారాహిత్యం

అమెరికా ఇరాన్‌పై ఆంక్షల ఒత్తిడి పెంచుతుంటే యూరప్ దేశాలు ప్రేక్షకపాత్ర వహించడం బాధ్యతా రాహిత్యమే. ఇది పరోక్షంగా అమెరికాకు మద్దతు పలుకడమే. బ్రిటన్ మరో అడుగు ముందుకు అమెరికాను మెప్పించడానికి వేసి ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకోవడం ఆ దేశ ప్రతిష్ఠనే దిగజారుస్తున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుందుడుకు విధానాలను అంతర్జాతీయ సమాజం అడ్డుకోలేకపోతే గల్ఫ్ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి తలెత్తవచ్చు. అమెరికా ఆంక్షలను పట్టించుకోకుండా తమకు మద్దతుగా నిలువాలని యూరప్ దేశాలకు విజ్ఞప్తి చేసిన ఇరాన్, ఆ దేశాల నుంచి ఆశించిన మద్దతు రాకపోవడంతో ఇక తాము కూడా అణు ఒప్పందాన్ని లాంఛనంగా ఉల్లంఘిస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. ఇటీవలే మూడు వందల కిలోల శుద్ధ యురేనియం పరిమితిని అతిక్రమించినట్టు వెల్లడించింది. తాజాగా సోమవారం 3.67 శుద్ధి పరిమితిని కూడా ఉల్లంఘించినట్టు తెలిపింది. ఒప్పందాన్ని ఉల్లంఘించి అణ్వస్త్ర తయారీకి పూనుకోవడం ఇరాన్ ఉద్దేశం కాదు. కానీ అమెరికా ఆంక్షల నుంచి తమకు రక్షణగా నిలువకపోతే తాము ఉల్లంఘించడానికి వెనుకాడబోమని సంకేతాలు ఇచ్చింది. తాము నామమాత్రంగా ఉల్లంఘించినప్పటికీ చర్చలకు తలుపులు తెరిచిపెట్టామని ఇరాన్ స్పష్టం చేసింది. యూరప్ దేశాలకు కూడా సయోధ్య కుదుర్చాలని కోరింది. ఒకవైపు యూరప్ దేశాలు తటస్థంగా ఉంటే, మరోవైపు ఇరాన్ ఉల్లంఘించినట్టు ప్రకటించగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశాడు.

ట్రంప్ వ్యవహారసరళి చూస్తుంటే, ఇరాన్‌పై ఆంక్షలు పెంచుకుంటూ పోయి క్రమంగా యుద్ధ పరిస్థితులు కల్పించాలని భావిస్తున్నట్టున్నది. ఇరాన్ దేశంపైనే కాకుండా ఆ దేశంలోని ప్రముఖులపై కూడా అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ ఆధ్యాత్మిక నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ, విదేశాంగ మంత్రి జావేద్ జరీఫ్ మొదలైన వారిపై ఆంక్షలు విధించడం అంటే చర్చలకు తలుపులు మూయడమే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఖమేనీకి ప్రపంచవ్యాప్తంగా అనుయాయులున్నారు. అమెరికాతో చర్చలకు అనుకూలంగా ఉన్నారు. జరీఫ్ కూడా పేరొందిన దౌత్యవేత్త. అమెరికాతో చర్చలు జరిపి సంక్షోభాన్ని నివారించగల సమర్థుడు. ఇరాన్‌తో చర్చలకు సిద్ధమంటూ పైకి చెబుతున్న ట్రంప్ చేతల్లో మాత్రం ఇరాన్‌పై ఒత్తిడి తెస్తూ, అవమానిస్తూ, రెచ్చగొట్టే చర్యలు చేపడుతున్నారు. అసలే ఉద్రిక్తతలు పెరుగుతూ ఉంటే బ్రిటన్ తన వంతుగా రెచ్చగొడుతున్నది. గురువారం నాడు అమెరికా నావికాదళం ఇరాన్ చమురు ట్యాంకర్‌ను జిబ్రాల్టర్ జలసంధి దగ్గర స్వాధీనం చేసుకున్నది. ఈ నౌక ఇరాన్ నుంచి సిరియాకు చమురు తీసుకపోతున్నది. సిరియాపై యురోపియన్ యూనియన్ ఆంక్షలు ఉన్న మాట నిజమే. కానీ అణు ఒప్పందాన్ని నిజాయితీగా అమలు చేస్తున్నప్పటికీ ఇరాన్ తో సంబంధాలు కొనసాగించడానికి అమెరికా ఒత్తిడి వల్ల యూరప్ దేశాలు వెనుకాడుతున్నా యి. అటువంటప్పుడు ఇరాన్‌ను తన బతుకేదో బతుకనియ్యాలె కానీ నౌకలను స్వాధీనం చేసుకోవడం ఎందుకు? అమెరికా సూచన మేరకే ఇరాన్ చమురు ట్యాంకర్‌ను బ్రిటన్ స్వాధీనం చేసుకుందని స్పెయిన్ వెల్లడించింది. గతంలో ఇరాక్‌పై దిగినప్పుడు అమెరికాకు బ్రిటన్ మద్దతు ఇచ్చింది. ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాజ్యమైన తమ దేశం అమెరికా తోకగా మారడం పట్ల బ్రిటిష్ ప్రజలకు ఆగ్రహం కలిగింది. ఆ తదుపరి ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారు. ఇప్పుడు అదే రీతిలో బ్రిటన్ అమెరికా ఉపగ్రహంగా మాదిరిగా వ్యవహరిస్తున్నది.

> **పన్నెండేండ్ల పాటు ఎంతో సంక్లిష్టమైన చర్చలు సాగిన తరువాత ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇరాన్‌తో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో అమెరికాతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు కూడా భాగస్వాములే. ఒప్పందం పర్యవేక్షణకు కఠినమైన షరతులకు ఇరాన్ అంగీకరించింది. ఇరాన్ ఒప్పందానికి అనుగుణంగా పరిమితులకు కట్టుబడి ఉంటున్నట్టు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షకులు ధ్రువీకరిస్తూనే ఉన్నారు. అమెరికా ఈ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేసుకున్నప్పుడు దానిని కాపాడవలసిన బాధ్యత యూరప్ దేశాలపై ఉంటుంది.**

పశ్చిమాసియాలో ఇప్పటికే ఇజ్రాయెల్ అణ్వస్త్రశక్తిగా మారింది. పలు అరబ్బు దేశాలలో అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. లిబియా, ఇరాక్ దేశాలపై దాడులపై నాటో దళాలు దాడులు చేసి ఎంత విధ్వంసం సృష్టించాయో తెలిసిందే. సిరియాలో కూడా అమెరికా తలదూర్చింది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన ఉనికికి ప్రమాదం జరుగుతుందని భయపడటం సహజం. అణ్వస్త్ర తయారీ కార్యక్రమాన్ని నిలిపివేయడానికి సిద్ధపడినప్పుడు, ఇరాన్‌కు రక్షణలు కల్పించడం అంతర్జాతీయ సమాజం బాధ్యత. పన్నెండేండ్ల పాటు ఎంతో సంక్లిష్టమైన చర్చలు సాగిన తరువాత ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇరాన్‌తో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో అమెరికాతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు కూడా భాగస్వాములే. ఒప్పందం పర్యవేక్షణకు కఠినమైన షరతులకు ఇరాన్ అంగీకరించింది. ఇరాన్ ఒప్పందానికి అనుగుణంగా పరిమితులకు కట్టుబడి ఉంటున్నట్టు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షకులు ధ్రువీకరిస్తూనే ఉన్నారు. అమెరికా ఈ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేసుకున్నప్పుడు దానిని కాపాడవలసిన బాధ్యత యూరప్ దేశాలపై ఉంటుంది. కనీసం అమెరికా ఆంక్షలను పట్టించుకోకుండా ఇరాన్‌తో సంబంధాలను కొనసాగించాల్సింది. యూరప్ దేశాలు సహకరిస్తే అమెరికా ఆంక్షలు నిర్వీర్యమైపోతాయి. కానీ యూరప్ దేశాలు ఒప్పందాన్ని కాపాడటానికి ఏమాత్రం చొరవ చూపడం లేదు. దీంతో యూరప్ దేశాలకు ఇరాన్ అరువై రోజుల గడువు ఇచ్చింది. ఈలోగా యూరప్ దేశాలు విజ్ఞతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలె.

**జనగళం**

## మీ బానిస చరిత్రను కూల్చొద్దా..?

పరాయిపాలకుల పంచలు పట్టుకొని
అరవయ్యేండ్లు తిరిగిన మీ బానిస చరిత్రలను
ఇంకా పలవరించండి
తెలంగాణ ప్రజలను బానిసలుగా మార్చిన
పరాయి పాలకుల కుర్చీవాసనలు ఆస్వాదించండి
మీ జీవితకాలపు ఆత్మన్యూనతా దృశ్యాలను
ఆ పురాతన బంగలాల గోడలమీద దర్శించండి
బానిస గోడలకు గోడకుర్చీలు వేసే మీ మొకాలకు
నవ సమాజ నిర్మాణం ఆలోచనలు వస్తయా..!

మీ ఆత్మగౌరవాన్ని కోల్పోయిన దుర్బలత్వం
ఇంకా తెలంగాణ మీద రుద్దే అత్యుత్సాహం ఇకపై సాగదు

ఇప్పుడు తెలంగాణ స్వయంపాలిత
మీ బానిస నాయకత్వాన్ని అందికే మట్టిగరిపించింది
రేపటి తెలంగాణ నూతనోత్తేజంతో
ఉద్యమకాలం నాటి పోరాట పటిమతో
తనను తాను పునర్నిర్వచించుకుంటున్నది

నాటి ఉద్యమ పోరాటం నుంచీ నేటి పాలన వరకు
నాటి తెలంగాణ తల్లి రూపకల్పన నుండీ
నేటి అసెంబ్లీ భవన నిర్మాణం వరకూ
సీఎం కేసీఆర్ నిర్ణయాలే
తెలంగాణకు బంగారు బాటలుగా మారుతున్నయి

కూల్చివేస్తున్నది కట్టడాలను కాదు
మీ బానిస ఆలోచనలను
మీ నక్కజిత్తుల స్వార్థ రాజకీయాలను

ముఖ్యమంత్రి చేస్తున్నది
కొత్త భవనం కట్టడం కాదు
స్వపరిపాలనా, స్వాభిమాన చిహ్నాలను నిర్మించడం
నవ తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకడం..

-హజారి

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

కేంద్ర బడ్జెట్



**డాక్టర్ పిడిగెం సైదయ్య**

# 'సాయం'లేని స్వయంసమృద్ధి ఎట్లా?

**కేంద్రం 2019-20గాను ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ వ్యవసాయంపై వివక్ష ప్రదర్శించింది. రైతుల ఆదాయాల రెట్టింపు, గ్రామీణ ప్రాంతాల బలోపేతం కోసం ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక కేటాయింపులు చేస్తుందని ఆశించాం. రైతులకు ఉపయోగపడేలా మార్కెట్ సంస్కరణలు, మద్దతు ధరల అమలుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుందనుకున్నాం. సేంద్రియ సాగుకు మరింత ఊతమిస్తుందనుకున్నాం. దీనికి భిన్నంగా వ్యవసాయానికి రొటీన్ బడ్జెట్ ప్రతిపాదనలతోనే సరిపుచ్చారు. దీనిఫలితంగా రాష్ట్రాలు రైతుల నుంచి పంట ఉత్పత్తుల సేకరణ, ధరల చెల్లింపులలో కష్టాలు పడనున్నాయి.**

బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి 1.39 లక్షల కోట్లు కేటాయించారు. ఇందులో 75 వేల కోట్ల రూపాయలు ఎన్నికల సమయంలో ఇచ్చిన పెట్టుబడి సహాయం కిందికే సరిపోతాయి. ఈ పథకం కింద దేశంలోని 12.6 కోట్ల చిన్న, సన్నకారు రైతులకు ఏడాది కి ఆరు వేల రూపాయలు ఇవ్వనున్నారు. అలాగే 60 ఏండ్లు పైబడిన రైతులకు నెలకు రూ. మూడు వేల చొప్పున ఇచ్చే ప్రధాన మంత్రి పెన్షన్ యోజన కింద రూ. 900కోట్లు కేటాయించడం ముదావహం. మత్స్య సంపద పెంపునకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ. 3737 కోట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు, మత్స్యకారులకు అదనపు ఆదాయానికి ఉద్దేశించిన పథకమిది. దేశవ్యాప్తంగా వచ్చే ఐదేండ్లలో పదివేల రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటు, 75 వేల మంది గ్రామీణ ప్రాంతీయులకు వ్యవసాయ వ్యాపార సామర్థ్యాలు, శిక్షణ, కో ఆపరేటివ్స్ ద్వారా పాల వ్యాపారానికి ప్రోత్సాహం మేలైనవే. అయితే ఇప్పటికే డైరీ రంగంలో రాజ్యమేలుతున్న ప్రైవేటు వ్యాపారులను తట్టుకునేలా కోఆపరేటివ్స్‌కు శిక్షణ ఇవ్వాలి. వెదురు, తేనె, ఖాదీ పరిశ్రమల లో విలువల జోడింపు, వ్యాపారానికి ప్రోత్సాహానికి మద్దతు ధరల అమలు కోసం రూ. 3000 కోట్లతో మార్కెట్ జోక్యపు నిధిని ప్రకటించడం ఆహ్వానించదగినది.
దేశంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు సహజమే. ఈ నేపథ్యంలో పీఎం ఫసల్ బీమా యోజనకు రూ. 14,000 కోట్ల కేటాయించడం మంచిదే. దేశంలోని ప్రతి సాగు పంటను కిందికి తేవాలి. సంస్థాగత రుణాలు తీసుకునే రైతులు పంట రుణాలు సకాలంలో చెల్లిస్తే ఇచ్చే వడ్డీ మాఫీ కోసం రూ. 18000 కోట్లు కేటాయింపు కొంత రైతులకు ఉపయోగపడుతాయి. హరితవిప్లవం కింద18 పథకాలను ఒకే గొడుగు కిందికి తెచ్చి, మరిన్ని రాష్ట్రాలలో హరితవిప్లవ ఫలితాలు తీసుకుని వచ్చేందుకు రూ. 12,560 కోట్లు కేటాయించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగవ్వటం లేదు. వ్యవసాయ వృద్ధి, రైతుల ఆదాయాలు పెరుగాలంటే సాగు నీటి అందుబాటు పెరుగాలి. అందుకు రాష్ట్రాల సాగు నీటి ప్రాజెక్టులకు సహాయంగా భారీ కేటాయింపులు ఆశిస్తే పీయం కృషి సించాయి యోజన కింద రూ. 3,500 కోట్ల కేటాయింపు ఏ మూలకు సరిపోవు. అట్లనే వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయాలనే డిమాండులున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పథకానికి నిధులు తగ్గించడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది.

బడ్జెట్‌లో గేమ్ ఛేంజర్‌గా 'జీరో బడ్జెట్ ఫార్మింగ్'ను మరోసారి భారత్‌లో అమలుపరుచాలని కేంద్ర ఆర్థికమంత్రి అన్నారు. మరోసారి మన మూలాలకు వెళ్లాలి. దీంతో రైతుల ఆదాయాలు రెట్టింపు సాధ్యమంటున్నారు. ఇది పూర్తిగా నేల విడిచి సాము చేసే ప్రయత్నమే. అసలు పెట్టుబడిలేని వ్యవసాయం అంటూ ఇప్పటి వరకు ఏమీ లేదు. వ్యవసాయంలో కనీస పెట్టుబడి ఖర్చులు ఉంటాయి. అయితే 'తక్కువ పెట్టుబడి వ్యవసాయం' అని చెప్తే బాగుండేది. రోజురోజుకు పంటల ఉత్పత్తిలో కీలకమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటా 10–15 శాతం పెరుగుతున్నాయి. ఆ మేరకు రైతులు పండించిన పంటల దిగుబడులకు విపణిలో ధరలు అందటంలేదు. కాబట్టి పంటల సాగు గిట్టుబాటు కావాలంటే ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోవాలి. ఆ మేరకు మిగిలింది లాభాల కిందే లెక్క. అయితే ప్రభుత్వం మాత్రం స్థానికంగా లభించే పంట వ్యర్థాలు, పశువుల పెంట, వర్మీకంపోస్టులతో సాగు చేయాలని అంటున్నది. దీని ఉద్దేశం రసాయన ఎరువులు, పురుగు మందులు, హైబ్రీడ్లు వాడకుండా ప్రకృతి సహజంగా చేసే వ్యవసాయం. పురుగులు, తెగుళ్ల నివారణ కూడా గోమూత్రం, పులిసిన మజ్జిగ, ఇటీవల వచ్చిన వేస్ట్ డీకంపోజర్‌తో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ సాగు పద్ధతికి మరింత మద్దతు వచ్చింది. అయితే ప్రస్తుతానికి కాయగూరలు, పండ్ల తోటల్లో మాత్రమే ప్రకృతి వ్యవసాయ పద్ధతిని రైతులు పాటిస్తున్నారు. ముఖ్యంగా రసాయనాలు, పురుగు మందుల అవశేషాలు లేకుండా ఉత్పత్తులు ఉంటాయని వారి భావన. కొన్ని ప్రాంతాలలో వరిలోనూ పశువుల పేడతో పండించి, సేంద్రియ బియ్యంగా వాడుతున్నారు. జీరో బడ్జెట్ వ్యవసాయం, సేంద్రియ సాగుకు చాలా దగ్గరి సంబంధం ఉన్నది. అంతిమంగా ఖర్చులు తగ్గడంతోపాటు ఉత్పత్తులు నాణ్యతగా ఉండి, రసాయనాల అవశేషాలు ఉండకుండా ఉంటాయి. ఈ తరహా వ్యవసాయంలో అయితే మరో పార్శ్వం నుంచి చూస్తే పెట్టుబడి లేని వ్యవసాయంలో దేశీయ పంటలు, రకాలు వాడాలి. వీటి ఉత్పాదకత తక్కువ. హైబ్రీడ్లు, జన్యుమార్పిడి పంటల యుగం నుంచి మళ్లీ దేశవాళి రకాల సాగుకు వెళ్తే సమస్యలు కొత్తగా ఉత్పన్నం కానున్నాయి. దేశంలోని మొత్తం సేంద్రియ ఎరువులు ఉపయోగించుకున్నా సాగుకు కావాల్సిన ఎరువులలో 20 శాతం కూడా సరిపోవు. మరి మిగతా విస్తీర్ణంలో సాగు చేయడానికి ఎరువులు ఎట్లా? పూర్వం దేశవాళి రకాలు, ఉత్పత్తులు అప్పటి జనాభాకు సరిపోయేవి. మరి ఇప్పుడు పెరిగిన జనాభాకు, అప్పుడున్న విస్తీర్ణంలోనే ఐదింతల దిగుబడులు సాధించడం అసాధ్యం. దీనిఫలితంగా మళ్లీ విదేశాల నుంచి ఆహారధాన్యాలు దిగుమతులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది ఆహారభద్రతకే పెను సవాలుగా మారనున్నది. అయితే వర్షాధార ప్రాంతాలలో, స్వతహాగానే దేశవాళీ రకాలు, సూటి రకాలు వాడుతారు. ఉత్పత్తి కారకాలు తక్కువ వాడినా ఎంతో కొంత దిగుబడి వస్తుంది. కాబట్టి కేంద్రం జీరో బడ్జెట్ ఫార్మింగ్ కొనసాగాలంటే.. వర్షాధార ప్రాంతాలలో ముందుగా పైలట్ ప్రాతిపదికన పరీక్షించాలి. ఆ తర్వాత సాగు నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాలలో దఫాలుగా అమలు చేయాలి. ఈ పద్ధతిని కాయగూరలు, పండ్ల తోటలు, ఔషధ మొక్కల సాగులో ముందుగా వాడేలా ప్రోత్సహించాలి. ముందు ఈ తరహా సాగుకు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. సేంద్రియ ఎరువుల అందుబాటు పెరిగేలా పశుగణన అభివృద్ధి, పశువుల సంఖ్య పెరిగేలా కార్యాచరణ రూపొందించాలి. ప్రస్తుతం రసాయన ఎరువులకు ఇస్తున్న అన్ని రాయితీలను జీవన ఎరువులు, జీవన పురుగు మందులు, ఇతర సేంద్రియ ఎరువులకు అందించాలి. స్థానికంగా లభించే సాగుకు ఉపయోగపడే సేంద్రియ వ్యర్థాలలో పోషక మోతాదులు లెక్కించాలి. పంటల అవసరాలు తీర్చేందుకు ఎంత మొత్తంలో ఎరువులు అవసరమో నిపుణులు, శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేయించాలి. ఈ ఉత్పత్తులు సేంద్రియ ఉత్పత్తులు. కాబట్టి ప్రీమియం ధరలు అందేలా, ప్రత్యేక మద్దతు ధరలు ప్రభుత్వం ప్రకటించాలి. లేకపోతే పెట్టుబడిలేని సాగు సాధ్యం కాదు.

> దేశంలో వ్యవసాయానికి మంచి రోజులు ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు సరిపోవు. సాగులో స్వయం సమృద్ధి సాధించాలంటే రైతు కేంద్రంగా పథకాల రూపకల్పన జరుగాలి. వ్యవసాయ అనుకూల సంస్కరణలు అమలుచేయాలి. ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌కు రూపకల్పన చేయాలి.

ఇక పప్పుదినుసులలో స్వయంసమృద్ధి ఇప్పటికే సాధించింది. ఇదే స్ఫూర్తితో 'నూనె గింజలలో' కూడా స్వయం సమృద్ధి సాధించాలి. ఎగుమతులు చేసే స్థాయికి ఎదుగాలని ఆర్థికమంత్రి కోరారు. కచ్చితంగా చెప్పాలంటే దేశీయ అవసరాలకు కావాల్సిన పప్పుదినుసులు నేడు దేశంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. ఫలితంగా సాలీనా 85 వేల కోట్ల రూపాయాల మేర దిగుమతి విలువ ఆదా అవుతున్నది. అయితే కేంద్రం కొంత మేరకు మద్దతు పెంచడం, సేకరణ చేపట్టడంతో అది సాధ్యమయ్యింది. అయితే ప్రస్తుతం పరిస్థితి మళ్లీ మారింది. ఉదాహరణకు దేశంలో ఉత్పత్తి అయిన కందిలో 40 శాతానికి పైగా మద్దతు ధరల కంటే తక్కువకే రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. అందులో చిన్న, సన్నకారు రైతులు అపరాల సాగు ఎక్కువ చేస్తారు. కాబట్టి మద్దతు ధరలు అందక మళ్లీ వరి సాగునే నమ్ముకుంటున్నారు. అందుకే నూనెగింజలలో స్వయం సమృద్ధి సాధించాలంటే భారీగా మద్దతు ధరలు పెంచాలి. పండించిన ప్రతి నూనె గింజను ప్రభుత్వం సేకరించాలి. రైతులు సంఘంగా ఏర్పడితే నూనె మిల్లుల ఏర్పాటునకు ప్రభుత్వం సహకారం ఇవ్వాలి. వర్షాధార ప్రాంతాలలో ప్రధానంగా సాగవుతున్న నూనె గింజలు అయిన పల్లీలు, పొద్దు తిరుగుడు, నువ్వులు, కుసుమలలో అధిక దిగుబడిని ఇచ్చే రకాలు అందుబాటులోకి రావాలి. దేశంలో వ్యవసాయానికి మంచి రోజులు ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు సరిపోవు. సాగులో స్వయం సమృద్ధి సాధించాలంటే రైతు కేంద్రంగా పథకాల రూపకల్పన జరుగాలి. వ్యవసాయ అనుకూల సంస్కరణలు అమలు చేయాలి. ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌కు రూపకల్పన చేయాలి.

(వ్యాసకర్త: శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం)

# కేటాయింపులులేని కేంద్ర బడ్జెట్

విశ్లేషణ



**డాక్టర్ బైరి నిరంజన్**

సరైన కేటాయింపులు లేకుండానే భారీ లక్ష్యాన్ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ రూపకంగా పార్లమెంటులో ఆవిష్కరించారు. ఇందులో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం గా చేపడుతున్న 'మిషన్ భగీరథ' పథకం లాగా కొత్తగా 'జల జీవన్ మిషన్' ద్వారా దేశవ్యాప్తంగా ఇంటింటికి నల్లా నీటిని సరఫ రా చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఇందుకు ఏవిధమైన ముందస్తు ప్రణాళిక లేకుండానే రాష్ట్రాల భాగస్వామ్యం లేకుండానే 2024 నాటికి దేశంలోని అన్ని ఇండ్లకు నల్లా నీళ్లను ఇస్తామని ప్రకటించారు. ఇది మంచి ఆలోచనే. కానీ నిధుల కేటాయింపే అసలు సమస్య. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కొత్తగా ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా, పథకమైనా నిధుల సమీకరణ, కేటాయింపులు లేకుండా ముందడుగు వేయరనే పేరున్నది. ఆయన దృఢ సంకల్పంతో మిషన్ భగీరథ ద్వారా తెలంగాణలో ఇంటింటికి తాగునీరు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముందే ప్రాజెక్టుకు అవసరమైన నీళ్లు, భూమి, నిర్మాణ వ్యయం గురించి స్పష్టమైన అవగాహన, నిర్దిష్టమైన విధానంతో ప్రారంభించారు. కేంద్రం కూడా ఈ ప్రాజెక్టును ప్రశంసించింది. కానీ బడ్జెట్‌లో ఈ పథకానికి కేటాయింపు లేదు. ఇప్పుడా కార్యక్రమం తుది దశకు చేరింది. ఈ లెక్కన దేశమంతటికి ఇంటింటికి నదీ జలాల ద్వారా నల్లా నీరును ఇచ్చినట్లయితే కోట్లాది రూపాయలు అవసరమవుతాయి. కానీ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పద్దులో అంత కేటాయింపులు లేవు. దీంతో ఈ ప్రాజెక్టు అమలుపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. కేటాయించిన నిధులు కూడా తాగునీరు, పారిశుద్ధ్యానికి అని పేర్కొన్నారు. ప్రస్తుత కేటాయింపులతో 2024 కాదు కదా 2044లో కూడా ఇంటింటికి నల్లా నీళ్లు రావు.

బడ్జెట్‌లో అతిముఖ్యమైన రెండు కొత్త నిర్ణయాలను ముందుకు తీసుకొచ్చారు. అందులో 1) మౌలిక వసతుల కల్పన, 2) డిజిటల్ ఎకనామిక్, ఉపాధి కల్పన వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. 2014 బడ్జెట్ సందర్భంగా ప్రతి పల్లెకు ప్రధాన మంత్రి సడక్ యోజన కింద రోడ్డు సౌకర్యం కల్పిస్తామని కేంద్రం ప్రకటించింది. కాని ఇప్పటికి మన దేశంలో 30శాతం పైన ఆవాసాలకు అంటే 1,60,000 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. దీనికి ప్రధాన కారణం కేంద్రం సరియైన నిధులు కేటాయించకపోవడమే. ప్రపంచంలో భారతదేశం రెండవ అతి పెద్ద రోడ్డు వ్యవస్థ ఉన్న దేశంగా ఉన్నది. మొత్తం లక్షల కిలోమీటర్ల రహదారుల్లో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో కంటే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆధ్వర్యంలోనే ఎక్కువగా ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో 2030 నాటికి లక్షలకోట్ల రూపాయలు ఖర్చు పెడ్తామని ఆర్థికమంత్రి విన్నవించారు. కానీ మౌలిక వసతులలో ఏ రంగానికి ఎంత కేటాయిస్తున్నారు అనే విషయం స్పష్టంగా తెలియచేయలేదు. అందులో ప్రభుత్వ భాగస్వామ్యం ఎంత? ప్రైవేట్ భాగస్వామ్యం ఎంత? అనే విషయాలపై స్పష్టత లేదు. అయితే కేంద్రం దీర్ఘకాలికమైన భారీ అభివృద్ధి లక్ష్యాన్ని ముందుకు తీసుకొని వచ్చింది. దీనివల్ల పట్టణ, గ్రామాల మధ్య అంతరం తగ్గుతుంది. ఇది దేశ సమతుల్య అభివృద్ధికి దోహదపడే అంశమే. అలాగే ఆ రంగాలపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగడానికి అవకాశముంటుంది.
కొత్తగా 2 నుంచి 3.50 లక్షల వరకు ఇంటి నిర్మాణ రుణగ్రస్తులకు వడ్డీ మినహాయింపు ఇవ్వడం వల్ల నిర్మాణ రంగం విస్తరించడానికి అవకాశముంటుంది. దీనివల్ల స్థూల జాతీయోత్పత్తి పెరుగుతుంది. పెట్టుబడులు పెద్దమొత్తంలో రియల్ ఎస్టేట్ రంగంలో వచ్చే అవకాశం ఏర్పడుతుంది. కానీ బడ్జెట్ కేటాయింపులో మాత్రం మొత్తం 100 మంత్రిత్వశాఖలు, విభాగాలకు గాను 52 మంత్రిత్వశాఖలకు గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించి చూపించారు. అతి ముఖ్యంగా గ్రామీణాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎంతో వెన్నుదన్నుగా ఉంటున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో 0.34శాతం, గ్రామీణ అభివృద్ధికి 0.45శాతం మాత్రమే ఈ బడ్జెట్‌లో కేటాయింపు చేయడం కేంద్ర లక్ష్యసాధనకు ప్రధాన అడ్డంకి అవుతుంది.
రానున్న కాలంలో కాగితం, ప్రింటింగ్ రబ్బర్, టొబాకో, లోహపరిశ్రమ లాంటివి అనేకం సంక్షోభంలోకి వెళుతున్న నేపథ్యంలో కేంద్రం డిజిటల్ ఎకానమి, ఉపాధికల్పన కార్యక్రమాన్ని ముందుకు తీసుకొని వచ్చింది. దానిలో భాగంగా అంకుర కోసం కొత్త దూరదర్శన్ చానల్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా వారి సమస్యల పరిష్కారానికి ఒక వేదికను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగినది. అలాగే అంకుర సంస్థలకు ఆదాయ మదింపు ఉండబోవడం లేదని ఆర్థికమంత్రి ప్రకటించారు. ఇవన్నీ డిజిటల్ ఎకానమీ, ఉపాధి కల్పనకు సరిపోవు. చైనాకు దీటుగా అభివృద్ధి చెందాలంటే దేశంలోని యువతకు నవ సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలాగ ప్రోత్సహించాలి. రోబోటెక్స్, బిగ్ డేటా, కృత్రిమ మేధ, వర్చువల్ రియాలిటి, త్రీడి ప్రింటింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలి. దేశంలో తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి కోసం టి.ఎస్. ఐపాస్ ద్వారా సర్వతోముఖాభివృద్ధి చెందడానికి బాటలు వేస్తున్నది.

కేంద్ర పాలకులు ఉపాధి లేకుండా అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తే అనేక అసమానతలు చోటు చేసుకుంటాయి. ఉపాధి కల్పన అనేది ప్రధానాంశంగా పాలకులు భావించనందువల్లనే నిరుద్యోగం గత 45 ఏండ్లలో ఎప్పుడూ లేనంతగా పెరిగిపోయింది. మరొకవైపు నూతన ఆర్థిక విధానం అమలు తర్వాత కూడా 2018 లెక్కల ప్రకారం వ్యవసాయ ఆధారంగా జీవిస్తున్నవారు దేశంలో 43.9శాతం ఉన్నారు. మన దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత చైనా స్వాతంత్ర్యం పొందింది. కానీ ఆ దేశంలో ప్రతి ఇద్దరిలో ఒకరు నెలవారి జీతంతో జీవనం సాగిస్తుంటే మనదేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరు మాత్రమే నెలవారీ జీతంతో జీవనం సాగిస్తున్నారు. దేశంలో వ్యవసాయేతర ఉపాధి కల్పన జరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగడగానికి అవకాశమేర్పడుతుంది. దీనికోసం ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాలి. అంతేగాకుండా రానున్న కాలంలో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, కలప, ఆహార, ఆటోమొబైల్, రవాణా, విద్యుత్తు తదితర ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులను స్వీకరించి ప్రభుత్వం ముందుకు పోవాలి. దీనివల్ల కేంద్రం అనుకున్న లక్ష్యమైన 5 లక్షల ట్రిలియన్ డాలర్ల అభివృద్ధి 2030 వరకు సాధ్యమయ్యే అవకాశముంటుంది. దానికి బడ్జెట్‌లో కేటాయింపులు భారీ ఎత్తున పెంచాలి. లేదంటే 'కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన' అనే నినాదం అపహాస్యమవుతుంది.

> రానున్న కాలంలో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, కలప, ఆహార, ఆటోమొబైల్, రవాణా, విద్యుత్తు తదితర ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులను స్వీకరించి ప్రభుత్వం ముందుకు పోవాలి. దీనివల్ల కేంద్రం అనుకున్న లక్ష్యమైన 5 లక్షల ట్రిలియన్ డాలర్ల అభివృద్ధి 2030 వరకు సాధ్యమయ్యే అవకాశముంటుంది. దానికి బడ్జెట్‌లో కేటాయింపులు భారీ ఎత్తున పెంచాలి. లేదంటే 'కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన' అనే నినాదం అపహాస్యమవుతుంది.

(వ్యాసకర్త: కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు)


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.





సోమవారం నిర్మల్ జిల్లా బాసరలో సభ్యత్వాలను అందజేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


మేడ్చల్‌లో మహిళలకు టీఆర్‌ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి


కరీంనగర్‌లో సభ్యత్వ రసీదులు అందజేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి


ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో సభ్యత్వ రసీదు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న


నల్లగొండలో మహిళలకు టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇంచార్జి తక్కళ్లపల్లి రవీందర్‌రావు

# వెల్లువలా సభ్యత్వాలు

## కొనసాగుతున్న టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు.. శ్రేణుల్లో పెరిగిన జోష్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ అన్ని జిల్లాల్లో వెల్లువలా కొనసాగుతున్నది. ప్రజలు సైతం ముందుకు వచ్చి సభ్యత్వాలను తీసుకుంటుండటంతో నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లా బాసరలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొని పలువురికి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా అల్లోల మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేసి వందశాతం పూర్తి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ, నాగారం, అహ్మద్‌గూడలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదులో దేశంలోనే టీఆర్‌ఎస్ నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ సర్కార్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. అందుకోసమే టీఆర్‌ఎస్ సభ్యత్వాలను స్వచ్ఛందంగా స్వీకరిస్తున్నారని తెలిపారు.

### కరీంనగర్‌లో..

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో, కరీంనగర్‌లోని ప్రతిమా మల్టీప్లెక్స్ వద్ద టీఆర్‌ఎస్ కార్యకర్తలకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సభ్యత్వ రసీదులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిగురుమామిడిలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తోపాటు ఇంచార్జి బస్వరాజ్ సారయ్య సభ్యత్వ నమోదు ప్రారంభించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నియోజకవర్గ ఇంచార్జి బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా వర్నిలో రూరల్ ఇంచార్జి తుల ఉమ, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మెండోరా, వేల్పూర్, ఏర్గట్ల మండలాల్లో మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.


సోమవారం నల్లగొండ పట్టణంలోని సావర్కర్‌నగర్‌లో టీఆర్‌ఎస్ సభ్యత్వాలు తీసుకొని మురిసిపోతున్న మహిళలు

### వరంగల్‌లో..

వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్వరాజు సారయ్య, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పాల్గొన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ వికారాబాద్ పట్టణంలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల సభ్యత్వ నమోదు ఆన్‌లైన్ కేంద్రాన్ని పౌర సరఫరాల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అనంతగిరిపల్లిలో సభ్యత్వ నమోదును నిర్వహించారు.

### ఉమ్మడి ఖమ్మంలో..

ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ, కొత్తగూడెంలో రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్‌రావు, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో నియోజకవర్గ ఇంచార్జి తెల్లం వెంకట్రావ్ సభ్యత్వ నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో ఎమ్మెల్యే జోగు రామన్న, మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మందమర్రిలోని 20వ వార్డు శాంతినగర్, స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి మూల విజయారెడ్డి, జెడ్పీ అధ్యక్షురాలు నల్లాల భాగ్యలక్ష్మి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్ పాల్గొని పలువురికి సభ్యత్వాలు అందజేశారు.

### నల్లగొండలో..

నల్లగొండ పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఇంచార్జి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మునుగోడు, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజక వర్గాల్లో స్థానిక నాయకులు, యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి తదితరులు పాల్గొని టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వాలను అందజేశారు.


నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో సభ్యత్వం అందిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో సభ్యత్వం అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ


వరంగల్ అర్బన్ జిల్లా ములుకనూరులో టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదులో పాల్గొన్న మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో కార్యకర్తలకు సభ్యత్వమిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


యాదగిరిగుట్ట పట్టణంలో పలువురికి సభ్యత్వాలను అందజేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

# నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** నిరుద్యోగులకు వృతినైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెట్మా కార్యాలయంలో వృత్తినైపుణ్య కేంద్రాన్ని యువజన సర్వీసులు ప్రిన్సిపల్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్, కలెక్టర్ రొనాల్డ్‌రోస్, జెడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వృత్తి విద్యా నైపుణ్య కోర్సుల శిక్షణ కేంద్రాన్ని రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మహబూబ్‌నగర్ జిల్లాలోనే ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 5 ప్రాంతాల్లో వృత్తి విద్యా శిక్షణ కేంద్రాల ఏర్పాటు పూర్తి అయిందని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.


మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో కలెక్టర్ రొనాల్డ్ రోస్

# ట్రిపుల్‌ఐటీ ఘటనపై స్పందించిన కోర్టు

- ఐదుగురిపై సుమోటో కేసు
- 15లోగా దర్యాప్తు నివేదికకు ఆదేశం

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** నిర్మల్ జిల్లాలోని ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి జీవన్‌కుమార్ స్పందించారు. సుమోటోగా కేసు స్వీకరించి 1382 పీఎల్సీ కింద ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. ట్రిపుల్ ఐటీ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల కెమెస్ట్రీ విభాగంలో అధ్యాపకుడి పని చేస్తున్న రవి వరాల లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ప్రసారమధ్యమాల్లో వార్తలు ప్రచురితం కావడంతో ఐదుగురిపై సుమోటోగా కేసులు నమోదు చేశామన్నారు. పోలీసులకు, ట్రిపుల్ ఐటీ వీసీతోపాటు డైరెక్టర్‌లకు ఈ ఘటనపై ఈ నెల 15లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించినట్టు చెప్పారు.


బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

# అధ్యాపకుడిని శాశ్వతంగా తొలగించాం

- దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**బాసర:** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాలలోని అధ్యాపకుడు రవి వరాలను విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్టు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కళాశాలలోని ఓ విద్యార్థినిని పాస్ చేయిస్తానంటూ లైంగిక వేధింపులకు పాల్పడిన అధ్యాపకుడు రవి వరాల వ్యవహారంపై సోమవారం కళాశాలను మంత్రి సందర్శించారు. ఈ ఘటనపై ట్రిపుల్‌ఐటీ అధికారులతో సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. త్వరలోనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేస్తారని స్పష్టం చేశారు. విద్యార్థులు ఆందోళన చెందవద్దని, తప్పు చేస్తేఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# 15లోగా మరో మూడు మోటర్ల వెట్‌రన్

## సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్ ఆదేశం.. కన్నెపల్లి, అన్నారం, గోలివాడ పంప్‌హౌస్‌ల సందర్శన

**కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి)/మంథని, నమస్తే తెలంగాణ/మంథని రూరల్/అంతర్గాం:** ఈనెల 15లోగా కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మరో మూడు పంపుల నుంచి అన్నారం బరాజ్‌కు గోదావరి జలాలను తరలించాలని సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్ అన్నారు. సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి ఉదయం హెలీకాప్టర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. వ్యూపాయింట్ నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలించారు. 1, 6వ మోటర్లు పంపింగ్ ద్వారా అన్నారం బరాజ్‌కు గోదావరి జలాలను ఎత్తిపోసే విధానాన్ని వీక్షించారు. అనంతరం పంప్‌హౌస్ లోపలికి దిగి 3వ మోటర్ వెట్‌రన్ పనులను పరిశీలించారు. అక్కడే వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఈనెల 15లోగా మరో మూడు పంపుల నుంచి అన్నారం బరాజ్‌కు గోదావరి నీటిని తరలించాలని ఆదేశించారు. అక్కడ నుంచి డెలివరీ సిస్టర్న్ వద్దకు వెళ్లి గ్రావిటీ కెనాల్‌లో మూడు మోటర్ల నుంచి పడుతున్న నీటిని పరిశీలించారు.

**అన్నారం పంప్‌హౌస్ సందర్శన..**

అనంతరం స్మితాసబర్వాల్ పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సుందిళ్ల బరాజ్‌కు చేరుకొని అక్కడి నుంచిరోడ్డు మార్గంలో అన్నారం పంప్‌హౌస్‌ను పరిశీలించారు. అక్కడే పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన, జేసీ వనజాదేవి, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, అన్నారం పంప్‌హౌస్ ఈఈ ఎలకొండ యాదగిరి, మెగా కంపెనీ ఉన్నత స్థాయి ప్రతినిధులు ఎండీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా నీరందించేలా పనులు పూర్తి చేయాలన్నారు. మేడిగడ్డ బరాజ్ వద్ద గోదారి కళకళలాడుతున్నదనీ, ఈ క్రమంలో కన్నెపల్లి నుంచి పంప్‌హౌస్‌లోని మూడు మోటర్ల ద్వారా అన్నారం బరాజ్‌కు నీటి తరలింపు మొదలైందనీ, మరికొద్దిరోజుల్లో అన్నారం పంప్ హౌస్‌కు చేరుతుందని చెప్పారు. ఈ క్రమంలో పంప్‌హౌస్‌లో అన్ని రకాల పనులను పూర్తి చేసుకొని ప్రతి నీటిబొట్టును తిరిగి సుందిళ్ల బరాజ్‌లో పోసుకునేలా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అన్నారం పంప్‌హౌస్‌లో బిగించిన 8 మోటర్లకు వచ్చే ఐదారు రోజుల్లో వెట్‌రన్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్‌లోకి 1.5 టీఎంసీల నీరు చేరిందని, సుమారు 4.1 టీఎంసీల నీరు చేరితే పంప్‌హౌస్ ద్వారా నీటిని తరలించుకోవచ్చని సూచించారు. ఆ లోగా మోటర్లను సిద్ధం చేసి, వీలైనంత త్వరలోనే అన్నారం పంప్‌హౌస్ నుంచి నీటిని సుందిళ్ల బరాజ్‌కు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. గోలివాడ పంప్‌హౌస్‌ను కూడా ఆమె సందర్శించారు. గోలివాడ పంప్‌హౌస్‌లోకి గోదావరి నీరు రావడమే ఆలస్యమనీ, ఈ క్రమంలో వచ్చే పదిహేను రోజుల్లో గోలివాడ పంప్‌హౌస్‌లోని మోటర్లకు వెట్‌రన్ నిర్వహించేలా ముందుకు సాగాలని స్మితాసబర్వాల్ సూచించారు.


భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్. చిత్రంలో కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అధికారులు

# గిరిజన నాయకుడి హత్య

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కుదునూరులో ఉద్రిక్తత

**చర్ల రూరల్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కుదునూరులో పోడు వివాదం నేపథ్యంలో ఓ గిరిజన నాయకుడు హత్యకు గరయ్యారు. కుదునూరు పంచాయతీ పరిధిలోని బోటుగూడెం గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు, సీపీఐ నేత బుటారి రాఘవయ్య ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి ఆటోలో కుదునూరు వెళ్తున్నారు. మార్గమధ్యంలో కొందరు యువకులు అడ్డగించి రాఘవయ్య పై కర్రలు, ఇనుపరాడ్లతో విచక్షణ రహితంగా దాడిచేశారు. స్థానికులు గమనించి రాఘవయ్యను సమీపంలోని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాఘవయ్య హత్యతో కదునూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అతడి వర్గీయులు, గిరిజనులు ఆందోళనకు దిగారు. మరో వర్గం వారి ఇండ్లపై దాడులు చేశారు. హత్యకు సూత్రధారి సీపీఐ నేత ఐనవోలు పవన్‌కుమార్ అని ఆరోపిస్తూ అతడి ఇంటి ఎదుట బైఠాయించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఆందోళనకారులను చెదురగొట్టారు.

# చిగురుమామిడి తాసిల్దార్ సస్పెన్షన్

**చిగురుమామిడి:** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి తాసిల్దార్ కే శ్యాంసుందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సర్ఫరాజ్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంలో విఫలం కావడం, జిల్లాలోనే మండలం పూర్తిగా వెనుకబడడం, సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించకపోవడంతోనే తదితర కారణాలతో శ్యాంసుందర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా, పూర్తిస్థాయి తాసిల్దార్‌గా నాయబ్ తాసిల్దార్‌గా ఉన్న గుగ్గిళ్ల రమేశ్‌కు అప్పగించారు.

# బాలికపై వృద్ధుడి లైంగికదాడికి యత్నం

**పాలకవీడు:** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం ఎల్లాపురంలో ఎనిమిదేండ్ల బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లాపురం గ్రామానికి చెందిన వెంకటయ్య(55) తన ఇంటి సమీపంలోని ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక తల్లి, తండ్రి కూలీ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను కిరాణం దుకాణానికి తీసుకెళ్లి బిస్కట్లు కొనిపించి పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని బాత్‌రూంకు తీసుకెళ్లాడు. బాలిక కేకలు వేస్తుండటంతో గమనించిన స్థానికులు వృద్ధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఫోక్సో, నిర్భయ కేసులు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


నిజామాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం

# రాష్ట్రంలో తేలికపాటి వానలు

- హైదరాబాద్, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం
- వచ్చే మూడురోజుల్లో అక్కడక్కడా వానలు: వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సోమవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. హైదరాబాద్ నగరంతోపాటు వరంగల్, మానుకోట, కొత్తగూడెం, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో వాన కురిసింది. రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రుతుపవనాలు ఉత్తరభారతం వైపు తరలడంతో రాష్ట్రంలో రుతుపవనాలు కొంత బలహీనపడ్డాయని చెప్పారు. బీహార్ పశ్చిమ ప్రాంతం, దానిని ఆనుకొని ఉన్న తూర్పు ఉత్తరప్రదేశ్ ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతున్నది. దీని ప్రభావం తెలంగాణపై ఉండదని అధికారులు వెల్లడించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో సోమవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. నగరంతోపాటు ఐనవోలు, ఎల్కతుర్తిలో జల్లులు పడ్డాయి. మెట్ట పంటలకు కొంత ఉపశమనం లభించింది. వరంగల్ రూరల్ జిల్లా శాయంపేటలో ఓ మోస్తరు వానపడింది. మహబూబాబాద్ జిల్లాకేంద్రంతోపాటు పలుప్రాంతాల్లో రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. పత్తితోపాటు వరినాట్లకు ఊరట లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలో ఓ మోస్తరు వర్షం పడింది. దుక్కుల్లో విత్తనాలు నాటిన రైతన్నలు కొంత ఊరట చెందారు. నిజామాబాద్ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షంతోపాటు ఈదురుగాలులు వీచాయి. సిద్దిపేట జిల్లాలోనూ అక్కడక్కడ తేలికపాటి వాన పడింది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో..**

గ్రేటర్ హైదరాబాద్‌లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరగడంతోపాటు గాలిలో తేమ శాతం తగ్గుముఖం పట్టింది. దీంతో పగటివేళ ఉక్కపోత తప్పలేదు. రుతుపవనాల కదలికలో చురుకుదనం లేకపోవడంతో మరో రెండురోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మబ్బులు కమ్ముకోవడం, మేఘాల ప్రభావంతో సోమవారం సాయంత్రం బంజారాహిల్స్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, నాంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 34.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు, గాలిలో తేమ 46 శాతంగా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

# విద్యతోనే నవసమాజ నిర్మాణం

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

**యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ:** విద్యతోనే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. విద్యకు పేద, ధనిక భేదం లేదని.. కార్పొరేట్ చదివే విద్యార్థుల కంటే ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులే మంచి ఫలితాలను సాధిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శ్రీలోగిల్లు, ఎగ్గిడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి పాసైన విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఇంగ్లిష్ మాట్లాడే స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

# అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్

**జమ్ము, జూలై 8:** జమ్ముకశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రను సోమవారం నిలిపివేశారు. కశ్మీర్ వేర్పాటువాదులు రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో జమ్ము నుంచి అమర్‌నాథ్ పుణ్యక్షేత్రానికి బయలుదేరే యాత్రికులను నిలిపివేశారని తెలుస్తున్నది. అయితే బల్తాల్, పహల్గామ్ మార్గాల్లో యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల కూడా జమ్ము బేస్‌లో ప్రయాణికులను నిలిపివేశారని చెబుతున్నారు. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన ఈ యాత్రలో ఇప్పటికే లక్ష మంది భక్తులు మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. వచ్చే నెల 15న రాఖీ పౌర్ణమితో అమర్‌నాథ్ యాత్ర ముగుస్తుంది. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మాట్లాడుతూ అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు స్థానిక ముస్లింలు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. అయితే యాత్రామార్గంలో భారీగా భద్రత ఏర్పాటు చేయడంతో స్థానికుల దైనందిన కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ ఆందోళన వ్యక్తం చేశారు.



జమ్ములోని బేస్‌క్యాంప్‌లో వేచి ఉన్న భక్తులు

# హోటల్ వద్దు.. ఎంబసీలో ఉంటా!

### అమెరికా పర్యటన కోసం పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పొదుపు చర్యలు

### అమెరికా భద్రతా సంస్థలకు ఇబ్బందికరం



**ఇస్లామాబాద్:** ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగే అమెరికా పర్యటనలో హోటల్‌లో బస చేయరాదని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ నిర్ణయించుకున్నారని మీడియాలో కథనాలు వచ్చాయి. అమెరికా పర్యటన సమయంలో వాషింగ్టన్‌లోని పాక్ రాయబారి అధికారిక నివాసంలోనే బస చేయాలని ఇమ్రాన్‌ఖాన్ సంకల్పించారని పాకిస్థాన్‌కు చెందిన డాన్ దినపత్రిక తెలిపింది. వాషింగ్టన్‌లో పాక్ రాయబారి కార్యాలయంలో బస చేయడంతో వ్యయం తగ్గించుకోవచ్చునని ఇమ్రాన్ భావిస్తున్నట్లు డాన్ పేర్కొంది. పాక్ రాయబార కార్యాలయం ఉన్న ప్రాంతంలోనే సుమారు 12 దేశాల ఎంబసీలు ఉన్నాయి. పాక్ ఎంబసీలో బస చేయాలన్న ఇమ్రాన్ యోచనపై అమెరికా భద్రతాసంస్థలు ఏ విధంగా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

### మానవ హక్కుల కోర్టుల ఏర్పాటుపై

# సుప్రీంకోర్టు విచారణ

**న్యూఢిల్లీ:** అన్ని జిల్లాల్లో మానవ హక్కుల న్యాయస్థానాల ఏర్పాటుపై కేంద్రానికి సూచనలు చేయాలని దాఖలైన పిటిషన్ మీద విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం కింద ఈ పిటిషన్ దాఖలైంది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, అనిరుద్ధ బోస్‌తో కూడిన ధర్మాసనం దేశంలోని 29 రాష్ట్రాలకు ఈ అంశంపై నోటీసులు జారీ చేసింది.



# మాకు సంబంధం లేదు

### రాజీనామాల పర్వాన్ని రాహులే మొదలుపెట్టారు

### కర్ణాటక సంక్షోభంపై లోక్‌సభలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ, జూలై 8:** కర్ణాటకలో రాజకీయ పరిణామాలతో తమ పార్టీకి సంబంధం లేదని, తమ పార్టీలో చేరాలని ఏ ఎమ్మెల్యే , ఎంపీపైనా తాము ఒత్తిడి చేయలేదని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సోమవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో రాజీనామాల పర్వాన్ని రాహుల్‌గాంధీనే మొదలుపెట్టారని చెప్పారు. పదవుల నుంచి తప్పుకోవాలని ఆయనే సూచించారన్నారు. పార్లమెంట్ పవిత్రతను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. కర్ణాటక అంశాన్ని కాంగ్రె స్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి లోక్‌సభలో లేవనెత్తడంతో రాజ్‌నాథ్ ఈ మేరకు సమాధానమిచ్చారు. జీరో అవర్‌లో అధీర్ మాట్లాడుతూ.. కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలను కూల్చేందుకు బీజేపీ సర్కార్ కుట్రపన్నుతున్నదని ఆరోపించారు. ముంబైలోని ఒక ఫైవ్ స్టార్ హోటల్‌కు తమ ఎమ్మెల్యేలను తరలించిందన్నారు. కర్ణాటకలో అసమ్మతి ఎమ్మెల్యేలు గవర్నర్‌ను కలిసిన తక్షణమే వారికి వాహనాలు, విమానం, హోటల్ సదుపాయాలను సిద్ధంగా ఉంచారని చెప్పారు. బీజేపీ సర్కారు ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నదని ధ్వజమెత్తారు. 'లోక్‌సభలో మీకు 303 సీట్లు ఉన్నాయి.



అయినా మీ కడుపు నిండలేదు. మీ పొట్ట, ఢిల్లీ గేట్.. ప్రస్తుతం ఒకేలా ఉన్నాయి' అని ఆయన బీజేపీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీనిపై మంత్రి రాజ్‌నాథ్ సమాధానం ఇవ్వగానే కాంగ్రెస్ సభ్యు లు ఆందోళనకు దిగారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

**జవాన్ల పన్ను ప్రయోజనాల తొలిగింపుపై పునఃపరిశీలన**

తమ మొత్తం సర్వీసును పూర్తి చేసి, వికలాంగ పెన్షన్ పొందుతున్న జవాన్లకు పన్ను ప్రయోజనాలను తొలిగించే విషయంపై ప్రభుత్వం పునఃపరిశీలిస్తున్నదని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాజ్యసభకు తెలిపారు. ఏ ఒక్క వికలాంగ జవాన్‌కూ అసౌకర్యం కలిగించబోమని స్పష్టం చేశారు.



బస్సులో కొడగు రిసార్ట్స్‌కు బయలుదేరిన జేడీఎస్ ఎమ్మెల్యేలు

# ఒక్కరోజుకు 25 వేలు

### కొడగు పాడింగ్టన్ రిసార్ట్స్‌లో విల్లాల బుకింగ్

### ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి జేడీఎస్ ప్రయత్నాలు

**ముంబై, జూలై 8:** కర్ణాటకలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. ప్రైవేట్ విమానాలు, రిసార్టులు, విలాసవంతమైన హోటళ్ల చుట్టూ కన్నడ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి వేల రూపాయల ఖరీదు చేసే విలాసవంతమైన విల్లాలను బుక్ చేయడానికి పార్టీలు క్యూ కడుతున్నాయి. ఎమ్మెల్యేల రాజీనామాలతో జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభం దిశగా పయనిస్తున్న సందర్భంలో.. సంకీర్ణ సర్కార్ నష్ట నివారణ చర్యలకు పూనుకున్నది. ఎమ్మెల్యేల రాజీనామాల నేపథ్యంలో.. జేడీఎస్-కాంగ్రెస్ మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేసి ఆ పత్రాలను సీఎం కుమారస్వామికి పంపారు. కొత్త క్యాబినెట్ ఏర్పాటు చేయాల్సిందిగా సీఎంను కోరారు. మరోవైపు ఎమ్మెల్యేలను కాపాడుకోవడానికి జేడీఎస్ ప్రయత్నాలు ప్రారంభించింది. పార్టీ ఎమ్మెల్యేల కోసం కర్ణాటకలోని కొడగు జిల్లా లో పాడింగ్టన్ రిసార్ట్స్‌లో గదులను తీసుకుం ది. వీటిలో 10 ప్రైవేట్ పూల్ విల్లాలు, 7 బంగ్లాలు, డీలక్స్ గదులు ఉన్నాయి. ఒక్కరోజుకు డీలక్స్ గది ఖరీదు రూ. 9 వేలు వరకు ఉండగా, పూల్ విల్లాకు ఒక్కరోజుకు చెల్లించే మొత్తం రూ.25,000లకు పైనే ఉన్నట్టు సమాచారం. రాజీనామా చేసిన అసంతృప్త ఎమ్మెల్యేల్లో 10 మంది ప్రస్తుతం ముంబైలోని సోఫిటెల్ 5స్టార్ హోటల్‌లో బస చేస్తున్నారు. మరో ముగ్గురు షిర్డీలో ఉన్నట్టు తెలుస్తున్నది. సోఫిటెల్ హోటల్‌లో ఒక్కరోజుకు ఒక్కో గది ప్రారంభ ఖరీదు రూ. 10వేలు అని సమాచారం.

# టెన్షన్.. టెన్షన్!

### కన్నడనాట పతాక స్థాయికి చేరిన రాజకీయం

### మంత్రుల సామూహిక రాజీనామా.. అసంతృప్తులకు చోటు కల్పించేందుకేనంటున్న అధికార పార్టీలు

### సర్కార్‌కు గుడ్‌బై చెప్పిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు; ముంబై నుంచి గోవాకు మారిన ఎమ్మెల్యేల క్యాంపు

### త్వరలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న సీఎం కార్యాలయం

### సీఎం కుమారస్వామి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్; పార్లమెంట్‌లో కర్ణాటక ప్రకంపనలు

**బెంగళూరు, జూలై 8:** కర్ణాటకలో ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఓవైపు అసంతృప్తులను బుజ్జగిస్తూనే.. మరోవైపు ఇతరులు గోడ దూకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అసంతృప్తులకు మంత్రి పదవులు ఆశ చూపేందుకు ప్రస్తుతం ఉన్న మంత్రులందరితో రాజీనామాలు చేయించాయి. సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకొనేందుకు, బీజేపీని అధికారానికి దూరంగా ఉంచేందుకు కాంగ్రెస్ పార్టీనే మరోసారి నడుం బిగించింది. కాగా, ఇద్దరు స్వతంత్రులు, 10 మంది కాంగ్రెస్, ఇద్దరు జేడీఎస్ రెబల్ ఎమ్మెల్యేలు ముంబై నుంచి గోవాకు శిబిరాన్ని మార్చివేశారు. వీరి వెంట బీజేవైఎం నేత మోహిత్ భర్తియా ఉండటం గమనార్హం.

**ఉదయం నుంచే హడావుడి**

డిప్యూటీ సీఎం జీ పరమేశ్వర ఇంట్లో సోమవారం ఉదయం అల్పాహార విందుకు హాజరైన తర్వాత కాంగ్రెస్‌కు చెందిన 21 మంది మంత్రులు తమ పదవుల నుంచి వైదొలుగాలని నిర్ణయించుకున్నారు. ఆ వెంటనే సీఎం హెచ్‌డీ కుమారస్వామితో సమావేశమైన జేడీఎస్ మంత్రులు తొమ్మిది మంది కూడా రాజీనామాలు సమర్పించారు. దీంతో రాష్ట్రంలో త్వరలోనే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని సీఎం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కాంగ్రెస్‌కు చెందిన 10 మంది, జేడీఎస్‌కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాతో సంకీర్ణ సర్కార్ సంక్షోభంలో పడిన సంగతి తెలిసిందే. పరమేశ్వర ఇంట్లో జరిగిన అల్పాహార సమావేశం వివరాలను కాంగ్రెస్ నేత వేణుగోపాల్ మీడియాకు వివరించారు. పార్టీ విస్తృత ప్రయోజనాలను



సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు వేణుగోపాల్, సిద్ధరామయ్య తదితరులు

దృష్టిలో ఉంచుకొని ఆదివారం, సోమవారం తీవ్రస్థాయిలో చర్చించామన్నారు. ప్రస్తుతం కుమారస్వామి సర్కార్ మనుగడ అనిశ్చితికి చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వాన్ని కాపాడుకొనేందుకు త్యాగాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ పార్టీకి చెందిన మంత్రులందరూ స్వచ్ఛందంగా రాజీనామాలు సమర్పించారని చెప్పారు. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై నిర్ణయాన్ని మంత్రులందరూ పార్టీ విచక్షణకే వదిలేశారని వేణుగోపాల్ తెలిపారు. పార్టీని ఐక్యంగా ఉంచేందుకు, ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న బీజేపీ అప్రజాస్వామిక వైఖరిని ఓడించేందుకు మంత్రులు తమ పదవులను త్యాగం చేయడం అభినందనీయం అని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరి మంత్రిపదవిని దక్కించుకున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యే శంకర్ కూడా పదవి నుంచి వైదొలిగారు. మొత్తం 34 మంత్రి పదవులకు సంకీర్ణ కూటమి ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్ 22, జేడీఎస్ 12 మంత్రి పదవులను పంచుకున్నాయి.

**బీజేపీకి పరాభవం తప్పదు: వేణుగోపాల్**

పార్టీపై అసమ్మతితో రాజీనామా చేసిన ఎమ్మెల్యేలందరినీ వెనుకకు పిలిపించేందుకు ఏ చర్యలు తీసుకునేందుకైనా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆ పార్టీ నేత వేణుగోపాల్ చెప్పారు. అసంతృప్తులందరూ వెనుకకు తిరిగి వస్తారని, తమ ప్రభుత్వం కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచి, పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నించడం ఇది ఆరోసారి అని చెప్పారు. 'గతంలో ఐదు సార్లు వారు విఫలమయ్యారు. ఈసారి కూడా వారికి పరాభవం తప్పదు' అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ధన బలాన్ని, కేంద్ర సంస్థలను వినియోగిస్తున్నదని వేణుగోపాల్ ఆరోపించారు. ఎమ్మెల్యేలను ప్రలోభపరిచి, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని సిద్ధరామయ్య కూడా ఆరోపించారు. అర్హత, సామాజిక సమీకరణ, ప్రాంతీయ సమతుల్యత ఆధారంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని చెప్పారు. రాజీనామా చేసి ముంబైలో తిష్ట వేసిన ఎమ్మెల్యేందరికీ మంత్రి పదవులు దక్కవని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఎవరైతే అసంతృప్తితో ఉన్నారో.. వారిలో అర్హులైన వారికి మాత్రమే స్థానం కల్పిస్తామన్నారు.

**మీకు సంఖ్యా బలం లేదు.. కుర్చీ వదలండి: బీజేపీ**

దాదాపు 15 మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయడంతో ప్రభుత్వం మైనారిటీలో పడిపోయిందని, సీఎం కుమారస్వామి ఇక గద్దె దిగాలని బీజేపీ డిమాండ్ చేసింది. 'ఏమాత్రం గౌరవం, ఆత్మాభిమానం ఉన్నా.. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు తెలిసినా ఆయన (కుమారస్వామి) వెంటనే రాజీనామా చేయాలి. కుర్చీకి అతుక్కొని కూర్చోరాదు.. మీకు సంఖ్యా బలం లేదు' అని మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ ఎమ్మెల్యే ఆర్ అశోక్ పేర్కొన్నారు.

### నాకు భయం లేదు: కుమారస్వామి



రాష్ట్రంలో వేగంగా చోటుచేసుకుటున్న రాజకీయ పరిణామాలను చూసి తాను భయపడటం లేదని ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. సంకీర్ణ కూటమికి చెందిన 13 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన నేపథ్యంలో తన ప్రభుత్వం సంక్షోభంలో పడిపోవడంతో.. అమెరికా పర్యటనను అర్థంతరంగా ముగించుకొని ఆగమేఘాల మీద తిరిగి వచ్చిన కుమారస్వామి సోమవారం మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నాకెటువంటి భయం లేదు. వాటిని గురించి నేను మాట్లాడను. బీజేపీ వారు ఏం చేస్తున్నారో, ఇతరులు ఏం చేస్తున్నారోనన్నది నాకు అనవసరం' అని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సంక్షోభ స్థితిలో రాష్ట్రంలో పాలన అందించాల్సిన బాధ్యత తనపై ఉందని, ఆ బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు.

### మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు ఉపసంహరణ



గవర్నర్‌కు రాజీనామా అందజేస్తున్న ఎమ్మెల్యేలు నగేశ్, శంకర్

సంక్షోభ నివారణకు మంత్రులందరితో రాజీనామా చేయించిన కాంగ్రెస్, జేడీఎస్‌లకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ఉదయం మంత్రి పదవులకు రాజీనామా చేసిన ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఆర్ శంకర్, హెచ్ నగేశ్ సంకీర్ణ సర్కార్‌కు తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపారు. గవర్నర్ వజూభాయ్ వాలాను కలిసిన శంకర్ తాను బీజేపీకి మద్దతునిస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఆయన అసంతృప్త ఎమ్మెల్యేలు బసచేస్తున్న ముంబైలోని హోటల్‌కు బయలుదేరారు. మరో మంత్రి నగేశ్ కూడా రాజీనామా చేసిన వెంటనే ముంబై బయలుదేరారు. కాంగ్రెస్‌కు చెంది న పదితోపాటు ముగ్గురు జేడీఎస్ రెబల్ ఎమ్మెల్యేలు ముంబైలోని ఒక హోటల్‌లో బసచేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఇద్దరు ఎమ్మెల్యేలూ వారితో చేరారు. కాగా, మంత్రి పదవికి రాజీనామా చేసిన మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే రహీం మహమూద్ ఖాన్ కూడా పార్టీ అధిష్ఠానం వద్ద తన అసమ్మతిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. తన డిమాండ్లను పరిష్కరించకుంటే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బెదిరించారు. ఇక పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణపై కాంగ్రెస్ నుంచి సస్పెండైన మరో ఎమ్మెల్యే రోషన్ బేగ్ రాజీనామాపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. సంకీర్ణానికి ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతు ఉపసంహరించిన నేపథ్యంలో అసెంబ్లీలో కూటమి బలం 116 (కాంగ్రెస్-78, జేడీఎస్-37, బీఎస్పీ-1)కు చేరింది. ఇద్దరు ఇండిపెండెంట్లు బీజేపీకి మద్దతు ప్రకటించడంతో ఆ పార్టీ బలం 105 నుంచి 107కు పెరిగింది. కూటమికి చెందిన 13 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదిస్తే వారి బలం 103కు పడిపోతుంది.

# గుర్రంతో కాంగ్రెస్ వినూత్న నిరసన

**ముంబై, జూలై 8:** కర్ణాటక రాజకీయ సంక్షోభానికి కారణమవుతూ అసెంబ్లీ సభ్యత్వాలకు రాజీనామాలు చేసిన అసమ్మతి ఎమ్మెల్యేలు ముంబైలోని సోఫిటెల్ హోటల్‌లో బస చేయడం తెలిసిందే. మహారాష్ట్ర కాంగ్రెస్ కార్యకర్తలు సదరు హోటల్ బయట సోమవారం పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేసిందని (హార్స్ ట్రేడింగ్) ఆరోపిస్తూ.. దానికి సంకేతంగా గుర్రాన్ని ఎక్కి ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. పెద్దఎత్తున కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి హోటల్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అధికార పార్టీని లేదా ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు ఎమ్మెల్యేలతో ప్రత్యర్థి పార్టీ జరిపే బేరసారాలను రాజకీయ పరిభాషలో 'హార్స్ ట్రేడింగ్' అని పిలుస్తారు.



గుర్రంతో నిరసన తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు

# కన్నడనాట కలిసిరాని 'సంకీర్ణం'!

### మధ్యలోనే ముగుస్తున్న కూటమి ప్రభుత్వాల కథ

**బెంగళూరు:** కర్ణాటకలో 'సంకీర్ణ' సంక్షోభం ఇదే తొలిసారి కాదు. జాతీయ పార్టీల ఆధిపత్యం.. ప్రాంతీయ పార్టీలు ఎదగలేకపోవడం.. వెరసి రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాల కథ మధ్యలోనే ముగుస్తున్నది. కర్ణాటకలో 1983లో తొలిసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 95 సీట్లతో జనతా పార్టీ (జేఎన్‌పీ) అతిపెద్ద పార్టీగా అవతరించగా, బీజేపీ, వామపక్షాలు, 16 మంది స్వతంత్రులు బయట నుంచి మద్దతునిచ్చారు. రామకృష్ణ హెగ్డే సీఎం అయ్యారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో జేఎన్‌పీ నాలుగు సీట్లకే పరిమితం కావడంతో.. ప్రజా తీర్పు తమకు వ్యతిరేకంగా ఉన్నదని ప్రభుత్వాన్ని రద్దు చేసిన హెగ్డే ప్రజా తీర్పు కోరారు. ఈ సంకీర్ణ ప్రభుత్వ పతనానికి హెగ్డే నైతిక విలువలు కారణం కాగా, తదుపరి సంకీర్ణ ప్రభుత్వాల పతనానికి రాజకీయ డ్రామాలే కారణమన్నది విశ్లేషకుల మాట. 1983 తర్వాత, 2004లో మరో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్-జేడీఎస్ కూటమిగా ఏర్పడి ధరంసింగ్‌ను సీఎం పీఠంపై కూర్చోబెట్టాయి. రెండేండ్లలోపే ప్రస్తుత సీఎం హెచ్‌డీ కుమారస్వామి సారథ్యంలోని జేడీఎస్ తిరుగుబాటు చేయడంతో సంకీర్ణ సర్కారు కూలిపోయింది. ఆ వెంటనే కుమారస్వామి.. బీఎస్ యడ్యూరప్ప నేతృత్వంలోని బీజేపీతో చేతులు కలిపి సీఎం పగ్గాలు చేపట్టారు. చెరో 20 నెలల పాటు సీఎం పదవి చేపట్టాలని వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 20 నెలల తర్వాత సీఎం బాధ్యతలు యడ్యూరప్పకు అప్పగించేందుకు కుమారస్వామి నిరాకరించడంతో ప్రభుత్వం పడిపోయింది.

# కాంగ్రెస్‌లో గందరగోళం ఆశ్చర్యకరం

### మన్మోహన్ సారథ్యంలో సీడబ్ల్యూసీ నిర్ణయాలు తీసుకోవాలి

### పార్టీ సీనియర్ నేత కరణ్ సింగ్ సూచన

**న్యూఢిల్లీ:** పార్టీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో చిక్కుకోవడం ఆశ్చర్యంగా ఉన్నదని ఆ పార్టీ సీనియర్ నేత కరణ్ సింగ్ అన్నారు. ఇప్పటికైనా ఎటువంటి జాప్యానికి తావు లేకుండా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సారథ్యంలో సమావేశమై తప్పనిసరి నిర్ణయాలు తీసుకోవాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)ని



కోరారు. 'మే 25న రాహుల్ గాంధీ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాక గందరగోళంతో కాంగ్రెస్ శ్రేణులు దిక్కుతోచని పరిస్థితుల్లో చిక్కుకోవడం ఆశ్చర్యం కలిగించింది. రాహుల్ సాహసోపేత నిర్ణయాన్ని గౌరవించడానికి బదులు ఆయన రాజీనామాను వెనుకకు తీసుకోవాలని కోరుతూ నెల సమయం వృథా చేశారు' అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రెండేండ్లలో 3.81 లక్షల ఉద్యోగాలిచ్చాం

### కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా కల్పించినట్లు కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 8:** దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. కానీ కేంద్రం మాత్రం గత రెండేండ్లలో వివిధ కేంద్ర ప్రభు త్వ సంస్థల్లో కొత్తగా 3.81 లక్షలకుపైగా ఉద్యోగాలను సృష్టించామన్నది. 2017 మార్చి ఒకటో తేదీ నాటికి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య 32,38,397 కాగా, ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నాటికి ఆ సంఖ్యను 36,19,596 కు పెంచినట్లు గత శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం తెలిపింది. వీటిలో అత్యధికంగా రైల్వే శాఖలో 98,999 మందికి ఉద్యోగాలు కల్పించారు. 2017 మా ర్చి నాటికి రైల్వేలో 12.7 లక్షల ఉద్యోగులు ఉండగా, 2019 మార్చి నాటికి ఆ సంఖ్య 13.69 లక్షలకు పెరిగింది. 2017-19 మధ్య పోలీస్ శాఖలో కొత్తగా 80 వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. పరోక్ష పన్ను విభాగాల్లో 53 వేలు, ప్రత్యక్ష పన్ను విభాగాల్లో 29,935 కొత్త ఉద్యోగాలు కల్పించారు. 2017 మార్చి నాటికి పరోక్ష పన్ను విభాగాల్లో 53,394, ప్రత్యక్ష పన్ను విభాగాల్లో 50,208 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక రక్షణ శాఖలో కొత్తగా 46,347 ఉద్యోగాలు కల్పించారు. 2017 మార్చి నాటికి ఆ శాఖలో 42,370 మంది ఉద్యోగులు ఉంటే, 2019 మార్చి నాటికి ఆ సంఖ్య 88,717కి చేరింది. అణు ఇంధన శాఖలో 10వేలు, టెలికంలో 2,250, నీటి వనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖలో 3,981 ఉద్యోగాలిచ్చారు. శాస్త్ర, సాంకేతిక శాఖలో 7,743, గనుల శాఖలో 6,338, అంతరిక్ష విభాగంలో 2,920, సిబ్బంది శాఖలో 2,056, విదేశాంగ శాఖలో 1,833 ఉద్యోగాలను, సాంస్కృతిక శాఖలో 3,647, వ్యవసాయ శాఖలో 1,835, విమానయాన శాఖలో 1,189 ఉద్యోగాలు సృష్టించినట్లు కేంద్రం తెలిపింది.

# విరాళాల్లో దూసుకెళ్తున్న కమలాహారిస్

### ఆరు నెలల్లో 2.3 కోట్ల డాలర్లు

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న భారత సంతతి సెనెటర్ కమలా హారిస్ (54) గత ఆరు నెలల్లో 2.3 కోట్ల డాలర్లకు పైగా విరాళాలు సేకరించారు. ద్వితీయ త్రైమాసికంలో 2.79 లక్షల మంది నుంచి సుమారు 1.2 కోట్ల డాలర్ల విరాళాలు సేకరించారు. వారిలో 1.50 లక్షల మంది కొత్తవారు. డిజిటల్ చెల్లింపుల్లోనే 70 లక్షల డాలర్ల విరాళాలు లభించాయి. యుక్త వయస్కురాలిగా ఉన్న తన ఫోటోపై 'దట్ లిటిల్ గర్ల్ వాజ్ మీ' అనే నినాదం ప్రచురించిన టీ-షర్టుల విక్ర యంతోనూ విరాళాలను సేకరిస్తున్నారు. వచ్చే ఏడాది నవంబర్‌లో జరిగే దేశాధ్యక్ష పదవికి డెమోక్రాట్ అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్నట్లు ఈ ఏడాది జనవరి 21న కమల ప్రకటించారు. డెమోక్రాట్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న 23 మందికి ఆమె గట్టి పోటీనిస్తున్నారు. ట్రంప్ విధానాలపై నిశిత విమర్శలతో దేశ ప్రజలను ఆకర్షిస్తున్న కమల.. కార్పొరేట్ రాజకీయ కార్యాచరణ కమిటీలు, ఫెడరల్ లాబీయిస్టుల నుంచి విరాళాలను తిరస్కరిస్తానని వాగ్దానంచేశారు.



# ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

- వంతెనపై నుంచి కాల్వలో పడిన ఆర్టీసీ బస్సు
- 29 మంది మృతి, 18 మందికి గాయాలు

**ఆగ్రా:** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సు వంతెనపై నుంచి కాల్వలో పడిన ఘటనలో 29 మంది మృతి చెందగా, 18 మంది గాయపడ్డారు. లక్నో-ఢిల్లీ స్లీపర్ కోచ్ బస్సు సోమవారం ఉదయం 4.30 గంటలకు ఆగ్రా జిల్లా ఇత్మద్‌పూర్ వద్ద యమునా ఎక్స్‌ప్రెస్ మార్గంలో వంతెన వద్ద అదుపు తప్పి.. 20 అడుగుల దిగువన ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో 29 మంది మృతి చెందగా 18 మంది గాయపడినట్లు యూపీ సమాచార శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అవనీశ్ అవస్థి తెలిపారు. గాయపడిన వారిని పలు దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు అవనీశ్ చెప్పారు. బస్సును కాల్వ నుంచి బయటకు తీసేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం దినేశ్ శర్మ, రవాణాశాఖ మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్‌ను ఘటనా స్థలానికి వెళ్లి క్షతగ్రాతులకు సహాయ చర్యలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేసి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. మృతుల కుటుంబాలకు యూపీఎస్ ఆర్టీసీ రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. ఈ ప్రమాదంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ట్విట్టర్‌లో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



కాల్వలో పడిన బస్సును జేసీబీతో వెలికి తీస్తున్న దృశ్యం

### రైల్వేలో ప్రైవేటీకరణ షురూ!

### 'ఢిల్లీ- లక్నో' తేజస్‌తో ప్రారంభం

### వెల్లడించిన రైల్వే అధికార వర్గాలు

**న్యూఢిల్లీ, జూలై 8:** కార్మిక సంఘాలు నిరసనలు తెలుపుతున్నా రైల్వేల ప్రైవేటీకరణ దిశగా రైల్వేశాఖ ముందుకు సాగుతున్నది. ఢిల్లీ- లక్నో మధ్య కొత్తగా నడుపనున్న 'తేజస్' ఎక్స్‌ప్రెస్ నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించాలని రైల్వే బోర్డు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వంద రోజుల ప్రణాళికలో భాగంగా తేజస్‌తోపాటు 500 కి.మీ నిడివి లోపు మరో మార్గంలో రెండో రైలు నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయానికి వచ్చినట్లు రైల్వే బోర్డు అధికారి ఒకరు తెలిపారు. దీని విధి విధానాల రూపకల్పనలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నిమగ్నమై ఉంది. ఓపెన్ బిడ్డింగ్ ద్వారా సంస్థలకు ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిర్వహణ కాంట్రాక్ట్ అప్పగిస్తారు.

# ముంబైని మళ్లీ ముంచెత్తిన వాన!

### మూడు గంటల్లో 786 మి. మీ. వర్షపాతం నమోదు

### 11 వరకు కొంకణ్, గోవా, ఉత్తర, మధ్య మహారాష్ట్రల్లో భారీ వర్షాలు: ఐఎండీ

**ముంబై:** కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో దేశ ఆర్థిక రాజధాని ముంబై అతలాకుతలమైంది. విరామం ఇచ్చాయనుకున్న వర్షాలు సోమవారం మళ్ళీ విజృంభించాయి. సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో నగరంలోని చాలా రహదారులు నీటితో నిండటంతో ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. ఉదయం 8.30 నుంచి 11.30 గంటల మధ్య సుమారు 786 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు ప్రైవేట్ వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. శాంతక్రుజ్ వద్ద ఉదయం 108 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఎస్‌వీరోడ్, జేవీఎల్ఆర్ తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తింది. వీధుల్లోకి వరద నీరు చేరడంతో స్థానిక బస్సులను వేరే రూట్లలోకి మళ్లించారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలకు కలిగిన అసౌకర్యానికి బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు క్షమాపణలు చెప్పారు. విమానాలు ఉదయం ఆలస్యంగా నడిచాయి. మరోవైపు కొంకణ్, గోవా, ఉత్తర, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లో జూలై 11 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేసింది.



# కివీస్ కాస్కో..





**3-4**
మెగాటోర్నీలో భారత్, న్యూజిలాండ్ 7సార్లు తలపడగా.. భారత్ 3, కివీస్ 4 మ్యాచ్‌లు నెగ్గాయి.

**1/7**
ఏడుసార్లు విశ్వసమరం సెమీస్ చేరిన న్యూజిలాండ్ ఒక్కసారి నెగ్గి ఆరుసార్లు ఓడింది.

## తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ ఢీ
## జోష్‌లో టీమ్‌ఇండియా.. అందరి చూపు రోహిత్ పైనే

**ఓడితే మరో చాన్స్ ఉండటానికి ఇది లీగ్ కాదు.. నాకౌట్. ఇక్కడ తడబడితే నేరుగా ఇంటికే.. మరో నాలుగేండ్లు నిరీక్షణే.**

**ముచ్చటగా మూడోసారి క్రికెట్ జగత్తుపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని భావిస్తున్న టీమ్‌ఇండియా సెమీఫైనల్‌కు సిద్ధమైంది. లీగ్ దశలో ఒక జట్టు మిగిలిన అన్ని జట్లతో ఆడేలా రౌండ్ రాబిన్ పద్ధతిని ప్రవేశపెట్టగా.. షెడ్యూల్లో భాగంగా జూన్ 13న భారత్, న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. అప్పుడు తలపడని జట్లు నేడు తొలి సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. రికార్డు స్థాయిలో 8 సార్లు సెమీస్ గడపతొక్కి గత టోర్నీలో ఫైనల్ చేరిన కివీస్ తుదిమెట్టుపై ఆసీస్ చేతిలో బోల్తాకొట్టింది. ఒత్తిడిని అధిగమించి ఈ సారి ఎలాగైనా విశ్వకప్పు పట్టేయాలని బ్లాక్‌క్యాప్స్ పట్టుదలగా ఉంటే.. క్రితం సారి సెమీస్‌లో ఓడినా.. చక్కటి ప్రదర్శనే చేసిన టీమ్‌ఇండియా ఈ సారి వదలకూడదని మొండికేస్తున్నది.**

**మాంచెస్టర్:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ 10 జట్లు.. రౌండ్ రాబిన్ పద్ధతిలో ఒక్కోటి తొమ్మిదేసి మ్యాచ్‌లు.. 38 రోజుల పాటు జరిగిన లీగ్‌లో మొత్తం 45 పోరాటాలు.. ఒత్తిడిని అధిగమించి నిలిచిన జట్లే నాకౌట్‌కు చేరాయి. మరో వారం రోజుల్లో ముగియనున్న మెగాటోర్నీలో కీలక అంకానికి మంగళవారం తెరలేవనుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోని టీమ్‌ఇండియా.. నాలుగో స్థానంతో లీగ్ దశను ముగించిన న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ జరుగనుంది. భారత్ టాపార్డర్‌కు.. కివీస్ పేస్ అటాక్‌కు మధ్య సమరంగా భావిస్తున్న రసవత్తర పోరుకు ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదిక కానుంది. వరుస శతకాలతో మోత మోగిస్తున్న హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీని నిలువరిస్తే చాలని బ్లాక్‌క్యాప్స్ భావిస్తుంటే.. ప్లాన్'బి'సిద్ధంగా ఉంది కాచుకోండి అని కోహ్లీ అండ్ కో సై అంటున్నది. 1983 ప్రపంచకప్ సెమీఫైనల్లో ఇదే పిచ్‌పై ఇంగ్లండ్‌ను ఓడించిన కపిల్ సేన ఆ తర్వాత ఫైనల్లోనూ నెగ్గి జగజ్జేతగా నిలిచిన స్ఫూర్తితో టీమ్‌ఇండియా అడుగు ముందుకు వేయనుంది.

### ఆకాశమంత..

'ఎప్పటికీ నువ్వే నా కెప్టెన్' అని పదే పదే అనే విరాట్ కోహ్లీ మరోమారు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీపై గౌరవాన్ని బయట పెట్టాడు. దేశానికి రెండు ప్రపంచకప్‌లు అందించిన మహీపై తనకు ఆకాశమంత గౌరవం ఉందని పేర్కొన్నాడు. 'నా దృష్టికోణంలో ధోనీ ఆకాశమంతటి వాడు. అతడిపై నాకున్న గౌరవం కూడా అలాంటిదే. ఒక జట్టుకు సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా వ్యవహరించిన వ్యక్తి దాదాపు అదే జట్టులో సామన్య ఆటగాడిగా కొనసాగడం చిన్న విషయం కాదు. అది అతడికే సాధ్యం. కొత్త కెప్టెన్‌గా నాకు కావల్సినంత స్పేస్ ఇచ్చాడు. నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పించాడు. ఇదంతా అతడిలోని మంచి గుణమే. అదే సమయంలో ఎలాంటి సందేహం అడిగినా సలహాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటాడు.

**- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్**

**3/6**
ప్రపంచకప్‌లో ఆరుసార్లు సెమీస్ చేరిన భారత్.. మూడింట గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది.

**26**
మరో 26 రన్స్ చేస్తే రోహిత్ (647) ఒక ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన సచిన్ (673)సరసన నిలుస్తాడు.

**350**
మహేంద్రసింగ్ ధోనీకిది 350వ వన్డే.

### కూర్పే సమస్య

టీమ్ ఇండియా బ్యాటింగ్ మొత్తం తొలి మూడు స్థానాల చుట్టే తిరుగుతున్నది. జట్టును తేల్చాలన్నా వాళ్లే.. ముంచాలన్నా వాళ్లే. ఆ తర్వాత పంత్, పాండ్యా, ధోనీ.. ఆ ముగ్గురికి ఈ ముగ్గురు జతైతే భారత్‌కు అడ్డేఉండదు. కానీ గత కొంత కాలంగా ధోనీ స్థాయికి తగ్గ మెరుపులు మెరిపించలేకపోతున్నాడు. ఇక రిటైర్మెంట్ ప్రకటించేస్తాడు అనే వాదనలు పెరిగిపోతున్న తరుణంలో మహీ బ్యాట్ ఝుళిపించాలని యావత్ భారతావని ఆశిస్తున్నది. అసలు సిసలు పోరుకు ముందు టీమ్‌ఇండియా జట్టు కూర్పు విషయంలో తర్జనభర్జన పడుతున్నది. ఐదుగురు బౌలర్లు చాలు అని కోహ్లీ అంటున్నా.. న్యూజిలాండ్‌పై మెరుగైన గణాంకాలు నమోదు చేసిన జాదవ్‌ను జట్టులోకి తీసుకునే చాన్సే ఎక్కువగా కనిపిస్తున్నది. విలియమ్సన్, లాథమ్‌ను రెండేసి సార్లు ఔట్ చేసిన జాదవ్ కివీస్‌పై మొత్తం 9 వికెట్లు పడగొట్టాడు. అదే జరిగితే.. కార్తీక్ తిరిగి బెంచ్‌కు పరిమితం కావాల్సిందే. అయితే ఇద్దరు మణికట్టు స్పిన్నర్లతో వెళ్తారా లేక.. ఒకర్ని తప్పించి ఆ స్థానంలో జడేజా, లేదా అదనపు పేసర్‌కు చాన్స్ ఇస్తారా అనే అంశంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. బుమ్రాతో జాగ్రత్త అని ఆ జట్టు మాజీ కెప్టెన్ వెటోరీ ఇప్పటికే న్యూజిలాండ్ ఆటగాళ్లకు హెచ్చరించాడు. మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. నాకౌట్‌లో బుమ్రా ఇంకా ప్రమాదకరం అని అన్నాడు. ఇప్పటి వరకు ఇలాంటి అంచనాలను నిజం చేస్తూ వచ్చిన బుమ్రా మరోసారి తన యార్కర్ మ్యాజిక్ చేయాలని పట్టుదలగా ఉన్నాడు. ఆడిన మ్యాచ్‌లు తక్కువే అయినా.. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టపడేసిన షమీ ఈ మ్యాచ్‌లోనూ రెచ్చిపోయేందుకు రెడీ అవుతున్నాడు. పాండ్యా స్లో బౌన్సర్లు జట్టుకు అదనపు ప్రయోజనం కల్పిస్తున్నాయి. గత మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఫీల్డింగ్‌లో చాలా తప్పిదాలకు పాల్పడింది. దాన్ని సవరించుకుంటే తిరుగుండదు.

### ఈ ముగ్గురూ X ఆ ముగ్గురూ

టాపార్డర్ బలంతోనే టీమ్‌ఇండియా విజయ ఢంకా మోగిస్తుందన్న విషయం జగద్విదితమే. ఓపెనర్లు రోహిత్ (647), రాహుల్ (359)తో పాటు వన్‌డౌన్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లీ (441) పరుగుల వరద పారిస్తుండటంతో భారత్ అలవోకగా భారీ స్కోర్లు చేయగలుగుతున్నది. మెగాటోర్నీలో ఈ ముగ్గురు కలిసి 1447 పరుగులు సాధించారు. టోర్నీ ఆరంభంలో శతకంతో అలరించిన మరో ఓపెనర్ శిఖర్ ధవన్ దూరమైనా.. రాహుల్ అతడి స్థానాన్ని భర్తీ చేస్తున్నాడనే చెప్పొచ్చు. మిడిలార్డర్‌కు పెద్దగా పనిపెట్టకుండా ఈ త్రయమే చెలరేగుతూ వస్తున్నది.. ఒకటీ అరా సందర్భాల్లో టాపార్డర్ విఫలమైతే.. బాధ్యత తీసుకునే అంశంలో మిడిల్ కాస్త తడబడుతున్నది. కీలక సెమీఫైనల్లోనూ మరోసారి ఈ ముగ్గురు విజృంభించి మొనగాళ్లని అనిపించుకుంటే.. భారత్‌కు తిరుగుండదు. న్యూజిలాండ్ పేసర్లు ఫెర్గూసన్ (17), బౌల్ట్ (15), హెన్రీ (10) కలిసి ఈ టోర్నీలో తీసిన వికెట్లు 42. బ్యాటింగ్‌లో పెద్దగా మెరుపులు లేకున్నా కివీస్ సెమీస్ వరకు చేరడంలో వీరి పాత్ర చాలా ఉంది. ఈ ముగ్గురితో పాటు నీషమ్ (11), గ్రాండ్‌హోమ్ (5) కూడా ఓ చేయి వేస్తే భారత్‌కు కష్టాలు తప్పకపోవచ్చు.

### వానొస్తే..

మాంచెస్టర్‌లో మంగళవారం వర్ష సూచన ఉందని బ్రిటన్ వాతావరణ శాఖ అంటోంది. తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటికే లీగ్ దశలో ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను వరుణుడు ముంచేసిన విషయం తెలిసిందే. అయితే నాకౌట్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉన్నా.. బుధవారం ఇంకా ఎక్కువ వర్షం పడే సూచనలు ఉన్నాయి. ఒకవేళ వరుణుడి కారణంగా రెండు రోజుల్లోనూ మ్యాచ్ సాధ్యంకాకపోతే.. లీగ్ దశలో అధిక పాయింట్లు సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. 8 మ్యాచ్‌లాడి ఏడింట గెలిచిన టీమ్‌ఇండియా 15 పాయింట్లతో ఉంటే.. న్యూజిలాండ్ 8 మ్యాచ్‌ల్లో ఐదు గెలిచి 11 పాయింట్లతో సెమీస్ చేరిన విషయం తెలిసిందే.

### ఒకే ఒక్కడు..

మెగాటోర్నీలో ఓ జట్టు చేసిన మొత్తం పరుగుల్లో ఒక్క బ్యాట్స్‌మెన్ వాటా పరంగా చూసుకుంటే.. విలియమ్సన్ అందరి కంటే ముందున్నాడు. కివీస్ స్కోర్లలో 30.23 శాతం ఒక్క కేన్ బ్యాట్‌నుంచే వచ్చాయి. పరుగుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న రోహిత్ (29.05) కూడా ఈ అంశంలో విలియమ్సన్ కంటే వెనుకే ఉన్నాడు. ఈ ఒక్క ఉదాహరణ చాలు న్యూజిలాండ్ జట్టు అతడిపై ఎంతగా ఆధారపడుతున్నదో చెప్పడానికి. జట్టు కష్టాల్లో ఉన్న ప్రతీసారి నేనున్నానంటూ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో సహచరులంతా వెనుదిరిగినా.. తీవ్ర ఒత్తిడిలో కూడా అదరక బెదరక ఎదురు నిలిచిన కేన్ అద్భుత శతకంతో చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. ఈ టోర్నీలో కేన్ ఇప్పటి వరకు 481 పరుగులు చేస్తే.. కివీస్ తరపున రెండో స్థానంలో ఉన్న రాస్ టేలర్ 261 పరుగులే చేశాడు. గప్టిల్ (166), మున్రో (125) పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కీలక మ్యాచ్‌లో ఓపెనర్లు మార్టిన్, హెన్రీ టచ్‌లోకి రావడంతో పాటు టేలర్, లాథమ్ కూడా రాణించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. ఆల్‌రౌండర్లు, నీషమ్, గ్రాండ్‌హోమ్, శాంట్నర్ అటు బాల్‌తో ఇటు బ్యాట్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ పోరులోనూ అదే జోరు కొనసాగిస్తే.. కివీస్‌కు తిరుగుండదు. తొడ కండరాలు పట్టేయడంతో గత మ్యాచ్‌కు దూరమైన పేసర్ ఫెర్గూసన్ తిరిగి జట్టుతో చేరడం కివీస్ బలాన్ని రెట్టింపు చేసేదే. మేఘావృతమైన వాతావరణంలో బౌల్ట్‌ను ఎదుర్కోవడం భారత ఓపెనర్లకు సవాలుతో కూడుకున్న పనే.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రాహుల్, రోహిత్, కోహ్లీ (కెప్టెన్), పంత్, ధోనీ, పాండ్యా, కార్తీక్/జాదవ్, భువనేశ్వర్/షమీ, కుల్దీప్, చహల్, బుమ్రా.

**న్యూజిలాండ్:** గప్టిల్, నికోల్స్, విలియమ్సన్, టేలర్, లాథమ్, నీషమ్, గ్రాండ్‌హోమ్, శాంట్నర్, ఫెర్గూసన్, హెన్రీ, బౌల్ట్.

### పిచ్, వాతావరణం

గత కొన్ని మ్యాచ్‌లుగా ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్‌పై మొదట బ్యాటింగ్ చేసిన జట్టే గెలుస్తున్నది. వికెట్ బ్యాటింగ్‌తో పాటు పేస్‌కు అనుకూలం. మ్యాచ్‌కు వర్ష సూచన ఉంది.

"ఫెర్గూసన్ ఇటీవల అద్భుతంగా ఆడుతున్నాడు. ముఖ్యంగా మెగాటోర్నీలో అవసరమైనప్పుడల్లా వికెట్లు పడగొట్టి జట్టుకు బ్రేక్‌త్రూ అందిస్తున్నాడు. నా దృష్టిలో మా జట్టుపై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. ఇది మాకు మేలు చేసే అంశమే. . టీమ్ ఇండియాలో ఎక్కువ మంది మ్యాచ్ విన్నర్లు ఉన్నారు.

**-గ్యారీ స్టీడ్, న్యూజిలాండ్ కోచ్**

## బెట్టింగ్ సైట్ల ఫేవరెట్ భారతే

**లండన్:** ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో భారత్ ఫేవరెట్ అనే విషయాన్ని విశ్లేషకులు, క్రీడా పండితులే కాదు.. బెట్టింగ్ రాయుళ్లు కూడా ఒప్పేసుకుంటున్నారు. మంగళవారం కివీస్‌తో మ్యాచ్‌లో టీమ్‌ఇండియానే విజయం సాధిస్తుందని.. అంతేకాదు, ఫైనల్లో నెగ్గి జగజ్జేతగా నిలుస్తుందని ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్లు నిర్ధారించేశాయి. లాడ్‌బ్రోకర్స్, బెట్‌వే వంటి వెబ్‌సైట్లు... లార్డ్స్‌లో జరిగే ఫైనల్లో భారత్ గెలిచి కప్పును ముద్దాడుతుందని అంచనా వేస్తున్నాయి. విజేతగా టీమ్‌ఇండియా నిలుస్తుందని లాడ్‌బ్రోకర్స్ బెట్టింగ్‌ను 13/8గా నిర్ణయిస్తే... ఇంగ్లండ్(15/8), ఆస్ట్రేలియా(11/4), న్యూజిలాండ్(8/1) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఉదాహరణకు.. ఈ సైట్‌లో భారత్ గెలుస్తుందని బెట్ వేసిన వ్యక్తి అంచనా నిజమైతే పందెం కట్టిన మొత్తాన్ని 13ఇంతలు చేసి.. 8తో భాగించగా వచ్చిన సొమ్ము(రూ.100కు 162)ను ఇస్తారు. ఒకవేళ న్యూజిలాండ్ తరపున బెట్ కట్టి అదే జట్టు గెలిస్తే పందెం వేసిన మొత్తాన్ని 8రెట్లు చేసి 1తో భాగించగా వచ్చిన సొమ్ము(రూ.100కు 800)ను ఇస్తారు. ఇక బెట్‌వే కూడా భారత్‌కే ఓటేస్తూ.. 2.8తో మొదటిస్థానాన్ని కట్టబెట్టగా ఇంగ్లండ్(3), ఆస్ట్రేలియా(3.8), న్యూజిలాండ్(9.5) ఆ తర్వాత ఉన్నాయి. దీనిప్రకారం భారత్ టైటిల్ గెలిస్తే ఆ జట్టు తరపున పందెం కట్టిన వ్యక్తి.. వెచ్చించిన మొత్తానికి 2.8 రెట్లు పొందుతాడు. ఇదే న్యూజిలాండ్ తరపున వేసి ఆ జట్టు గెలిస్తే ఏకంగా 9.5రెట్ల మొత్తాన్ని కైవసం చేసుకుంటాడు. అలాగే ఆటగాళ్ల విషయంలోనూ బ్యాట్స్‌మెన్ ఫేవరెట్‌గా టీమ్‌ఇండియా ఓపెనర్ రోహిత్ శర్మ ఉండగా.. ఆ తర్వాత వార్నర్, రూట్ ఉన్నారు.

## హిమాకు మరో స్వర్ణం



**న్యూఢిల్లీ:** భారత స్టార్ స్ప్రింటర్ హిమా దాస్ వారం వ్యవధిలో మరో స్వర్ణంతో మెరిసింది. పోలండ్ వేదికగా జరుగుతున్న కుట్నో అథ్లెటిక్స్ మీట్‌లో హిమా దాస్ పసిడి పతకం సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల 200 మీటర్ల రేసులో హిమా 23.97 సెకండ్లలో గమ్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన విస్మయ (24.06సె)కు రజతం దక్కింది. గత వారం పోలండ్‌లోనే జరిగిన పొజ్నన్ అథ్లెటిక్స్ గ్రాండ్‌ప్రిలో కూడా హిమ బంగారు పతకం నెగ్గిన విషయం తెలిసిందే. మరోవైపు పురుషుల 200 మీటర్ల విభాగంలో మొహమ్మద్ అనస్ (21.18 సెకండ్లు) స్వర్ణం నెగ్గాడు. 400 మీటర్ల పురుషుల హర్డిల్స్‌లో జాబీర్ స్వర్ణం నెగ్గగా.. జితిన్ కాంస్యం దక్కించుకున్నాడు.

## ఫైనల్లో కశ్యప్ ఓటమి

**కాల్గరీ (కెనడా):** అదిరిపోయే ఆటతో కెనడా ఓపెన్ సూపర్ 100 టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పారుపల్లి కశ్యప్.. తుదిపోరులో తడబడ్డాడు. సోమవారం ఉత్కంఠభరితంగా జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో కశ్యప్ 22-20, 14-21, 17-21తో లీ షీ ఫెంగ్(చైనా) చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. గంటా 16 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కశ్యప్ తొలుత ఆధిపత్యం ప్రదర్శించినా చివరివరకు అదే జోరు కొనసాగించలేకపోయాడు. మొత్తంగా ఫైనల్లో పరాజయం పాలై రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీలో తనకు ఎంతగానో తోడ్పాటు అందించిన సహచర ఆటగాడు ప్రణయ్‌కు ట్విట్టర్ వేదికగా కశ్యప్ కృతజ్ఞతలు తెలిపాడు. యూఎస్ ఓపెన్ టోర్నీ ప్రారంభం కానున్న నేపథ్యంలో కశ్యప్ వ్యక్తిగత కోచ్, ఫిజియో అమెరికాకు వెళ్లగా... అప్పటి నుంచి అతడి వెంట ఉన్న ప్రణయ్ ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడు. అమెరికాలోని ఫుల్లెర్టన్‌లో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే యూఎస్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో కశ్యప్ ఆడనున్నాడు.

- టాప్‌సీడ్ బార్టీ, మూడో సీడ్ ప్లిస్కోవా ఓటమి
- యువ సంచలనం గాఫ్ నిష్క్రమణ
- క్వార్టర్స్‌కు సెరెనా, హలెప్
- ముందడుగేసిన జొకో, ఫెదరర్, నాదల్

## సంచలనాల మోత

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో సంచనాల హోరు కొనసాగుతున్నది. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో టాప్‌సీడ్ ఆష్లే బార్టీ.. అన్‌సీడెడ్ క్రీడాకారిణి చేతిలో పరాజయం పాలవగా... మూడో సీడ్ ప్లిస్కోవా సైతం ఇంటిబాట పట్టింది. 15ఏండ్ల వయసులో అసాధారణ విజయాలతో దూసుకొచ్చిన కోరీ గాఫ్ కూడా నిష్క్రమించింది. సెరెనా విలియమ్స్, ఏడో సీడ్ హలెప్ అదరగొట్టే ఆటతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు.



**లండన్:** తొలి రౌండ్‌లో వీనస్ విలియమ్స్ నిష్క్రమణ.. రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కెర్బర్ ఓటమి.. తాజాగా ప్రిక్వార్టర్స్‌లో టాప్‌సీడ్ ఆష్లే బార్టీకి షాక్.. ఇలా సంచనాలతో వింబుల్డన్ టోర్నీ మోతెక్కిపోతున్నది. సోమవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ ప్లేయర్ అలిసోన్ రిస్కే(అమెరికా) చేతిలో 6-3, 2-6, 3-6తో టాప్ సీడ్, ఫ్రెంచ్ ఓపెన్ విజేత ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా) పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరోమ్యాచ్‌లో మూడో సీడ్ కరోలినా ప్లిస్కోవా(చెక్‌రిపబ్లిక్) 6-4, 5-7, 11-13తో తన దేశానికే చెందిన కరోలినా ముచోవా(అన్‌సీడెడ్) చేతిలో పోరాడి ఓడింది. 3గంటల 17నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ముచోవా ఏకంగా 14ఏస్‌లు, 54 విన్నర్లను సాధించింది. మరోవైపు ఆరో సీడ్ పెట్రా క్విటోవా(చెక్‌రిపబ్లిక్)ను 4-6, 6-2, 6-4 తేడాతో 19వ సీడ్ జొహన్నా కొంటా(బ్రిటన్) ఓడించి, క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. మాజీ చాంపియన్ సెరెనా విలియమ్స్(అమెరికా) 6-2, 6-2 తేడాతో సువారెజ్ నవార్రో(స్పెయిన్)ను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టింది. అలాగే 15ఏండ్ల అమెరికా సంచలనం కోరీ గాఫ్ 3-6, 3-6తో ఏడో సీడ్ హలెప్ చేతిలో ఓడింది. ఇతర మ్యాచ్‌ల్లో ఎనిమిదో సీడ్ సిటోలినా(ఉక్రెయిన్), ఎస్.జంగ్(చైనా), స్ట్రైకోవా(చెక్ రిపబ్లిక్) విజయాలు సాధించి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

**ఆడుతూ పాడుతూ..**
పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో... మూడో సీడ్ రఫెల్ నాదల్(స్పెయిన్) 6-2, 6-2, 6-2తో అన్‌సీడెడ్ ప్లేయర్ జొవావో సొసా(పోర్చుగల్)పై, ఫెదరర్(స్విట్జర్లాండ్) 6-1, 6-2, 6-2తో బెరెటిని(ఇటలీ)పై, నిషికోరి 6-3, 3-6, 6-3, 6-4తో కుషిష్కిన్(కజకిస్థాన్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టారు. మరోమ్యాచ్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్(సెర్బియా) 6-3, 6-2, 6-3తో యుగో హంబర్ట్(ఫ్రాన్స్)ను చిత్తు చేశాడు. అలాగే 21సీడ్ డి. గోఫిన్ (బెల్జియం) 7-6(11/9), 2-6, 6-3, 6-4తో వెర్డాస్కోను ఓడించగా... బౌటిస్టా అగట్(స్పెయిన్) 6-3, 7-5, 6-2తో బెనోయిట్ పెయిర్(ఫ్రాన్స్)ను మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్స్‌లో అడుగుపెట్టాడు. మరో మ్యాచ్‌లో సామ్ క్వెర్రీ(అమెరికా) 6-4, 6-7(7/9), 7-6(7/3), 7-6(7/5)తో టెన్నీస్ సాండ్‌గ్రెన్‌ను చెమటోడ్చి ఓడించాడు.



జాతీయ జట్టు తరపున బార్సిలోనాలో వరల్డ్ రోలర్ గేమ్స్ ఇన్‌లైన్ హాకీ ఆడేందుకు వెళ్తున్న ప్లేయర్ కర్ర ఆర్యన్ సోమవారం రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డిని కలిశాడు. ఈ క్రీడల్లో పాల్గొంటున్న తొలి తెలంగాణ ఆటగాడికి మంత్రి అభినందనలు తెలిపారు. చిత్రంలో ఆర్యన్ తల్లిదండ్రులు నగేశ్, ప్రీతి నిగమ్ ఉన్నారు.

## హీరో బైకులు మరింత ప్రియం



ఒక్క శాతం ధర పెంచిన సంస్థ

**న్యూఢిల్లీ, జూలై 8:** ద్విచక్ర వాహన తయారీలో అగ్రగామి సంస్థ హీరో మోటో కార్ప్.. వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. అన్ని రకాల మోటార్‌సైకిల్, స్కూటర్ల ధరలను ఒక్కశాతం వరకు పెంచినట్లు సోమవారం ప్రకటించింది. పెంచిన ధరలు వెంటనే అమలులోకి వచ్చాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ధరలు పెంచడానికి గల కారణాలను సంస్థ వెల్లడించలేదు. కంపెనీ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆయా షోరూంలలో ఉన్న ధరలు బట్టి ఒక్క శాతం వరకు అన్ని రకాల మోడళ్లు ప్రియంకానున్నాయి.

## సరికొత్తగా డస్టర్

- ప్రారంభ ధర రూ.8 లక్షలు



**న్యూఢిల్లీ, జూలై 8:** ఫ్రెంచ్‌కు చెందిన వాహన తయారీ సంస్థ రెనో..దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన ఎస్‌యూవీ డస్టర్‌ను సరికొత్తగా తీర్చిదిద్ది మళ్లీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ కారు రూ.8 లక్షల మొదలుకొని రూ.12.5 లక్షల లోపు లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీకి సంబంధించినవి. ఈ సరికొత్త కారులో 25 నూతన ఫీచర్స్, టెక్నాలజీతో రూపొందించినట్లు, వీటిలో యాపిల్ కార్‌ప్లే, వాయిస్‌ను గుర్తించే ఆండ్రాయిడ్ ఆటో ఇన్ఫోటైన్‌మెంట్, ఇకోగైడ్, భద్రత ఫీచర్లైన ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ ప్రోగ్రామ్(ఈఎస్‌పీ), హిల్-స్టార్ట్ యాక్సెస్ వంటి ఫీచర్స్ ఉన్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. రెండు రకాల ఇంజిన్లను ఎంపిక చేసుకునే సౌలభ్యం కలిగిన ఈ కారు 1.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్, 1.5 లీటర్ల డీజిల్ ఇంజిన్‌తో రూపొందించింది. పెట్రోల వెర్షన్ సీవీటీ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, డీజిల్ కూడా ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఎంపిక చేసుకోవచ్చును. ఈ సందర్భంగా రెనో ఇండియా సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్రామ్ మామిళ్లపల్లి మాట్లాడుతూ..కంపెనీకి చెందిన వాహనాల్లో డస్టర్ చాలా కీలకమని, వినియోగదారులను విశేషంగా ఆదరణ పొందిన డస్టర్‌లో నూతన వెర్షన్ కూడా ఆకట్టుకునే అవకాశం ఉందన్నారు.

## ఫండ్ల నుంచి రూ.1.60 లక్షల కోట్లు వెనక్కి

**న్యూఢిల్లీ, జూలై 8:** గడిచిన నెలలో మ్యూచువల్‌ఫండ్ల నుంచి రూ.1.60 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టుబడిదారులు ఉపసంహరించుకున్నారు. మే నెలలో రూ.76,989 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు.. ఆ మరుసటి నెలలో భారీ స్థాయిలో వెనక్కి తీసుకోవడం విశేషం. పెట్టుబడిదారుల్లో నమ్మకం సడలడం ఇందుకు కారణమని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్ ఆఫ్ ఇండియా(ఆంఫీ) విడుదల చేసిన ప్రత్యేక నివేదికలో వెల్లడించింది. డెబిట్-ఓరియెంటెట్ స్కీంల నుంచి రూ.1.71 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న ఇన్వెస్టర్లు..ఇదే మే నెలలో రూ.70,119 కోట్లను పెట్టుబడి రూపంలో చొప్పించారని తెలిపింది. ఐఎల్అండ్ఎఫ్ఎస్, ఎస్సెల్, డీహెచ్ఎఫ్ఎల్‌లు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో మదుపరులు ముందుజాగ్రత్త చర్యలకు మొగ్గుచూపారని, ఫలితంగా మ్యూచువల్ ఫండ్లతోపాటు ఈక్విటీ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి మొగ్గుచూపుతున్నట్లు నివేదిక అభిప్రాయపడింది.

# దలాల్ స్ట్రీట్ ధమాల్

- భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 793, నిఫ్టీ 252 పాయింట్లు పతనం
- ప్రస్తుత సంవత్సరంలో గరిష్ఠ స్థాయి క్షీణత
- బడ్జెట్ నిర్ణయాలను మెచ్చని మదుపరులు



**ముంబై, జూలై 8:**

దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. బడ్జెట్ ప్రతిపాదనలపై అసంతృప్తి మధ్య ఆ రంగం.. ఈ రంగం.. అన్న తేడా లేకుండా మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే సోమవారం ఈ ఏడాదిలోనే గరిష్ఠ స్థాయి నష్టాలను చవిచూశాయి. దీంతో మార్కెట్ విలువ కూడా లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 792.82 పాయింట్లు లేదా 2.01 శాతం పతనమై 38,720.57 వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 252.55 పాయింట్లు లేదా 2.14 శాతం క్షీణించి 11,558.60 వద్ద నిలిచింది. ఒకానొక దశలో సెన్సెక్స్ 908, నిఫ్టీ 259 పాయింట్లు దిగజారాయి. ఆర్థిక, ఆటో, చమురు రంగాల షేర్లలో మదుపరులు పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను గత శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మినిమం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను ప్రస్తుతమున్న 25 శాతం నుంచి 35 శాతానికి పెంచడం, విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులపై, అపర కుబేరులపై అధిక పన్నులను బాదడం జరిగింది. అంతేగాక షేర్ బైబ్యాక్‌పై 20 శాతం పన్ను ప్రకటించారు. ఇవి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయగా, శుక్రవారం సైతం సెన్సెక్స్ 395, నిఫ్టీ 136 పాయింట్ల మేర నష్టపోయిన విషయం తెలిసిందే.

**సెన్సెక్స్ టాప్-10 నష్టాలు**

| తేదీ | ముగింపు | పాయింట్లు | కారణం |
|---|---|---|---|
| ఆగస్టు 24, 2015 | 25,742 | 1,625 | చైనా సంక్షోభం |
| జనవరి 21, 2008 | 17,605 | 1,408 | అమెరికా మాంద్యం |
| అక్టోబర్ 24, 2008 | 8,701 | 1,071 | ప్రపంచ ఆర్థిక మాంద్యం |
| మార్చి 17, 2008 | 14,809 | 951 | విస్తరించిన గ్లోబల్ ఆర్థిక భయాలు |
| మార్చి 3, 2008 | 16,678 | 901 | అమెరికా జీడీపీలో భారీ పతనం |
| జనవరి 22, 2008 | 16,730 | 875 | అమెరికా మాంద్యం |
| జూలై 6, 2009 | 14,043 | 870 | కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి |
| జనవరి 6, 2015 | 26,987 | 855 | గ్రీస్ సంక్షోభం, చమురు ధరల క్షీణత |
| ఫిబ్రవరి 2, 2018 | 35,067 | 840 | మూలధన లాభాలపై దీర్ఘకాలిక పన్ను |
| ఫిబ్రవరి 11, 2008 | 16,631 | 834 | అమెరికా మాంద్యం |
| జూలై 8, 2019 | 38,720 | 793 | కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి |

**ఆకట్టుకోని ఆటో, ఆర్థిక షేర్లు**

ఆటో, ఆర్థిక రంగ షేర్లు మదుపరులను ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాయి. హీరో మోటోకార్ప్ 5.3 శాతం, మారుతి 5.2 శాతం, టాటా మోటర్స్ 3.4 శాతం, బజాజ్ ఆటో 2 శాతం చొప్పున నష్టపోయాయి. ఎస్‌బీఐ 4.14 శాతం, యాక్సిస్ బ్యాంక్ 2.84 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 0.77 శాతం మేర కోల్పోయాయి. చమురు రంగ షేర్లనూ నష్టాలు వెంటాడగా, ఓఎన్జీసీ 5.43 శాతం దిగజారింది. ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్అండ్‌టీ 4.3 శాతం పడిపోగా, మార్కెట్ లీడర్ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేర్ విలువ 0.85 శాతం తగ్గింది.

**మైండ్‌ట్రీ, పీఎన్‌బీ షేర్లకు కష్టాలు**

సంస్థల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులకు తోడు మార్కెట్‌లో చోటుచేసుకున్న విపత్కర పరిణామాలు.. దేశీయ మధ్యశ్రేణి ఐటీ రంగ సంస్థ మైండ్‌ట్రీ, ప్రభుత్వ రంగ ప్రధాన బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) షేర్ల ఉసురు తీశాయి. మైండ్‌ట్రీలో మెజారిటీ వాటాను ఎల్అండ్‌టీ దక్కించుకున్న నేపథ్యంలో సంస్థ చైర్మన్, సీఈవో రాజీనామాలు మైండ్‌ట్రీ షేర్ విలువను 13 శాతం తగ్గించాయి. బీఎస్ఈలో 10.43 శాతం, ఎన్ఎస్ఈలో 13 శాతం నష్టపోయాయి. ఇక భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ రూ.3,805 కోట్ల మోసం వెలుగు చూసిన నేపథ్యంలో పీఎన్‌బీ షేర్ విలువ కూడా బీఎస్ఈలో 10.95 శాతం, ఎన్ఎస్ఈలో 11.24 శాతం నష్టపోయాయి.

**గ్లోబల్ మార్కెట్లు కూడా..**

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలూ.. దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఆసియా దేశాల్లోని ప్రధాన సూచీలన్నీ నష్టాలకే పరిమితం కావడం.. మదుపరుల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. చైనా సూచీ 2 శాతానికిపైగా పడిపోతే, హాంకాంగ్ సూచీ దాదాపు 2 శాతం, జపాన్ ఒక శాతం నష్టపోయాయి. సింగపూర్, ఫిలిప్పీన్స్, తైవాన్, బ్యాంకాక్, మలేషియా సూచీలూ లాభాలకు నోచుకోలేదు. ఇక ఐరోపా మార్కెట్లలో కీలక స్టాక్ మార్కెట్లైన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ సూచీలు కూడా నష్టపోయాయి. న్యూజీలాండ్, ఆస్ట్రేలియా స్టాక్ మార్కెట్లూ పడిపోయాయి. అమెరికా ఉద్యోగ గణాంకాలు బాగుండటం.. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతకున్న అవకాశాలను మింగేయడంతో అంతర్జాతీయ మార్కెట్లు ప్రధానంగా నష్టాలకు గురయ్యాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి**

ఇటీవలి భారీ నష్టాల కారణంగా మార్కెట్‌లో మదుపరుల సంపద రూ.లక్షల కోట్లలో కరిగిపోయింది. సోమవారం సెన్సెక్స్ భీకర పతనం నేపథ్యంలో బీఎస్ఈలోని సంస్థల మార్కెట్ విలువ రూ.3.39 లక్షల కోట్లకుపైగా ఆవిరైంది. మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో రూ.3,39,192.97 కోట్లు దిగజారి రూ.1,47,96,302.89 కోట్లకు పరిమితమైంది. గత శుక్రవారం కూడా సూచీలు నష్టాలకు గురవగా, ఈ రెండు రోజుల్లో మదుపరుల సంపద రూ.5,61,772.64 కోట్లు కనుమరుగైంది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 27 షేర్లు నష్టాల పాలైయ్యాయి. అత్యధికంగా బజాజ్ ఫైనాన్స్ షేర్ విలువ 8.18 శాతం, ఓఎన్జీసీ షేర్ విలువ 5.43 శాతం పడిపోయింది.

## రూపాయి 25 పైసలు డౌన్

**ముంబై, జూలై 8:** వరుసగా మూడు రోజులపాటు పెరిగిన దేశీయ కరెన్సీ విలువ.. భారీగా పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 24 పైసలు పడిపోయి 68.66 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అలజడి, అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశాలు లేవన్న వార్తలు.. రూపాయి పతనానికి ఆజ్యం పోశాయి. 68.49 వద్ద ప్రారంభమైన మారకం విలువ.. ఒక దశలో 68.76 స్థాయికి పడిపోయింది. చివరకు శుక్రవారం ముగింపుతో పోలిస్తే 24 పైసలు క్షీణించి రూ.68.66 వద్ద స్థిరపడింది. శుక్రవారం రూపాయి విలువ 8 పైసలు బలపడి రూ.68.42 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. రూపాయి సెంటిమెంట్‌తో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.401.99 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతున్నట్లు నివేదిక విడుదల కావడంతో ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు లేకపోవడం, సంపన్న వర్గాలపై మరింత పన్నును విధించనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటన కూడా పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని ఫారెక్స్ డీలర్ పేర్కొన్నారు.

# ఇకనైనా తగ్గిస్తారేమో..!

- బ్యాంకుల వడ్డీరేట్ల కోతలపై ఆర్బీఐ
- ఖాతాదారులకు ప్రయోజనాలు అందడం లేదని అసంతృప్తి

**న్యూఢిల్లీ, జూలై 8:**



ఢిల్లీలో సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్

వడ్డీరేట్ల తగ్గింపులకు సంబంధించి బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసింది. తమ వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనాలను ఖాతాదారులకు ఇకనైనా త్వరగా అందిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఆర్బీఐ మూడుసార్లు కీలక వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ఇలా రెపో రేటును మొత్తం 75 బేసిస్ పాయింట్లు దించింది. అయినప్పటికీ బ్యాంకులు ఆ స్థాయిలో రుణాలపై వడ్డీరేట్లను తగ్గించడం లేదని ఆర్బీఐ తీవ్ర అసహనాన్నే వ్యక్తం చేస్తున్నది. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాసే గాక, అంతకుముందు గవర్నర్ ఉర్జిత్ పటేల్ సైతం.. తమ ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల కోతల నిర్ణయాలకు అనుగుణంగా బ్యాంకులు వెళ్లడం లేదని అంటున్నారు. తాజాగా మరోసారి దాస్ ఈ విషయంపై స్పందించారు. సోమవారం ఇక్కడ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో బడ్జెట్ అనంతర సమావేశంలో దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డీరేట్లు తగ్గితే గృహ, వాహన, వ్యక్తిగత రుణాల భారం తగ్గుతుందని, దీనివల్ల అటు బ్యాంకింగ్ పరిశ్రమకు, ఇటు రియల్టీ, ఆటో పరిశ్రమలకు వ్యాపారం పెరుగుతుందని అన్నారు.

**తగిన నగదు నిల్వలున్నాయ్**

వ్యవస్థలో తగినన్ని నగదు నిల్వలున్నాయని, ఏదైనా బ్యాంకుకు ద్రవ్యకొరత సమస్య ఉంటే, తాము అందిస్తామని దాస్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. గతేడాది ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ సంక్షోభం నేపథ్యంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగానిక నగదు కష్టాలు వచ్చిపడ్డాయి. దీనిపై అప్పటి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ సైతం దృష్టి పెట్టగా, ఆర్బీఐకి తగిన సూచనలు చేశారు. తాజా బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఆర్థికంగా బలమైన ఎన్‌బీఎఫ్‌సీల ఆస్తులను కొనుగోలు చేయవచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకులకు సూచనలు చేశారు. తద్వారా ఈ రంగంలోని ఒత్తిడిని తగ్గించాలని ప్రయత్నించారు. కాగా, ప్రభుత్వ బ్యాంకుల్లోకి రూ.70,000 కోట్ల నిధులను మూలధనంగా తెస్తామన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను దాస్ స్వాగతించారు.

**సావరిన్ బాండ్లపై చర్చ..**

ద్రవ్యలోటును కట్టడి చేయడంలో భాగంగా దేశీయ మార్కెట్లపై ఆధారపడటం తగ్గించి విదేశీ సావరిన్ బాండ్ల జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించినట్లు శక్తికాంత దాస్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, ఖర్చుల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించడానికి ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు, వీటిలో సావరిన్ బాండ్ల జారీ ప్రథమమని ఆయన వ్యాఖ్యానించారు. ద్రవ్యలోటును కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తంచేసిన ఆయన... తద్వారా పెట్టుబడుల మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై సుధీర్ఘంగా చర్చించినట్లు సమావేశం అనంతరం దాస్ చెప్పారు.

## 7 శాతం వృద్ధితో అసాధ్యం

- 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవడం అంత సులభం కాదు
- కేంద్ర ఆర్థిక మంత్రి మాజీ సలహాదారు మోహన్ గురుస్వామి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి సార్వత్రిక బడ్జెట్‌లో కొన్ని సానుకూల అంశాలు ఉన్నప్పటికీ కార్పొరేట్ పన్నులు పెంచడం ఆందోళనకరమైన అంశమని కేంద్ర ఆర్థిక మంత్రి మాజీ సలహాదారు మోహన్ గురుస్వామి అభిప్రాయపడ్డా రు. ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం బడ్జెట్‌పై విశ్లేషణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మోహన్ గురుస్వామి మాట్లాడుతూ.. గడిచిన పదేండ్లుగా 6 శాతం నుంచి 7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న భారత్..ఈ వృద్ధితో 2024 నాటికి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవడం అంత సులభం కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ లక్ష్యానికి చేరుకోవాలంటే కనీసం 12-13 శాతం వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ మురళీధరన్, ఐఎంటీ హైదరాబాద్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయము (పి.ఐ.యు), కామారెడ్డి

టెండరు నోటీసు నెం: టి2/03/2019-20 **టెండరు ప్రకటన** తేది: 29-06-2019

జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, (పి.ఐ.యు) డివిజన్ కామారెడ్డి ద్వారా ZGS Grant 2018-2019 నిధుల సంబంధించిన పనిని చేపట్టుటకు గాను రిజిష్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించనైనది. మొత్తం పనుల సంఖ్య: 2, అంచనా విలువ: 17.00 లక్షలు, అప్లికేషన్ చేయుటకు చివరి తేది: 13-07-2019, టెండర్లు షెడ్యూలు జారీ చేయు తేది: 16-07-2019, టెండర్లు స్వీకరించు తేది:17-07-2019 మధ్యాహ్నం 3.00 గంటల వరకు, టెండర్లు తెరుచు తేది: 17-07-2019 మ. 3.30 గంటల వరకు. ఇతర వివరములు మరియు టెండర్ నియమములు జిల్లా పంచాయతీ రాజ్ (పి.ఐ.యు) డివిజన్, కామారెడ్డి రీజినల్ ఆఫీసర్, పంచాయతీ రాజ్, నిజామాబాద్, డి.ఇ.ఇ. పి.ఆర్. కామారెడ్డి, ఎల్లారెడ్డి మరియు తాడ్వాయి కార్యాలయంలో ప్రదర్శించబడిన టెండర్ నోటీస్‌లలో లభ్యమగును.

DIPR R.O.No. 570 DP/CL/Advt/1/2019-20 తేది: 08-07-2019 సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరు, (పి.ఐ.యు.) కామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనాల శాఖ, ఆదిలాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. SE/R&B/ADB/17/2019-20 తేది: 01-07-2019

**పని పేరు:** నిర్మల్ జిల్లాలో నిర్మల్ నియోజకవర్గ, నిర్మల్ మునిసిపల్ సరిహద్దులలో నాగనాయిపేట వద్ద సర్వే నం. 46, 47 & 390 నుండి 397 వరకు 2 BHK ఇండ్లలో (485) అర్బన్ (G+2) నిర్మించుట. సుమారుగా ECV విలువ (రూ.లక్షలలో)=2570.50. పై పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడినవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా "www.eprocurement.gov.in నుండి 05-07-2018 నుండి పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం: 12-07-2019, సాయంత్రం 4.00 గంటల వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై చూడవచ్చును.

సం/- పర్యవేక్ష ఇంజినీర్ (ఆర్ & బి) సర్కిల్, ఆదిలాబాద్

DIPR R.O.No. 562 DP/CL/Advt/1/2019-20 తేది: 08-07-2019

తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన-14

11 పనుల కోసం టెండరు నం.లు T83 నుండి T93/2019-20 తేదీ : 6-7-2019 కోసం సివిల్ పనుల నిమిత్తం టెండర్లు కోరబడుచున్నవి. ''టెండరు నం, జిల్లాలో గల పని & మొత్తం అంచనా విలువ (రూ. లక్షల్లో) దిగువ విధంగా వరుసగా T83-జయశంకర్ భూపాలపల్లి-1-8.19; T84-రాజన్న సిరిసిల్ల-1-6.62; T85-మహబూబ్‌నగర్-1-3.60;T86-మెదక్-1-15.11; T87-మంచిర్యాల మరియు నిర్మల్-1-1.15; T88-పెద్దపల్లి-1-6.97;T89 ఆసిఫాబాద్-1-9.66;T90-వరంగల్-1-18.21;T91-సంగారెడ్డి-1-12.85; T92-జనగాం-1-5.23;T93-జగిత్యాల-1-5.17. **ఆన్‌లైన్‌లో షెడ్యూలు లభ్యత : 8-7-2019 నుండి.** టెండరు నం. T83, T84, T85, T86, T87, T88, T89, T90, T91, T92 & T93 కోసం **బిడ్ల దాఖలుకు ఆఖరి తేదీ/ సమయం : తేది : 15-7-19న/సా. 5.00 గం.** తదుపరి వివరాలను www.tenders.telangana.gov.in వద్ద వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

సం/- మేనేజింగ్ డైరెక్టర్

DIPR RO No. 235-pp/CL/Advt/1/2019-20, Dt: 08/07/2019

తెలంగాణ ప్రభుత్వము
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, నల్లగొండ. ఫోన్:08682-227646

1. టెండర్ నోటీస్ నెం.24SE/2018-19(2nd Call), Dt:31.01.2019

పని పేరు: సూర్యాపేట జిల్లా-సూర్యాపేట మండలం-సూర్యాపేట గ్రామం-పుల్లారెడ్డి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా పునరుద్ధరణ మరియు సుందరీకరణ (బ్యూటిఫికేషన్) పనులు అంచనా విలువ: రూ.1275.53 లక్షలు
టెండరు స్వీకరించు చివరి తేది మరియు సమయం: 15.07.2019 మ.3-00 గం.వరకు
గమనిక: మిగతా వివరాలకు www.tender.telangana.gov.in (mission Kakatiya) వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- శ్రీ ఎం.ఎ.హమీద్ ఖాన్, బి.ఇ.,
పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, నల్లగొండ


## 21 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం

కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్



**న్యూఢిల్లీ, జూలై 8:** మరోమారు బ్యాంకుల విలీనానికి సిద్ధమైంది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే పలు బ్యాంకులను కలిపివేసిన కేంద్రం.. తాజాగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులపై దృష్టిసారించింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ బ్యాంకుల్లో 21 ఆర్ఆర్‌బీలను విలీనం చేయాలనుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ లోక్‌సభకు తెలిపారు. వీటికి స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్న బ్యాంకులు, రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కూడా తెలుసుకుంటున్నట్లు లోక్‌సభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. దీంతో ఆర్ఆర్‌బీల ఖర్చులు తగ్గించడానికి, టెక్నాలజీ వినిమయాన్ని పెంచడానికి, మూలనిధిని అవసరమైన నిధులను కేటాయించడం మరింత సులభతరమవనున్నదన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 56 ఆర్ఆర్‌బీలు ఉండగా, వీటిని 38కి కుదించాలని కేంద్రం నిర్ణయించిందని, అందుకు తగ్గట్టుగా అనుకూలమైన బ్యాంకులను విలీనం చేయాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ..మార్చి 31, 2019 నాటికి వివిధ బ్యాంకుల్లో అనాధికార డిపాజిట్లపై 1,288 కేసులను నమోదైనట్లు తెలిపారు.

**ప్రభుత్వ బ్యాంకులకు రూ.3.15 లక్షల కోట్లు**

గడిచిన 11 ఏండ్లలో ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.3.15 లక్షల కోట్ల స్థాయిలో నిధులను కేటాయించినట్లు ఠాకూర్ తెలిపారు. దేశవ్యాప్తంగా నిధుల కొరత తీవ్రంగా ఉన్నదని విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ..అలాంటి పరిస్థితులేమి లేవని, రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలకు లోబడి నిధుల కేటాయింపు జరిగిందని, బ్యాంకులకు కనీస నగదు నిల్వలు ఉండాలన్నారు. 2008-09 నుంచి 2018-19 వరకు ప్రధాన బ్యాంకులు రూ.2,81,616 కోట్ల నిధులను వివిధ మార్గాల ద్వారా సేకరించాయి. ఇదే సమయంలో బ్యాంకుల్లోకి రూ.3,15,721 కోట్ల నిధులను కేటాయించిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఇదే క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.70 వేల కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన విషయం తెలిసిందే.

## విలీన ప్రతిపాదనేదీ లేదు

**ప్రభుత్వ రంగ చమురు సంస్థలపై చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

**న్యూఢిల్లీ, జూలై 8:** ప్రభుత్వ రంగ చమురు, గ్యాస్ సంస్థలను ప్రస్తుతం విలీనం చేసే ప్రతిపాదనేదీ తమ వద్ద లేదని చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రశ్నకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అయితే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)లు గెయిల్ ఇండియా లిమిటెడ్‌ను కొనుగోలు చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయాన్ని నిరుడు ఫిబ్రవరి 7న రాజ్యసభకు మంత్రి ప్రధాన్ స్పష్టం చేశారు కూడా. అయితే దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని నాడు చెప్పారాయన. ఈ క్రమంలో తాజా ప్రకటన ఐవోసీ, బీపీసీఎల్‌ల ప్రయత్నాలు ఆగిపోయాయన్న సంకేతాలనిస్తున్నది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో కేంద్ర ప్రభుత్వ వాటాను గతేడాది జనవరిలో ఓఎన్జీసీ హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. తద్వారా చమురు మార్కెటింగ్ వ్యాపారంలోకి ఈ ప్రభుత్వ రంగ చమురు, సహజవాయువు ఉత్పాదక దిగ్గజం ప్రవేశించినట్లైంది. దీంతో గెయిల్‌ను సొంతం చేసుకుని గ్యాస్ యుటిలిటీ రంగంలోకి ప్రవేశించాలన్న ఆసక్తిని ఐవోసీ, బీపీసీఎల్‌లు కనబరిచాయి. కానీ ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదని ప్రధాన్ తాజా సమాధానం ద్వారా తెలుస్తున్నది. 2017-18 బడ్జెట్‌లో అప్పటి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ.. ప్రభుత్వ రంగ చమురు దిగ్గజ సంస్థలను ఏకీకృతం, విలీనం, కొనుగోళ్ల ద్వారా ఒక్కటి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికను ఆవిష్కరించారు. దీని ద్వారా సమస్యలను సులువు పరిష్కరించుకోగలవని, ఆర్థికంగా బలపడగలవని, భారీ పెట్టుబడుల దిశగా వెళ్లగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాగా, హెచ్‌పీసీఎల్‌లో 51.11 శాతం వాటాను ఓఎన్జీసీ పొందిందని, ఈ లావాదేవీ తర్వాత ఓఎన్జీసీ, హెచ్‌పీసీఎల్‌లు కేంద్ర ప్రభుత్వ సంస్థలుగానే కొనసాగుతున్నాయని ప్రధాన్ సోమవారం లోక్‌సభలో తెలియజేశారు. గెయిల్‌లో కేంద్రానికి 54.89 శాతం వాటా ఉన్నది.

# పురపోరుకు 15న నగారా?

**నెలాఖరులోగా ఎన్నికలు 14లోగా ఓటరు జాబితా, వార్డుల విభజన**

- మున్సిపాలిటీల్లో వ్యయపరిమితి రెండు లక్షలకు.. కార్పొరేషన్లలో మూడు లక్షలకు పెంపు!
- రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం వెల్లడి
- పాత పోలింగ్ కేంద్రాలన్నీ వినియోగిస్తాం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి



రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో రాజకీయ నాయకులతో సోమవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఈ నెలాఖరులోగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేసి.. 15 రోజుల్లోగా ప్రక్రియను పూర్తిచేయనున్నట్టు పేర్కొన్నది. ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార వ్యయపరిమితిని మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో రెట్టింపు చేయనున్నట్టు తెలిపింది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయపక్షాలతో సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కమిషనర్ నాగిరెడ్డి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోసం తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ఖరారు, షెడ్యూల్ విడుదల, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై రాజకీయపార్టీలకు స్పష్టత ఇచ్చినట్టు సమాచారం. సమావేశానికి హాజరైన ఆయా రాజకీయపార్టీల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల షెడ్యూల్‌ను విడుదలచేసిన 15 రోజుల వ్యవధిలో మున్సిపాలిటీ పోలింగ్ నిర్వహిస్తామని ఎస్ఈసీ పేర్కొన్నది. ప్రస్తుతం వార్డులవారీగా ఓటరు జాబితా ముసాయిదా సిద్ధమవుతున్నదని, దానిని ఈ నెల 10న విడుదల చేస్తామని తెలిపింది. 129 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో 60 లక్షల మంది ఓటర్లున్నట్టు అంచనా వేస్తున్నామని వివరించింది. వార్డులవారీగా ఓటరు జాబితా విడుదల చేస్తామని, మున్సిపల్ కమిషనర్లు ఈ నెల 12 వరకు ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తారని ఎస్ఈసీ కమిషనర్ నాగిరెడ్డి వెల్లడించారు. ఈ నెల 14 వరకు తుదిఓటరు జాబితాను విడుదల చేస్తామని, వార్డుల వారీగా రిజర్వేషన్లను కూడా అదేరోజు ఖరారు చేస్తామని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల ఓటరు జాబితా తయారుచేస్తున్నామని.. ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించి ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. వచ్చే కొత్తఓట్లను అనుబంధ జాబితా కింద విడుదల చేస్తామని, బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టంచేశారు. ప్రతి వార్డులో ఎంతమంది ఓటర్లున్నారో తెలిశాకే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామని, ఈ నెల 19 వరకు పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఈ నెల 12న పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల చేస్తామని, ఒక్కోపోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లుంటారని తెలిపారు. ఈ నెల 13న మున్సిపాలిటీల వారీగా కమిషనర్, జిల్లాల్లో కలెక్టర్ రాజకీయపక్షాలతో సమావేశం నిర్వహిస్తారని ప్రకటించారు.

**పదిహేను రోజుల్లో పోలింగ్!**

ఈ నెల 14 వరకు రిజర్వేషన్లను ఖరారుచేస్తారని, ఈ జాబితాను అందించగానే 15వ తేదీన షెడ్యూల్ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఈసీ పేర్కొన్నది. ఈ నెల చివరి వరకు ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నది. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు పార్టీల గుర్తులు కేటాయిస్తామని, ఇతర పార్టీలవారు కామన్ గుర్తులు కావాలంటే కొన్ని నిబంధనలున్నాయని ఎన్నికల సంఘం పేర్కొంది.

**వ్యయ పరిమితి పెంపు**

రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారవ్యయాన్ని రెట్టింపు చేసింది. మున్సిపాలిటీల్లో ఒక్కోవార్డుకు ఇప్పటి వరకు రూ. లక్ష ఉండగా ఈ ఎన్నికల్లో రూ.2 లక్షలకు.. కార్పొరేషన్ పరిధిలో రూ.1.5 లక్షలు ఉండగా రూ.3 లక్షలకు పెంచుతారు. అయితే దీన్ని ఇంకా ఖరారు చేయలేదని ఎస్ఈసీ వివరించింది. కాగా, మున్సిపల్ ఎన్నికలకు ఇప్పుడేం తొందరవచ్చిందంటూ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సమావేశంలో ఎస్ఈసీని ప్రశ్నించారని సమాచారం. టీఆర్ఎస్, ఎంఐఎంతోపాటు, ఇతర పార్టీలు కూడా ఎన్నికలు నిర్వహించాలంటూ స్పష్టంగా చెప్పినట్టు తెలిసింది.

**పోలింగ్ ఆఫీసర్ల నియామకం**

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 129 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. డివిజన్, జిల్లాస్థాయి అధికారులను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. ప్రతి మూడువార్డులకు ఒక ఆర్వోను, ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని నియమిస్తూ ఆదేశాలిచ్చారు. రిటర్నింగ్ అధికారుల నియామక ఉత్తర్వులను రాష్ట్ర ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

## నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు: గట్టు రాంచందర్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న టీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు, పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్‌ను ఈ నెలాఖరులోగా నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం చెప్పిందని టీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు తెలిపారు. ఎస్ఈసీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గతంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసిన పార్టీలే.. ఎన్నికలకు ఇప్పుడేం తొందరని సోమవారం నాటి సమావేశంలో ప్రశ్నించాయని తెలిపారు. ఎన్నికల కోసం షెడ్యూల్ ప్రకటించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో కొన్నిపార్టీలు గడువు కోరడం విడ్డూరంగా ఉన్నదన్నారు. మున్సిపల్ ఎన్నికలను టీఆర్ఎస్ ఆహ్వానిస్తున్నదని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విజయం తమదేనని స్పష్టంచేశారు. ఎన్నికల ప్రచార ఖర్చు పరిమితిని స్పష్టంచేయాలని, ఖర్చుపెట్టే విధానాన్ని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను వార్డులకు మధ్యలో ఏర్పాటుచేసి ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరామని రాంచందర్‌రావు తెలిపారు.



## ముసురుకున్న మబ్బులు

సోమవారం మధ్యాహ్నం హన్మకొండను మబ్బులు కమ్మేశాయి. ఆకాశమంతా మేఘాలు పరుచుకున్నాయి. సాయంత్రానికి చిరుజల్లులతో నేలతల్లిని పులకింపజేశాయి.

# సహకార వ్యవస్థ చాలా గొప్పది

- నైపుణ్యాన్ని పెంచుకోవాలి
- ఐసీఎం 67వ బ్యాచ్ హెచ్‌డీసీఎం అభ్యర్థులకు సర్టిఫికెట్ల పంపిణీలో అసెంబ్లీ స్పీకర్ పోచారం




సోమవారం ఐసీఎంలో సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాల్ని పెంచుకునేందుకు శిక్షణ ఎంతో అవసరమని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన రాజేంద్రనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజిమెంట్ (ఐసీఎం)లో 67వ బ్యాచ్ హయ్యర్ డిప్లొమా ఇన్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (హెచ్‌డీసీఎం) అభ్యర్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సహకార ఉద్యమం చాలా గొప్పదని, 1977లో తన రాజకీయ జీవితం సహకార సొసైటీ అధ్యక్షుడిగానే ప్రారంభమైందని తెలిపారు. చిత్తశుద్ధితో పనిచేస్తే మంచిపేరు వస్తుందన్నారు. ఐసీఎం డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎస్కే తంగబాల, కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, ముద్ర కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రామదాసప్పనాయుడు పాల్గొన్నారు.










నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 9 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



# పరుగుల సారథులు.. మహిళాశక్తికి వారధులు!

నాలుగు పదుల వయసు వచ్చేవరకూ ఇంటి పట్టున ఉండి ఎన్నో చేశారు. మహిళగా వారి చుట్టూ ఉండే బాధ్యతలు అన్నీ నిర్వహించారు. 40 యేండ్లు గిర్రున తిరిగాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే ఏదో వెలితి. ఆ సమయంలో వారొక నిర్ణయానికి వచ్చేశారు. గడప దాటి అడుగు బయటకు వేశారు. ఆ అడుగులే పరుగునందుకున్నాయి. ఆరుగురు కలిసి చేసిన మారథాన్. ఇప్పుడు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి పెట్టింది. అంతర్జాతీయ స్థాయిలో అడుగు పెట్టబోయే ఆ ఆరుగురి లక్ష్యం ఒకటే. పరుగు అందుకోవడానికి వయసుతో పని లేదు. పతకాల పంట సాధించేందుకు పోరాడతామంటున్నారు. ఆ పరుగుల రాణుల గురించే ఈ ప్రత్యేకమైన స్టోరీ..

**బబిత,** కృతి, సుమ, రాచెల్ ఛటార్జీ, ఇందు, దివ్యారెడ్డి ఈ ఆరుగురు ఒక బృందం. కలిసి కట్టుగా రాష్ట్ర, జాతీయ అథ్లెటిక్స్‌లో పాల్గొని విజయం సాధిస్తున్న పరుగుల రాణులు. పుట్టింది వేరు వేరు ప్రాంతాలు. కానీ అందరూ పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. కానీ అందరినీ కలిపింది మాత్రం 'పరుగు'. వేర్వేరు వృత్తుల్లో వారికి నలభై యేండ్లు పూర్తయ్యాయి. 'ఈ నలభై ఏండ్లలో ఒక మహిళగా తన కోసం తాను ఏం చేసుకున్నా' అనే ప్రశ్న వాళ్లను వేధించింది. దానికి సమాధానం కూడా వాళ్లే వెతుక్కున్నారు. పరుగు ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరి మధ్య పరిచయం ఏర్పడింది. కలిసి వేసిన అడుగులు అన్నీ.. జాతీయ స్థాయి పోటీలకు తీసుకెళ్లాయి. ఇటీవల గోవాలో జరిగిన మహిళల మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటి సాధించాలనే స్ఫూర్తికి వయసుకు సంబంధం లేదని నిరూపించారు. 17 రాష్ట్రాల నుంచి 700 మంది మహిళా అథ్లెట్లు పాల్గొన్న ఈ పోటీలో తెలంగాణ నుంచి ఈ ఆరుగురు మహిళలు ప్రతిభ కనబరిచారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరుగబోయే ఆసియన్ మాస్టర్స్ మీట్‌కు ఈ ఆరుగురు వనితలు సిద్ధమవుతున్నారు. వారి ప్రయాణం ఎలా మొదలైందన్న విషయాలు మనతో పంచుకున్నారు.

### ఆత్మవిశ్వాసంతోనే అంతా..

మొదట మారథాన్‌లలో పాల్గొన్న అనుభవంతో మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. అక్కడే అందరి మధ్య పరిచయం ఏర్పడింది. తర్వాత జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడానికి ప్రణాళిక వేసుకున్నారు. కానీ ముఖ్యంగా వీళ్లకు వయసు, కుటుంబం, వృత్తి, ఉద్యోగ బాధ్యతలు చుట్టుముట్టాయి. అయినా ఈ సవాళ్లను ఎదిరించారు. కుటుంబం, వృత్తి, శిక్షణ వీటికి ప్రత్యేకమైన సమయం కేటాయించారు. శిక్షణకూ అదనపు సమయాన్ని కేటాయించారు. ఉదయం మూడు గంటలకు మేల్కొని సాధన చేయడం, తర్వాత ఇంటి పనులు పూర్తి చేయడం అటు తర్వాత ఉద్యోగానికి హాజరవడం వీళ్ల దినచర్యలో భాగం. ఈ క్రమంలో గాయాలైనా, ఇబ్బందులు ఎదురైనా వాటిని ఓర్చుకున్నారు.ఇది కేవలం వీళ్ల కోసమే కాదు వీళ్ల లాంటి మహిళల కోసం కూడా అని చెబుతున్నారు. వయసు పెరిగే కొద్దీ సమస్యలు పెరుగుతాయని చాలామంది అనుకుంటారు. కానీ మనోధైర్యం, ఆత్మవిశ్వాం ఉంటే ఏదైనా చేయగలమని అంటున్నారు. నలభై యేండ్ల వయస్సులో ఎలా సాధ్యం అవుతున్నది అని వీళ్లలో ఎవరిని అడిగినా చెప్పేది ఒక్కటే ' వయసు అనేది ఒక సంఖ్య మాత్రమే' అని!

...వినోద్ మామిడాల



### నూతన ఉత్తేజంతో..

జాక్వెలిన్ బబితా జావియర్ పుట్టింది చెన్నయ్. పెరిగింది మాత్రం హైదరాబాద్ లోనే. ఫిట్‌నెస్ ట్రెయినర్‌గా పని చేస్తున్నది. ఎప్పుడైనా ఖాళీ దొరికినప్పుడు చిన్న చిన్న పరుగుల కార్యక్రమాల్లో పాల్గొనేది. కొద్ది రోజుల క్రితం మొదటి సారి ఓ మారథాన్‌లో పాల్గొనింది. దానిలో పాల్గొన్న తర్వాత ఆమె అనుభూతి ఆమెకే ఆశ్చర్యమేసింది. మారథాన్ నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందాయి. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టే సరికి ఫ్రెండ్స్ నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అది తనకు నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. అలాంటి మారథాన్‌లలో ఇంకా పాల్గొనాలనే ఆసక్తిని పెంచింది. అప్పుడే ఈమెకు రాచెల్ ఛటార్జీ పరిచయం అయ్యారు. ఇద్దరూ కలిసి ఎన్నో మారథాన్‌లలో పాల్గొన్నారు. అదే అనుభవంతో మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొనడానికి వెళ్లారు. అక్కడ 800 మీటర్ల పోటీలో రజత పతకం సాధించారు. గతంలోనూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు.

### ఫిట్‌నెస్ మారథాన్..



కృతి హైదరాబాద్‌లో వ్యాపార నిర్వాహకురాలు. ఈ మధ్యే తనకు ఫిట్‌నెస్ మారథాన్ పై ఆసక్తి కలిగింది. ఓ కోచ్ దగ్గర చేరి శిక్షణ తీసుకుంది. కేవలం రెండు వారాల్లోనే ప్రత్యేకమైన శిక్షణ తీసుకొని మాస్టర్స్‌కు సిద్ధమైంది. ఇంట్లో క్షణం తీరిక లేని పరిస్థితుల్లో కూడా ఆమె శిక్షణ తీసుకుంది. మాస్టర్స్‌లో పాల్గొనాలనే లక్ష్యంతోనే ఈమె ముందడుగు వేసి ఈ బృందంలో ఓ సభ్యురాలైంది. ఇది తనకు మరింత ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. టీమ్ మధ్య ఉన్న స్ఫూర్తి తనకు మరింత ధైర్యాన్ని పెంచినట్టు చెప్తున్నది. క్రమశిక్షణతో కష్టపడితే ఏదైనా సాధించగలమనే నమ్మకం ఏర్పడిందని అంటున్నది. దీనికి వయసుతో సంబంధం లేదు. అందరు మహిళల్లో అమితమైన శక్తి ఉందని అంటున్నది కృతి.



### డాక్టర్ నుంచి రన్నర్‌గా..

సుమ వృత్తి రీత్యా ఆర్థో డెంటల్ సర్జన్. సుమారు 28 ఏండ్ల అనుభవం కలిగి ఉన్నారు. పుట్టింది కర్ణాటకలోని హూబ్లీలో. చిన్నప్పటి నుంచే అథ్లెటిక్స్‌లో పాల్గొనేవారు. యూనివర్సిటీలో ఉన్నప్పుడు ప్రత్యేక శిక్షణ ద్వారా ప్రొఫెషనల్ అథ్లెట్ అయ్యారు. రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. తర్వాత రోజుల్లో సాధారణంగానే కుటుంబ, వృత్తి బాధ్యతలు పెరిగాయి.ఈ కారణంగా అథ్లెటిక్స్‌లో ఈమె పాత్ర తగ్గింది. కానీ 42 ఏండ్ల వయస్సులో ఈమెకు శారీరక ఇబ్బందులు వచ్చాయి. మళ్లీ అథ్లెటిక్స్‌లో పాల్గొనడమే దీనికి పరిష్కారం అనుకుంది. వెంటనే శిక్షణ ప్రారంభించింది. కోచ్ నేతృత్వంలో వారంలో ఐదు సార్లు శిక్షణ కొనసాగించింది. అదే అనుభవంతో గోవాలో జరిగిన ఉమెన్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొన్నది. దీంతో మరింత ఆత్మవిశ్వాసం కలిగిందనీ, ఈ టీమ్ తనలో ఇంకా ధైర్యాన్ని పెంచిందని చెప్తున్నది.

### హిమాలయాల్లో ట్రెక్కింగ్..



హైదరాబాద్‌లో ఇందూహరికూమార్ టీచర్‌గా పని చేస్తున్నది. 50+ వయస్సు. చిన్నప్పటి నుంచి అవుట్ డోర్ స్పోర్ట్స్ అంటే ఇందూకు చాలా ఇష్టం. స్విమ్మింగ్, హైకింగ్, రన్నింగ్ అంటే ఆసక్తి. తరచూ వాటిలో పాల్గొని అనుభవం పొందింది. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శిక్షణ తీసుకుంది. దీంతో పాటు ఇందూ హిమాలయాల్లో ట్రెక్కింగ్ చేసిన అనుభవాన్ని కలిగి ఉంది. గతంలో హిమాలయా బేస్ క్యాంపులో కూడా పాల్గొన్నది. ఈ అనుభవాలతోనే గోవా మీట్‌కు వెళ్లింది. 'అక్కడ పాల్గొన్న మహిళలు, వారి స్ఫూర్తి ఆశ్చర్యమనిపించింది. మాకన్నా ఎక్కువ వయసు ఉన్న వారు కూడా ఆ పోటీలో పాల్గొన్నారు. ఇది నాలో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపింది' అని అంటున్నది ఇందు. శరీరాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అథ్లెటిక్స్ ఎంతో ఉపయోగపడతాయనీ, వయస్సుతో మాత్రం దీనికి సంబంధం లేదని ఆమె చెప్తున్నది.



### విరమణ తర్వాత..

రాచెల్ ఛటర్జీ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్. 65 ఏండ్లు. తమిళనాడుకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నప్పుడు హైదరాబాద్, ఏపీలోని పలు విభాగాల్లో బాధ్యలు నిర్వహించారు. ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పని చేశారు. ప్రస్తుతం ఏపీ రెడ్ క్రాస్‌కు చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఐఏఎస్ నుంచి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అనేక మారథాన్‌లలో పాల్గొనేవారు. ఓ రోజు గోవా ఉమెన్స్ మాస్టర్స్ మీట్ గురించి విని శిక్షణ తీసుకొన్నారు. 1500, 800 మీటర్ల పోటీలో పాల్గొని బంగారు పతకాలను సాధించారు. ' మహిళల్లో చాలా శక్తి ఉంటుంది. దాన్ని ఇంటి వరకే పరిమితం చేయొద్దు. నా ప్రయత్నం నా లాంటి మహిళలకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నాను' అని రాచెల్ ఛటర్జీ అంటున్నారు.



### ప్రత్యేక శిక్షణతో..

మారథాన్ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చింది దివ్యా. గోవా మీట్ గురించి ఎనిమిది నెలల ముందు విన్నది. అందులో ఎలాగైనా పాల్గొనాలని ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంది. ఓ సంస్థలో డైరెక్టర్‌గా పని చేస్తూ తీరిక లేని సమయం గడిపేది. అయినా ఈ పోటీల కోసం ప్రత్యేకమైన సమయాన్ని కేటాయించి, శిక్షణ తీసుకుంది. బంధువులు వద్దన్నా సమస్యలు ఎన్ని ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగింది 1500 మీటర్ల పోటీలో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించింది. 400, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు అందుకుంది.

---

# స్నేహ బంధం!

**చిన్నప్పటి నుంచి చనిపోయేవరకు వెన్నంటి తోడుండే ఒకే ఒక బంధం ఫ్రెండ్‌షిప్. అందుకేనేమో ఈ ఏడుగురు మహిళలు తమ రిటైర్‌మెంట్ తర్వాత ఒకే చోట కలిసి జీవించడానికి ఒక అందమైన ఇల్లు కొనుగోలు చేశారు. దాని ఖరీదెంతో తెలుసా?**



చైనాకు చెందిన వీరంతా చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. కలిసే చదువుకున్నారు. అయితే కుటుంబం పరిస్థితులు, ఇతర కారణాలతో వీరు కలిసి జీవించలేకపోయారు. అంతా విడివిడిగానే ఉన్నా.. ఈ ఏడుగురి మనుసులోనూ ఎప్పుడూ కలిసుండాలనే ఆలోచనే ఉండేది. కనీసం రిటైర్‌మెంట్ తర్వాత అయినా కలిసుండాలని వాగ్దానం చేసుకున్నారు. ఇందుకు అనువుగా ప్రశాంతమైన జీవితం గడిపేందుకు చక్కని వాతావరణం ఉన్న ఇంట్లో ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ ఏడుగురు మహిళలు ఒకే ఒక షరతు విధించుకున్నారు. అదేంటంటే.. వీరంతా ఇంటికి వచ్చేముందు అన్ని విషయాలు కుటుంబ సభ్యులతో చర్చించుకోవాలి, అన్ని సమస్యలు పరిష్కరించుకొని రావాలి. ముందుగా అనుకున్నట్లుగా అందరితోనూ మాట్లాడి, అన్ని సమస్యలు పరిష్కరించుకొని ఈ అందమైన ఇంటిని నిర్మించుకున్నారు. దీని పేరు రెడ్‌బ్రిక్ హౌస్. ఇది అక్షరాలా 4 కోట్ల రూపాయలు. ఈ అందమైన ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో లివింగ్ రూమ్, అందరికీ విడివిడిగా బెడ్‌రూంలు, బాల్కనీ అంతా పచ్చని మొక్కలు, ఇంటి ముందు నడిచేందుకు వీలుగా వెదురుతో కట్టిన బ్రిడ్జ్ ఏర్పాటు చేశారు. ఈ సెట్టింగ్ అంతా చూస్తుంటే అచ్చం సినిమాలో చూసిన అనుభూతి కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. ఏడుగురిలో ఒక్కొక్కరికీ ఒక్కో ప్రత్యేకత ఉన్నది. ఒకరు వంటలో, మరొకరు గార్డెనింగ్, ట్రెడిషనల్ చైనీస్ మెడిసిన్ తయారు చేయడంలో, మరొకరు సంగీతంలో నిపుణులు. మంచుకురిసే వేళలో, పచ్చని పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ.. వృద్ధాప్యాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.





# ఏ బట్టలు మంచివి?

**వర్షాకాలంలో ఎలాంటి దుస్తులు ధరించాలి? ఎలాంటి షూలు వేసుకోవాలి? అనే విషయంలో చాలా మందికి అనుమానాలు ఉంటాయి. కొందరైతే కాలంతో సంబంధం లేకుండా దుస్తులు వేసుకుంటారు. అయితే వర్షాకాలంలో దుస్తుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటంటే..**

- యువతులు కాటన్, సింథటిక్ ఫ్యాబ్రిక్ వంటి దుస్తులను వాడడం మంచిది. సాయంకాలం సమయంలో ఫ్రాక్స్, అనార్కలీ బాగుంటాయి. స్కిన్ టైట్ లెగ్గిన్స్ కూడా బాగుంటాయి. చీరలు, చుడీదార్లు వేసుకునే వారు శాండిల్స్, షూస్ వంటివి వేసుకుంటే మంచిది.
- హ్యాండ్ బ్యాగులు చిన్నవిగా కాకుండా కాస్త పెద్దగా ఉండేవి వెంట తీసుకెళ్తే మంచిది. అవసరమైతే గొడుగు, రెయిన్ కోటును కూడా అదే బ్యాగులో తీసుకుని వెళ్లవచ్చు. వర్షాకాలంలో ఎక్కువగా మేకప్ వేసుకోకపోవడమే మంచిది.
- ముఖ్యంగా వర్షాకాలంలో ఎప్పుడూ ట్రాన్స్‌రెంట్ బట్టలను వాడకపోవడమే మంచిది. జీన్స్ విషయంలో టైట్ జీన్స్ వాడవద్దు. ఈ సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లో తడిగా ఉన్న బట్టల్ని ధరించవద్దు. అలర్జీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వర్షాకాలంలో స్లిప్పర్స్ వాడడం కంటే షూ వాడడం బెటర్. షూ వాడడం ఇష్టం లేనివారు సైండిల్స్ వేసుకుంటే మంచిది. స్లిప్పర్స్ వాడడం వల్ల బట్టలపై బురద చిల్లుతుంది. అంతే కాకుండా బురదగా ఉన్న ప్రదేశంలో చెప్పులు వేసుకుని నడిస్తే జారిపడే అవకాశం ఉన్నది.

# అప్పటికప్పుడు అందం..



- బొప్పాయి గుజ్జులో కీరదోస రసాన్ని కలుపుకోవాలి. దానికి చెంచా తేనె, చెంచా గంధం పొడి, చెంచా ముల్తానీ మట్టి జతచేసి అవసరాన్ని బట్టి పాలతో మెత్తని పేస్టులా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసుకుంటే చర్మం కాంతివంతంగా తయారవుతుంది.
- దుమ్మూధూళి చర్మంపై పేరుకున్నప్పుడు మృతకణాల సమస్య ఎక్కువవుతుంది. అవి చర్మాన్ని బరకగా, మురికిగా మార్చేస్తాయి. అలాంటప్పుడు అరకప్పు బొప్పాయి గుజ్జులో గుప్పెడు పంచదార కలిపి, దాంతో మృదువుగా చర్మంపై రుద్దితే సరి. మృతకణాలు తొలిగిపోతాయి.
- అరకప్పు బొప్పాయి గుజ్జులో అరచెక్క నిమ్మరసం పిండి, ఈ మిశ్రమాన్ని ముఖానికీ, మెడకీ రాసుకోవాలి. పదినిమిషాలు ఆరాక శుభ్రం చేస్తే చర్మంపై ఉన్న మురికి తొలిగిపోతుంది. క్రమం తప్పకుండా నెల రోజులు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- పార్టీలకు, ఫంక్షన్లకు వెళ్లే వారు అప్పటికప్పుడు ముఖకాంతిని కోరుకుంటారు. అలాంటి వారు పెద్ద చెంచా తేనెలో కొద్దిగా దాల్చిన చెక్క పొడిని కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి పావుగంట తర్వాత కడిగేయాలి.
- మృత కణాలు తొలిగి పోవాలన్నా, చర్మం కాంతివంతంగా తయారవ్వాలన్నా నిమ్మ, తులసి ఆకుల రసం సమపాళ్లలో కలిపి రోజూ రెండుసార్లు ముఖానికి పట్టించాలి. క్రమం తప్పకుండా రెండు వారాల పాటు ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

# 80 రైళ్ల బాధ్యతలు!

**పురుషులు మాత్రమే చేయగలరనుకునే రైలు నిర్వహణ, ప్రయాణికుల భద్రత బాధ్యతను ఒక మహిళా బృందం నిర్వహిస్తున్నది. రెండేండ్ల నుంచి ఎలాంటి సమస్యలు లేకుండా.. అవాంతరాలు ఎదురవ్వకుండా ఈ బృందాన్ని నడిపిస్తున్నది కూడా ఓ మహిళే.**

అసాధారణ ఉద్యోగాల్లో కూడా మహిళా ప్రాతినిధ్యం పెరుగుతున్నది. ఎలాంటి కష్టతరమైన పనైనా మహిళలు చాలా సులువుగానే చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణ 'ఆల్ ఉమెన్ టీం'. కేరళలోని తిరువనంతపురానికి చెందిన ఈ మహిళా బృందం రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల భద్రతను చూస్తున్నది. వీరు ప్రతిరోజూ 80 రైళ్లకు సంబంధించిన కోచ్‌ల బాధ్యతలను చూసుకోవాలి. ఎలాంటి యాంత్రిక, సాంకేతిక సమస్య తలెత్తకుండా చూడాలి. వీరు రెండేండ్ల నుంచి ఈ పనులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ బృందానికి ఇన్‌చార్జ్‌గా క్రిష్‌నెండు కేవీ వ్యవహరిస్తున్నది. మొదట్లో రైళ్ల నిర్వహణకు సంబంధించిన పనులంటే చాలా భయపడేది. అయితే రైలు మెకానికల్ పనులకు సంబంధించి ప్రత్యేక శిక్షణ తీసుకున్న తర్వాత.. ఎంతో కష్టతరమైన తన పనిని సులువుగా పూర్తి చేస్తున్నది. అప్పటి నుంచి షిఫ్టుల వారీగా తన బృందాన్ని నడిపిస్తూ.. రైళ్లు సమయానికి స్టేషన్‌కు చేరుకునేలా తన బాధ్యతలు నిర్వహిస్తున్నది క్రిష్‌నెండు. రైలు పట్టాలు చెక్ చెయ్యడం దగ్గర్నుంచి, బోగీల్లో మెకానికల్ వర్క్, బోగీల బాధ్యతలు, పరిశుభ్రత, ప్రయాణికుల భద్రత వంటివి వీరు చెయ్యాల్సిన పనులు. క్రిష్‌నెండు ఆల్-ఉమెన్ టీం సేవలను అందరూ ప్రశంసిస్తున్నారు.



II.
నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 9 జూలై 2019

# నాలుగు తరాల నవ వైద్యుడు!

## THE 4G DENTIST



‘పళ్లూడగొడతా’.. అని ఎవరైనా అంటే ఏమనిపిస్తుంది?
లేచి.. ఒక్కటి లాగి వారి పళ్లే ఊడగొట్టాలనిపిస్తుంది.
అంటే.. పళ్లు ఊడగొడితే ఖేల్ ఖతం అన్నట్టేగా?
ఒక వ్యక్తికి పళ్లు లేకపోతే ఏమీ చేయలేడనేది నిజమే అయుండొచ్చు!
ఇది ఎలా ఉన్నా.. ఇక్కడ రెండు విషయాలు అర్థం చేసుకోవాలి.
ఒకటి పళ్లు మనిషికి చాలా ముఖ్యమైనవి.
రెండు పళ్లను చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలి.
ఈ రెండూ ఏ మాత్రం పక్కదారి పడితే
ఏం చేస్తాం? 50 ఏండ్ల సీనియారిటీ
పళ్ల డాక్టర్ ఎంఎస్ గౌడ్‌తో మొరపెట్టుకోవాల్సిందే!



**ఏంటీ?** 50 ఏండ్ల సీనియారిటీనా? అని ఆశ్చర్య పోవాల్సిందే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మైక్రోస్కోప్ పెట్టి వెతికినా సర్వీస్‌లోనే యాభైయేండ్లు పూర్తిచేసుకున్న డెంటిస్ట్ లేరంటే అర్థం చేసుకోవచ్చు.. డాక్టర్ గౌడ్ సీనియారిటీ ఏంటో? ఇదొక రికార్డు కూడా. డాక్టర్ ఎంఎస్‌గౌడ్ స్థాపించిన ‘గౌడ్స్ డెంటల్’కు మొత్తం ఏడు కేంద్రాలు ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లో మెయిన్ బ్రాంచ్. ఒక వైద్యుడు ఎంతమందికి చికిత్స చేస్తాడు? పోని ఎన్ని తరాలకు చూస్తాడు? సంవత్సరాలకే దిక్కు లేదు.. ఇక తరాలా? అనిపిస్తుంది కదా? కానీ డాక్టర్ ఎంఎస్ గౌడ్ డెంటిస్ట్‌గా నాలుగు తరాలకు వైద్య సేవలు అందించి 4జీ డెంటిస్ట్‌గా పేరు సంపాదించారు.

### నాలుగు తరాలకు సేవలు

డాక్టర్‌కు నైపుణ్యం మాత్రమే కాదు.. అంతకంటే గొప్ప అనుభవం కూడా ఉండాలి. డాక్టర్ ఎంఎస్ గౌడ్‌కు నైపుణ్యంతో పాటు వృత్తిలో 50 ఏండ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. అంతకు రెట్టింపు ఓపిక.. యువ వైద్యులను మించిన ఉత్సాహం అతనిలో ఇప్పటికీ ఉన్నాయి. అందుకే ఆయన అంతర్జాతీయ వ్యాప్తంగా గుర్తింపు సాధించారు. ‘76 ఏండ్ల వయసులో ఇంత ఓపికగా ఎలా పనిచేయగలుగుతున్నారు?’ అని అడిగితే.. ‘నా వయసు 76 కావచ్చు. కానీ నాకు ప్రతీ రోజు తొలిరోజుగానే అనిపిస్తుంది. 50 ఏండ్ల సీనియారిటీ ఉండొచ్చు. కానీ ప్రతీ కేసును ఓ నూతన వైద్యుడిలాగే అధ్యయనం చేయాల్సి ఉంటుంది. నా ఇన్నేండ్ల సర్వీస్‌లో లక్షలాది మందికి ట్రీట్‌మెంట్ చేసి ఉంటాను. ఎవరిని ఎలా డీల్ చేయాలో.. ఏ పేషెంట్ సైకాలజీ ఎలా ఉంటుందో అర్థం చేసుకోగలను. నేను నాలుగు తరాలకు ట్రీట్‌మెంట్ చేశాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా’ అన్నారు.

### వృత్తి కాదు సేవ

డెంటిస్ట్‌గా నేను కేవలం వృత్తి బాధ్యతలు మాత్రమే చేయడం లేదు. దీనినొక సేవా కార్యక్రమంగా భావిస్తున్నా. వృత్తిగానే భావించి ఉంటే ఎప్పుడో వదిలేసేవాడిని. నాలుగు తరాలకు సేవ చేసే అవకాశం ఎవరికీ రాదు. నాకొచ్చింది. ఏమో చెప్పలేం. పరిస్థితులు అనుకూలిస్తే ఐదో తరానికి కూడా సేవ చేయొచ్చు. నా గురించి తెలుసుకునే చాలామంది విదేశాల నుంచి సైతం వస్తున్నారు. కాబట్టి డెంటిస్ట్‌గా కొనసాగుతూనే ఉంటాను.
–డాక్టర్ ఎంఎస్ గౌడ్



### చిరునవ్వే ఔషధం

నొప్పితో వెళ్లినప్పుడు హాస్పిటల్ ఒక ఇల్లులా.. డాక్టర్ ఒక ఇంటి సభ్యుడిలా కనిపిస్తే ఆ నొప్పి ఆటోమేటిగ్గా తగ్గిపోతుంది. కానీ ఇలాంటి అవకాశాలు ఎక్కడున్నాయి? హాస్పిటల్స్ అంటేనే పిండి పిప్పిచేసి ఫీజు వసూలు చేసేవనే అభిప్రాయం మనలో స్థిరంగా ఉంది. కానీ ఒక్కసారి ‘గౌడ్స్ డెంటల్’కి వెళ్తే మాత్రం ఆ ఆలోచన పూర్తిగా మారిపోతుంది. ఇది హాస్పిటల్ అంటే ఎవరూ నమ్మరు. అచ్చం ఇల్లులాగే ఉంటుంది. చెట్లు.. మొక్కలు.. స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ లోపలికి వెళ్లగానే ఇంట్లో కలియతిరిగినట్లు జనాలు కనిపిస్తూ ఏదో కొత్త ప్రపంచంలోకి పోయిన అనుభూతి కలుగుతుంది. ఇక డాక్టర్ ఎంఎస్ గౌడ్‌తో మాట్లాడితే సగం సమస్య ట్రీట్‌మెంట్‌కు ముందే పరిష్కారం అవుతుంది. ఆయన చిరునవ్వే మనకు ఔషధంగా పనిచేస్తుంది.

### చిన్నప్పటి కల

డాక్టర్ ఎంఎస్ గౌడ్ పూర్తిపేరు మంగా శివలింగం గౌడ్. స్వస్థలం మెదక్. ‘పెద్దయ్యాక ఏమవుతావ్?’ అని కామన్‌గా పేరెంట్సో.. టీచర్సో అడుగుతుంటారు పిల్లల్ని. ‘నేను కలెక్టరవుతా’.. ‘నేను టీచరవుతా’.. ‘నేను లాయరవుతా’.. ‘నేను డాక్టరవుతా’.. ‘నేను యాక్టరవుతా’.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమాధానం చెప్తుంటారు. ఆ సమయంలో స్నేహితులు చెప్పినదాన్ని బట్టి.. అడిగిన సందర్భాన్ని బట్టి పిల్లలు ఇలా చెప్తుంటారు. తర్వాత పరిస్థితులు వేరుగా ఉంటాయి. కానీ.. ఎంస్ గౌడ్ చిన్నప్పుడు ఏమవుదామని అనుకున్నారో అదే అయ్యి చూపించారు.

### నిరుత్సాహ పరిచినా..

మెదక్‌లోని ఓ సన్నకారు రైతు వెంకటయ్య. ఆయన కష్టంలో చేదోడు వాదోడుగా నిలుస్తుండేది వెంకటయ్య భార్య లక్ష్మీ నర్సమ్మ. వీళ్ల కొడుకు శివలింగం. ముద్దుగా ఎంఎస్ అంటుండేవారు స్నేహితులు. చదువు విలువేంటో తెలిసినవాళ్లుగా బాగా ప్రోత్సహించారు. ‘పెద్దయ్యాక డాక్టర్ అవ్వు బిడ్డా’ అంటూ చిన్నప్పుడే లక్ష్యం దారిని పరిచయం చేశారు. శివలింగం కూడా డాక్టర్ వృత్తి అంటే చాలా ఇష్టం. ఇంటర్ తర్వాత ఎంబీబీఎస్ రాసినా సీటు రాలేదు. బీడీఎస్‌లో మాత్రం వచ్చింది. కానీ ‘బీడీఎస్ అంటే పళ్లు ఊడగొట్టే కొలువా’ అని చాలామంది తక్కువచేసి మాట్లాడేవాళ్లట. ఎవరెంత ఎగతాళి చేసినా బీడీఎస్‌లో చేరాడు. హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఓ చిన్న గదిలో ఉంటూ బీడీఎస్ చదువుకున్నాడు. ‘పంటి వైద్యం కోసం మూడేళ్లు చదవాలా?’ అని కొందరు నిరుత్సాహ పరిచేవారట. ఆయన అవేవీ లెక్క చేయలేదు. చక్కగా చదువుకొని మహారాష్ట్రలో ఎండీఎస్ సీటు సంపాదించాడు. అలా 1971లో బొంబాయ్ విశ్వవిద్యాలం నుంచి ఎండీఎస్ పూర్తిచేశాడు.

### ఆధునికతకు ఆద్యుడు

కాస్మొటిక్ డెంటిస్ట్, లేజర్ ట్రీట్‌మెంట్, డెంటల్ ఇంప్లాంట్ వంటి అత్యాధునిక చికిత్సా విధానాలను తెలంగాణ, ఏపీల్లో ప్రవేశపెట్టింది ఎంఎస్‌గౌడ్. పళ్లలో సున్నితత్వాన్ని, చిగుళ్ల నుంచి రక్తం కారడాన్ని, శ్వాసలో దుర్వాసన వంటి అనేక సమస్యలకు రూట్ కెనాల్ చికిత్సలో లేజర్ ట్రీట్మెంట్ ద్వారా పరిష్కారం చూపించే పద్ధతలను మన దగ్గర తొలిసారిగా ప్రవేశపెట్టారు. రంగుమారిన పళ్లు, దంతాల మధ్య సందులు బాగు చెయ్యడానికి గతంలో చాలా ప్రయత్నాలు జరిగేవి. ఒక్కోసారి ఇవి విఫలం అయ్యేవి. అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ కంప్యూటర్ ఎయిడెడ్ డిజైనింగ్, కంప్యూటర్ ఎయిడెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రక్రియలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత కూడా గౌడ్ డెంటల్‌దే.

### గౌడ్స్ డెంటల్ స్థాపన

ఆర్థిక స్థోమత పెద్దగా లేకపోయినా తండ్రి ప్రోత్సాహంతో ఎండీఎస్ చేసినా సరైన ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. ‘వద్దంటే విన్నావా? పెద్ద పెద్ద పోకడలు నీకు అవసరమా?’ అని అనేవాళ్లు అన్నారట. దీంతో మణిపాల్ డెంటల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ఏదో అవసరానికి డబ్బులు వస్తున్నాయి కానీ.. తన తల్లిదండ్రులు కలలు గన్నది.. తాను అనుకున్నది.. చదివింది ఇది కాదని మళ్లీ ఆలోచనలో పడ్డారు. ధైర్యంచేసి తిరిగి హైదరాబాద్ వచ్చేశారు. సుల్తాన్ బజార్‌లో ‘గౌడ్స్ డెంటల్’ ఏర్పాటుచేసి తనకు తానే ఒక పరీక్ష పెట్టుకున్నాడు. ఈ పరీక్షలో నెగ్గితే ఇక వెను తిరగకూడదు. అలా కాకుండా ఓడితే మాత్రం మళ్లీ ఈ వృత్తిలో కనిపించను అని గట్టి నిబంధన పెట్టుకొని క్లినిక్‌ను నడిపించారు.

### ఏ అవకాశాన్నీ వదల్లేదు

పంటి కోసం ప్రత్యేకంగా చికిత్స చేయించుకోవాలా? అనే అవగాహన ప్రజల్లో అప్పుడు లేదు. ప్రత్యేకంగా దానికోసం క్లినిక్.. డాక్టర్ ఉంటారనే విషయాలు కూడా జనాలకు తెలియవు. ఒకరకంగా చెప్పాలంటే ఆర్‌ఎంపీ డాక్టర్లకు ఉన్న గుర్తింపు కూడా డెంటిస్ట్‌లకు లేదు. ఈ పరిస్థితిని రుచి చూశాడు ఎంస్‌గౌడ్. తెలిసిన ఎంబీబీఎస్‌లు ఎవరైనా రిఫర్ చేస్తే వచ్చిన పేషెంట్ల మీదనే ఆధారపడి క్లినిక్ నడిచేది. అయితే తనకు వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డెంటిస్ట్ పనేంటో నిరూపించాడతను. మంచి నమ్మకాన్ని ఏర్పరచుకున్నాడు. అంచలంచెలుగా ఎదిగి ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాడు. తర్వాత హైదరాబాద్ గవర్నమెంట్ డెంటల్ కాలేజీలో 23 సంవత్సరాల పాటు ప్రొఫెసర్‌గా సేవలు అందించారు.

### ఫౌండేషన్ ఏర్పాటు

డెంటిస్ట్‌గా ఎంత ఎదిగినా మూలాలు మాత్రం మరిచిపోలేదు ఎంఎస్. తాను పుట్టిన మెదక్‌లో విద్య, ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ఉచిత శిబిరాలు ఏర్పాటుచేస్తూ సేవచేస్తున్నారు. గౌడ్స్ డెంటల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఒక్క తన ఊరిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా క్యాంపులు పెట్టి లక్షలాది మందికి సాయం అందిస్తున్నారు. దీంట్లో భాగంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం బాకారం జాగీర్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన కోసం నిత్యం కృషి చేస్తున్నారు. 2016లో బాకారం జాగీర్ గ్రామానికి సాక్షర భారత్ అవార్డు కూడా లభించింది. ఇక వృత్తిపరంగానూ ఆయనకు అనేక పురస్కారాలు లభించాయి. ‘గౌడ్స్ డెంటల్’కు తెలంగాణ బెస్ట్ డెంటల్ అవార్డు, 2013లో అంతర్జాతీయ బయోగ్రాఫికల్ సెంటర్ కేంబ్రిడ్జి ప్రపంచంలోని 100 మంది అత్యున్నత వైద్య నిపుణులను ఎంపిక చేయగా.. ఇండియా నుంచి డాక్టర్ ఎంఎస్ గౌడ్‌కు మాత్రమే స్థానం లభించింది.

### డెంటిస్ట్ ఫ్యామిలీ

ఎంఎస్ గౌడ్ ఫ్యామిలీని చూస్తే చాలా గమ్మత్తుగా అనిపిస్తుంది. ఎందుకంటే ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, కోడలు కూడా డెంటిస్టులే. ఒక కుటుంబం నుంచి ఇంత మంది ఒకే వృత్తి.. ఒకే విభాగం అంటే ఎవరికైనా కొత్తగానే అనిపిస్తుంది. వీళ్లింట్లో జరిగే ప్రతీ సంభాషణ కూడా గమ్మత్తుగానే ఉంటుందట. ప్రతీ కేసును చాలెంజింగ్ తీసుకోవాలని గౌడ్ తన వాళ్లకు చెప్తుంటారు. ఎంఎస్ గౌడ్ గత ఇరవై ఐదేండ్ల నుంచి గవర్నర్ గౌరవ దంత వైద్యుడిగా అధికారికంగా కొనసాగుతున్నారు.

### డెంటల్ రచయిత

డాక్టర్ గౌడ్.. మంచి పంటి డాక్టరే కాదు.. సేవాతత్పరుడు కూడా. వీటితో పాటు మంచి రచయిత కూడా. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన రచనలపై చిన్నప్పటి నుంచే ఆసక్తి కనబర్చేవారు. ఇప్పటికీ చాలామందికి పంటి డాక్టర్ పట్ల అవగాహన లేకపోవడం.. అసలు డెంటిస్ట్ అనే ఒక డాక్టర్ కూడా అవసరమా? అనే విషయాలు తెలియకపోవడం.. పళ్లు ఒక వ్యక్తికి ఎంత ఉపయోగమో అర్థం కాకపోవడం ఆలోచనలో పడేసింది. సుదీర్ఘ అనుభవముండి ఎన్నో కేసులను పరిశీలించి.. అధ్యయనం చేసిన అతను వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా ఐదు భాషల్లో పది పుస్తకాలు రాశారు. ‘మీ చిరునవ్వును సరిదిద్దుకోండి’, స్మైల్, ముస్కర హట్, ముస్కాన్ వంటి పుస్తకాలు రాశారు.

...✍ దాయి శ్రీశైలం
📷 గడసంతల శ్రీనివాస్

# యాంటీబయాటిక్స్‌తో జాగ్రత్త

యాంటీ బయాటిక్స్ ఎక్కువగా వాడొద్దు అంటుంటారు డాక్టర్లు. వాడితే ఏమవుతుంది? అంటారు మరికొందరు. అసలు వాడాలా వద్దా? అనేది సగటు రోగి సందేహం. అయితే వీటితో జాగ్రత్తగా ఉండాలి అని నిర్ధారించి చెప్తున్నారు నిపుణులు.



**యాం**టీ బయాటిక్స్ వల్ల లాభాలు ఉండొచ్చు. అంతమాత్రాన నష్టాలు లేవని చెప్పలేం. ఇది బాక్టీరియా కారక వ్యాధులకు ఒక విధంగా.. వైరస్ కారక వ్యాధులకు మరొక రకంగా పనిచేస్తుందని చెప్తున్నారు. బాక్టీరియా పరంగా చూస్తే ఊపిరి తిత్తులకు రక్షణనిస్తుంది. దాదాపు 80% వీటివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండకపోవచ్చునని అంటున్నారు. అదే వైరస్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని చూస్తే మాత్రం ఇన్ఫ్లూయెంజా వైరస్ ప్రతిరూపణకు ఆటంకం కలిగిస్తుందని చెప్తున్నారు. ఇంగ్లండ్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ ఇనిస్టిట్యూట్ పరిశోధకులు జంతువులపై పరిశోధన చేసి దీనిని నిర్ధారించారు. కాబట్టి యాంటీ బయోటిక్స్ వాడేటప్పుడు కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# కండరాల నొప్పి.. నివారణ ఇలా



కండరాల నొప్పి భరించలేం. ఏ పనీ చేసుకోలేం. హాయిగా పడుకుందామంటే అదీ కుదరదు. మరి ఎలా? కండరాల నొపి నివారణకు మార్గం లేదా? అని ఆలోచించేవాళ్లు ఒకసారి వీటిని ఫాలో అవమని అంటున్నారు ‘ఫిట్‌నెస్ అండ్ న్యూట్రిషనల్ సైంటిస్ట్’ డాక్టర్ భార్గవ.



**గుడ్లు:** ప్రొటీన్స్ లోపం వల్ల కండరాలు బలహీనమవుతాయి. సరైన పటుత్వం లేకపోవడం వల్ల కండరాల్లో నొప్పి మొదలవుతుంది. గుడ్లు తినడం వల్ల కండరాలకు ప్రొటీన్స్ అంది బలపడుతాయి. ఒక గుడ్డులో ఆరు గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. విటమిన్ ఏ, ఈ, కే, బీ కూడా గుడ్డు ద్వారా లభిస్తాయి.



**సముద్రపు చేప:** దీంట్లో అధిక మొత్తంలో ప్రొటీన్లు ఉంటాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉంటాయి. కండరాల పునర్నిర్మాణం కోసం ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయి. సాల్మాన్ చేపలో ఒమేగా-3 ఫాటీ ఆమ్లాలు లభిస్తాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరిచి కండరాల నొప్పిని తగ్గిస్తాయి.



**అరటి పండ్లు:** తిన్నది సులువుగా జీర్ణం కావాలన్నా శరీరానికి కార్బోహైడ్రేట్స్ అందాలన్నా అరటిపండ్లు తినడం చాలా మంచిది. ఇన్సులిన్ స్థాయిలను క్రమబద్ధీకరించడంలో ఇవి తోడ్పడుతాయి. ప్రొటీన్లు కూడా అధికంగా ఉంటాయి. పొటాషియం అధికస్థాయిలో లభిస్తుంది.



**పుచ్చపండ్లు:** అమైనో యాసిడ్లు అధికంగా పొందితే కండరాలు బలపడుతాయి. ఇవి ఎక్కువగా పుచ్చపండ్లలో ఉంటాయి. కండరాలల్లో ఉండే గ్లైకోజెన్ లోపాన్ని వీటి ద్వారా భర్తీ చేయవచ్చు. శరీరానికి నీటి శాతాన్ని కూడా సరిపడా అందిస్తాయి.



**చెర్రీస్ అండ్ చీజ్:** చెర్రీస్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రాపర్టీస్ అధికంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్స్ కూడా పుష్కలంగా లభిస్తాయి. కాబట్టి చెర్రీస్‌ను తీసుకోవడం వల్ల ఎముకలకు లభించి నొప్పి నుంచి ఉపశమనం పొందుతాం. చీజ్ ఎముక కణాలను బలపరచడానికి దోహదపడుతాయి.

# ఊబకాయంతో క్యాన్సర్

**కొ**వ్వు కణాలు శరీరంలో అదనపు హార్మోన్ల పెరుగుదలను ప్రేరేపిస్తాయి. శరీరంలోని కణాలను వేగంగా విభజనకు గురయ్యేట్లు చేస్తాయి. అయితే ఇది చాలా ప్రమాదకరమని అంటున్నారు యూనివర్సిటీ నిపుణులు. ఇది శరీరంలో క్యాన్సర్ కణాలు తయారయ్యేలా ప్రేరేపిస్తాయట. ‘క్యాన్సర్ రీసెర్చ్ యూకే’ ఆధ్వర్యంలో ‘ఊబకాయం-దుష్ప్రభావాలు’ అంశంపై అధ్యయనం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఊబకాయుల శాతం విపరీతంగా పెరుగుతున్నది. ఊబకాయం గుండెపోటుకు మాత్రమే గురిచేస్తుందని అనుకుంటారు చాలామంది. కానీ అది క్యాన్సర్‌ను కలిగిస్తుందని తెలుసుకోవాలి. క్యాన్సర్ విషయంలో పొగతాగేవాళ్ల కంటే కూడా ఊబకాయస్థులే అపాయంలో ఉన్నట్లు గ్రహించాలి. హార్మోన్‌ల పెరుగుదల, కణాల పెరుగుదల దీనికి ప్రధాన కారణాలు. కాబట్టి జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆహార అలవాట్లను పూర్తిగా మార్చాలి. సరైన డైట్ పాటిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఎంతో కొంత ఊబకాయం నుంచి బయటపడొచ్చు. దీని నుంచి బయటపడ్డాం అంటే క్యాన్సర్ నుంచి కూడా బయటపడినట్లే అనేది అందరూ తెలుసుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం. ఇది అందరికీ తెలిసిందే. ఇది మితిమీరితే క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం ఉంది కదా? అయితే ధూమపానం కంటే కూడా ఊబకాయం వల్లనే క్యాన్సర్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉందని చెప్తున్నారు పరిశోధకులు.



## సుడోకు

డైలీ సుడోకు 85 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | 9 | 3 | 5 | 2 | 6 | 8 | 7 |
| 5 | 8 | 7 | 6 | 9 | 1 | 4 | 3 | 2 |
| 3 | 2 | 6 | 8 | 4 | 7 | 1 | 5 | 9 |
| 9 | 1 | 5 | 2 | 6 | 4 | 3 | 7 | 8 |
| 6 | 7 | 8 | 1 | 3 | 5 | 9 | 2 | 4 |
| 4 | 3 | 2 | 9 | 7 | 8 | 5 | 6 | 1 |
| 2 | 6 | 4 | 5 | 8 | 9 | 7 | 1 | 3 |
| 7 | 5 | 1 | 4 | 2 | 3 | 8 | 9 | 6 |
| 8 | 9 | 3 | 7 | 1 | 6 | 2 | 4 | 5 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -86

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 5 | | 3 | 2 | | | 6 | |
| | | 6 | | 1 | | | | 3 |
| | 3 | | 4 | | 6 | | | 9 |
| | | | | 3 | | | 4 | 1 |
| | | | 1 | | 4 | | | |
| 2 | 1 | | | 7 | | | | |
| 3 | | | 2 | | 1 | | 7 | |
| 1 | | | | 4 | | 9 | | |
| | 4 | | | 9 | 5 | | 1 | 2 |

## ట్వీట్

అమితాబ్ బచ్చన్
@SrBachchan



ప్రతీ వారం సినిమా మారుతుంటుంది. కొత్త టాలెంట్ మెరుస్తుంది, ప్రశంసలందుకుంటుంది. అందరి హృదయాల్లోకి చొచ్చుకొని వెళుతుంది. అలాంటి ఫ్రెష్, యంగ్ టాలెంట్, ఆత్మవిశ్వాసం గల వారితో పని చేయడం మరింత ఆనందాన్ని కలిగిస్తుంది. వారితో పనిచేయడం ఒక వరంలా భావిస్తుంటాను.

అమితాబ్ బచ్చన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య ▸ 3,76,42, 934

## కామన్‌మ్యాన్ వాయిస్

ఒకరిని మాట అనలేక.. ఒకరితో మాట పడలేక.. నలిగిపోయే సున్నిత మనస్కులు లోలోపల పడే బాధ వారికి మాత్రమే తెలుస్తుంది.
– Juned Ahamad

ఆకలికి పేదవాడంటే అమితమైన ప్రేమ.. అందుకే అది వాన్ని వదిలెల్లదు!!
– Raju Athikam

రాజకీయం నేర్చినట్లున్నయ్ వానలు..
మబ్బులు కమ్ముకొని.. చినుకు రాల్చకుండా..
అన్నదాతను ఆశల హామీలతో ఊరిస్తున్నయ్..!
– Suresh Velpula

కాలం కలిపిన పరిచయాలను.. కాలం మాత్రమే విడదీస్తుంది. మనం అనుకుంటే కలవలేం.. మనం అనుకున్నప్పుడు విడిపోలేం!!
– Sandhya Reddy

## వైరల్ వీడియో




గుర్రపు సవారీ అంటేనే మస్తుగుంటది. అలాంటి మస్తు మజా తెచ్చేందుకు రెడీ అయిపోయాడు నందు తన సవారి సినిమాతో. ఈ సినిమాకి సంబంధించి టీజర్ యూట్యూబ్‌లో సందడి చేస్తున్నది. మీరూ ఆ టీజర్ పై ఓ లుక్కేయండి.

Savaari Movie Official Teaser | Nandu, Priyanka Sharma | Saahith Mothkuri
Total views : 5,05,959+
Published on 5 Jul 2019

# 45 చేతుల సముద్ర జంతువు!

పురాజంతు శాస్త్రం

**సైన్స్ ఫిక్షన్ నవలల్లో వలె, అదేదో భయంకర రోదసి ప్రాణి మాదిరిగా వుండే ప్రాచీనకాలపు ఒక సముద్ర జంతువు శిలాజ అవశేషాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది 45 చేతులతో, అఖాతగర్భ నేలపై నడయాడుతూ ఆహార వేట సాగించినట్టు వారు చెబుతున్నారు.**



బ్రిటన్‌కు చెందిన హెరెఫోర్డ్‌షైర్ (Herefordshire) కౌంటీలో లభ్యమైన అనేక శిలాజాలలో ఒక దానిని అత్యంత అరుదైన ప్రాచీన సముద్ర జంతువుగా పురాజంతు శాస్త్రవేత్తలు గుర్తించారు. 'సొలేసినా క్తుల్హూ' (Sollasina cthulhu)గా వ్యవహరిస్తున్న ఈ కొత్త రాకాసి ప్రాణి సుమారు 430 మిలియన్ సంవత్సరాల కిందటిదిగా చెబుతున్నారు. ఎకినోజోవాన్ (echinozoan) తరగతికి చెందిన కొత్త జాతిగానూ వారు దీనిని భావిస్తున్నారు. 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది రాయల్ సొసైటీ'లో ఇటీవల ప్రచురితమైన ఈ పరిశోధనలో యేల్, ఆక్స్‌ఫర్డ్, ది యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ (Leicester), ఇంపెరియల్ కాలేజ్ లండన్, యూనివర్సిటీ కాలేజ్ లండన్‌కు చెందిన పరిశోధకులు పాలు పంచుకొన్నారు. 45 చేతులుగా చెబుతున్న వాటిని అసలు చేతులో, కాళ్లో లేక మరేమి అనాలో కూడా వారు తేల్చుకోలేకున్నారు. అవి తొండాల వంటి గొట్టం కాళ్లు కూడా కావచ్చునని వారు అంటున్నారు. ప్రస్తుతం లభ్యమైన నమూనా శిలాజ అవశేషం చిన్నసైజుదిగా వారు తెలిపారు.

# కృత్రిమ కండరాలు

ఆధునిక పోకడ

**పూర్తి మృదువైన (Fully soft) రోబోలకు చక్కగా పనిచేసే కృత్రిమ కండరాలను శాస్త్రవేత్తలు సృష్టించారు. ఇవి విద్యుచ్ఛక్తితో, సహజ కండల వలెనే పనిచేస్తాయని వారంటున్నారు.**



అమెరికాలోని హార్వర్డ్ జాన్ ఎ. పాల్సన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ అప్లయిడ్ సైన్సెస్ పరిశోధకులు ఇటీవల కృత్రిమ కండరాలను అభివృద్ధి పరిచారు. ఇవి మృదువైన రోబోలకు బాగా ఉపయోగపడగలవని, విద్యుత్ క్షేత్రంతో వీటిని పని చేయించగలినప్పుడు కనీసం ఒక కేజీ బరువును ఎత్తగలవని వారన్నారు. 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధన సాఫ్ట్ రోబోటిక్స్‌లో ఎంతో ఉపయుక్తమని అన్నారు. వీటిని కృత్రిమ అవయవాలు, శస్త్రచికిత్సలు జరిపే రోబోలు, ధరించడానికి వీలైన పరికరాలతోసహా చలనశక్తిగల సాఫ్ట్‌రోబోలు, సహజ సిద్ధమైన లేదా మానవ కేంద్రీయ పర్యావరణాలలోను ఉపయోగించుకోవచ్చునని వారు చెబుతున్నారు. అధిక శక్తి వాహక ఎలక్ట్రోడ్‌లుగా, తక్కువ సాగే గుణంతో చిక్కని రబ్బరు వంటి పదార్థం (elastomers)గా, మరింత దృఢంగా, వేగంగా పనిచేసే సామర్థ్యంతో కూడిన కండరాలను తయారుచేయడమే తమ తదుపరి లక్ష్యమనీ వారు పేర్కొన్నారు.

అంతరిక్ష పరిశోధన

# నవ చంద్రోదయ వేళ!

మన రెండవ చంద్ర మహాయానానికి రంగం సిద్ధమైంది. అంతర్జాతీయంగా అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న రోజు ఇక ఎంతో దూరంలో లేదు. 'నాసా' (అమెరికా)కు చెందిన చారిత్రాత్మక అంతరిక్ష నౌక 'అపోలో-11' చంద్రతలంపై దిగి, మొట్టమొదటి ఇద్దరు మానవులను (నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్జ్ ఆల్డ్రిన్) నడయాడేలా చేసిన అత్యద్భుత ఘటన తాలూకు 50వ వార్షికోత్సవాన్ని (20 జూలై 1969) ప్రపంచం జరుపుకోబోతున్న నేపథ్యంలో మన 'ఇస్రో' రోదసీ నౌక 'చంద్రయాన్-2' ప్రయాణం మొదలవుతున్నది. భారత అంతరిక్ష పరిశోధనారంగ చరిత్రలోనే గణనీయమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ఈ ప్రాజెక్ట్ ఎంత ప్రతిష్ఠాత్మకమో, అంత సంక్లిష్టమని శాస్త్రవేత్తలు అంటున్నారు. జూలై 15న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకుపోనున్న ఈ ప్రయోగ విశేషాలు చదవండి.




భారత రోదసీ ప్రయోగాలు కేవలం వాణిజ్య పరమైనవే కావని నిరూపించే అరుదైన కార్యక్రమంగా 'చంద్రయాన్'ను అభివర్ణించాల్సిందే. ఇస్రో ఇప్పటి వరకూ జరిపిన అంతరిక్ష ప్రయోగాలన్నీ ఒక ఎత్తయితే 'చంద్రయాన్-2' ఒక్కటీ మరొక ఎత్తుగా మన శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 'చంద్రయాన్-1' ప్రయోగం (2008 అక్టోబర్ 22) తర్వాత సుమారు పదకొండేండ్లకు చేపడుతున్న 'చంద్రయాన్-2' ప్రపంచానికి ఒక కొత్త చంద్రోదయాన్ని పరిచయం చేస్తుందన్న ఆశాభావం సర్వత్రా ఉన్నది. 'చంద్రయాన్-1' కేవలం చంద్రుని కక్ష్యలో పరిభ్రమిస్తూ త్రిమితీయ (త్రీడీ) చిత్రీకరణలు, వివిధ పరిశోధనలకే పరిమితమైతే, 'చంద్రయాన్-2' మరొక అడుగు ముందుకేసి చంద్రుని ఉపరితలంపై రోవర్ (సంచార వాహనం)ను దించి నీటిజాడలతోపాటు మెగ్నీషియం, ఐయాన్, హీలియమ్ వంటి వాటి అన్వేషణకు ఉపక్రమించనుండడం విశేషం. అది కూడా అత్యంతావశ్యకమైన జాబిలి ఆవలి (దక్షిణ ధ్రువ) అర్ధగోళం పైన కావడం మరింత ఆసక్తికరం.

ప్రస్తుత 'చంద్రయాన్-2' ప్రయోగ విజయాల కోసం యావత్ ప్రపంచం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తుండడం వెనుక పలు సమంజసమైన కారణాలే ఉన్నాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశం ఇంతటి కఠినమైన ఘనకార్యానికి తెర తీయడమే ఆశ్చర్యమైతే, అదీ తనదైన స్వీయ వైజ్ఞానిక కృషి, ప్రణాళికలతో ముందుకెళుతుండడం, ఇంతదాకా అనేక ఘన కార్యాలను ఎన్నింటినో నమోదు చేసిన ఘనచరిత్రను 'ఇస్రో' కలిగి ఉండడం వంటివి ఇందులో ఉన్నాయి. ఇప్పుడు భారతీయులంతా గర్వించదగ్గ ఘట్టాన్ని 'చంద్రయాన్-2' పేర మన శాస్త్రవేత్తలు ఆవిష్కరిస్తున్నారు. ఒక రకంగా మొత్తం అంతరిక్ష పరిశోధనలో ప్రత్యేకించి చంద్రాన్వేషణలో అతిముఖ్యమైన ప్రయోగాలు ఇందులో ఉండడం గమనార్హం.

భూమి పుట్టుక, ప్రాచీన చరిత్రతో ఉత్తమ సంబంధాన్ని (Best link) చంద్రలోకం కలిగి ఉందనుకుంటున్న తరుణంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు మళ్లీ చంద్రయానాలకు సిద్ధమవుతున్నాయి. చంద్రునిపైకి రోదసీనౌకలో ప్రయాణం అంటే, విమానంలో 'ఇక్కడ ఎక్కి అక్కడ దిగడమంత' తేలిక కాదు. విక్షేపమార్గ కచ్చితత్వం (Trajectory accuracy) నిర్దేశించుకోవడం నుంచి అగాధ అంతరిక్ష సమాచారం (Deep-space communication) వరకూ అనేక సమస్యలను అధిగమించవలసి ఉంటుంది. ప్రత్యేకించి 'చంద్రయాన్-2' లక్ష్యసాధనలో ఎదురయ్యే సవాళ్లయితే (వాటిలో పైన పేర్కొన్న రెండింటితోపాటు చంద్రుని వైపు రోదసీ నౌక నిర్దిష్ట ప్రయాణం (ట్రాన్స్ ల్యూనార్ ఇంజెక్షన్: టిఎల్ఐ, ల్యూనార్ క్యాప్చర్), చంద్రకక్ష్య చుట్టూ దాని పరిభ్రమణం, ల్యాండర్‌ను మృదువుగా అక్కడి నేలపై దించడం, చంద్రతలం మీది దుమ్ము ధూళిని మన సాంకేతికత పరికరాలు తట్టుకోగలగడం, అక్కడి తీవ్ర ఉష్ణోగ్రతలు వంటివి ఉన్నాయి) మరింత సంక్లిష్టమని పరిశీలకులు అంటున్నారు. ఈ బృహత్ కార్యంలో మనం విజయం సాధించగలిగితే ప్రపంచంలోనే చంద్రునిపై సురక్షితం (మానవులు/ ల్యాండర్లను)గా దించగలిగిన మూడు దేశాల (అమెరికా, పాత సోవియట్ యూనియన్, చైనా) సరసన మన దేశానికీ ఆ ఘనత లభిస్తుంది.

మనకు కంటికి కనిపించే చంద్రుని వెన్నెల ఉపరితలాని (ఉత్తరధ్రువ ప్రాంతం)కంటే ఎక్కువగా, ఆవలి వైపున్న అర్ధగోళం (దక్షిణధ్రువ) పైనే నీటిజాడలు లభించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నది ఇస్రో శాస్త్రవేత్తల అంచనా. సూర్యకాంతికి దూరంగా ఛాయా వాతావరణంలోనే చాలాకాలంగా ఉంటున్న చంద్రుని దక్షిణార్ధ ధ్రువప్రాంతం గురించి నిజానికి శాస్త్ర ప్రపంచానికి ఇప్పటి వరకూ తెలిసింది చాలా తక్కువే. అందులోనూ ఈ ప్రదేశం ఉత్తరధ్రువ ప్రాంతం కంటే కూడా ఎక్కువ ప్రదేశాన్ని కలిగి ఉన్నది. ఈ ఆవలిభాగంలోనే శాశ్వత నీటి ఆనవాళ్లతోపాటు అక్కడి శీతలభరిత లోయలు, శిలాజాలలోనే అధిక ఆధారాలు నిక్షిప్తమై ఉంటాయన్నది వారి నిశ్చితాభిప్రాయం. ఈ కారణంగానే చంద్రయాన్ ప్రాజెక్ట్ రెండు దశలనూ చేపట్టినట్టు వారు చెబుతున్నారు. ఈ 'చంద్రయాన్-2'లో భాగంగా ల్యాండర్‌ను చంద్రుని ఆవలివైపున్న (ఛాయాపూరిత) అర్ధగోళంపైనే దింపి, రోవర్‌ను ప్రవేశపెట్టి ఆ మేరకు ప్రయోగాలకు జరుపగలమని వారు పేర్కొన్నారు. ఇంతేకాదు, మొత్తం మానవ అంతరిక్ష పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశమూ మనకు లభిస్తుందని కూడా వారు చెప్పారు.

మన దేశానికి చెందిన అత్యంత శక్తివంతమైన బూస్టర్‌గా చెప్పే రాకెట్ 'జీఎస్ఎల్‌వీఎం-3, ఎం-1' (Geosynchronous Satellite Launch Vehicle Mark III, M1) 'చంద్రయాన్-2' వ్యోమనౌకను అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. 3,84,400 కి.మీ.దూరంలోని చంద్రుని కక్ష్యను చేరడానికి మొత్తం 50 రోజుల సమయాన్ని ఇందుకు నిర్దేశించారు. ఇందులో 16 రోజులు భూమికక్ష్యలో, 27 రోజులు చంద్రుని కక్ష్యలో 'చంద్రయాన్-2' సంచరిస్తుందని, భూకక్ష్య నుంచి చంద్రకక్ష్యకు సాగే ప్రయాణం 5 రోజులు ఉంటుందని ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ లెక్కన సెప్టెంబర్ 6న అది గమ్యాన్ని చేరుకుంటుంది. చంద్రుని ఉపరితలంపై దిగే ల్యాండర్, రోవర్ల జీవిత కాలం ఒక చంద్రదినం (14 భూమి రోజులు)గా చెబుతున్నారు. ల్యాండర్‌ను జారవిడిచిన తర్వాత ఆర్బిటర్ చంద్రుని కక్ష్యలో సుమారు ఏడాది పాటు సంచరిస్తూ నిర్దేశిత పరిశోధనలను నిర్వర్తిస్తుందని వారన్నారు.

'చంద్రయాన్-2' చంద్రుని ఆవలి తలంపై దించనున్న ల్యాండర్‌కు భారతీయ సుప్రసిద్ధ ఖగోళ శాస్త్రవేత్త, 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్'గా పేరెన్నికగన్న విక్రమ్ సారాభాయ్‌కు గుర్తుగా 'విక్రమ్' అన్న పేరు పెట్టారు. దీనిద్వారా 'ప్రజ్ఞాన్' పేరు గల రోవర్‌ను అక్కడి నేలపై మెల్లగా, సురక్షితంగా దించడానికి అన్ని ఏర్పాట్లూ చేశామని, ఈ మేరకు తమకు పరిపూర్ణ విశ్వాసం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. 'చంద్రయాన్-2' జాబిలి కక్ష్యలోకి చేరి, ఉపరితలానికి అతి సమీపంగా సుమారు 30 కి.మీ.దూరం (ఎత్తు) నుంచి ల్యాండర్ దిగబోయే 15 నిమిషాల సమయం ఎంతో కీలకమేకాక అత్యంత ఉత్కంఠభరితమనీ వారు పేర్కొన్నారు. సెప్టెంబర్ 6న విక్రమ్ చంద్రనేలపై దిగిన తర్వాత సుమారు 4 గంటల వ్యవధిలోనే 'ప్రజ్ఞాన్' రోవర్‌ను విడుదల చేయగలదని వారు భావిస్తున్నారు. మొత్తం 13 విభిన్న పరికరాల (ఆర్బిటర్‌లో 8, ల్యాండర్‌లో 3, రోవర్‌లో 2)తో కూడిన 'చంద్రయాన్-2' విజయ పరంపరంతా చాలావరకు దాని ల్యాండర్, రోవర్లపైనే ఆధారపడి ఉండగా, శాస్త్రవేత్తలు వాటి పైనే అత్యధిక ఆశలు పెట్టుకున్నట్టు తెలుస్తున్నది.



**దోర్బల బాలశేఖరశర్మ**

వైద్యవిజ్ఞాన శాస్త్రం

## క్యాన్సర్ కణాల ఆట కట్టించే

# కొత్త లేజర్

**రక్తంలోని క్యాన్సర్ కణాలను గుర్తించి, వాటిని చర్మం పైనుంచే హతమార్చే అత్యంత శక్తివంతమైన కొత్త లేజర్ సాంకేతికతను శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచారు. ఇది ప్రస్తుతం అమలులో వున్న విధానాలకంటే వెయ్యిరెట్లు నయమని కూడా వారు అంటున్నారు.**



సాధారణంగా క్యాన్సర్ కణాలు రక్తం గుండానే శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. కొత్త లేజర్ (పరికరం) సాంకేతికత వాటిని చర్మం బయటి నుంచే గుర్తించి నాశనం చేస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. శరీర భాగాలకు సోకే లోపలే అంటే ప్రాథమిక స్థాయిలోనే వీటిని హతమార్చడానికి ఈ రకంగా అవకాశం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ అర్కన్సాస్ ఫర్ మెడికల్ సైన్సెస్' (University of Arkansas for Medical Sciences)కు చెందిన పరిశోధకులు దీనిని అభివృద్ధి పరిచారు. జంతువులపై ఇటీవల పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకొని మానవులపై ప్రయోగించడానికి ఈ లేజర్‌ను సిద్ధపరిచారు. ప్రస్తుత పరీక్షా విధానాల కంటే సుమారు 1,000 రెట్లు అధిక నాణ్యతను ఇది కనబరుస్తున్నట్లు వారు తెలిపారు. క్యాన్సర్ బాగా ముదిరిన తర్వాతే రక్త నమూనాల్లో తత్ కణాలు ప్రస్తుత పరీక్షల్లో బయట పడగలుగుతున్నాయని, కానీ ఈ కొత్త సాంకేతికత ప్రారంభదశలో సైతం వాటిని పసిగట్టిందని వారు అన్నారు. 'సైటోఫోన్' (Cytophone)గా పిలుస్తున్న ఈ లేజర్ ఉష్ణ శక్తి రక్తంలోని ఆరోగ్యవంతమైన కణాలను వదిలేసి, కేవలం క్యాన్సర్ కణాలనే లక్ష్యంగా చేసుకొన్నట్టు నిరూపణైందని వారన్నారు.



'సైన్స్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్' జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైన ఈ పరిశోధనా పత్రానికి పై విశ్వవిద్యాలయానికి చెందిన నానోమెడిసన్ కేంద్రం డైరెక్టర్ వ్లాడిమిర్ ఝరోవ్ (Vladimir Zharov) సీనియర్ రచయితగా ఉన్నారు. ఈ కొత్త లేజర్ కిరణాలు చర్మంలోకి చొచ్చుకు పోయి రక్తంలోని పుట్టకురుపు (melanoma) కణాలను మాత్రమే వేడి చేసి సమూలంగా వాటిని చంపేస్తాయని ఆయన అన్నారు. ఐతే, చర్మంలో సహజ సిద్ధమైన మెలానిన్ వర్ణద్రవ్యం ఉన్నప్పటికీనీ సాధారణ కణాలకు హాని చేయదని వ్లాడిమర్ చెప్పారు. మన చెవులు వినలేనంత అతిసున్నిత ధ్వని (సెకనుకు 2000 ధ్వని తరంగాల చొప్పున) తరంగాలతో కూడిన (అల్ట్రాసౌండ్) సాంకేతికతతో జరిగే ఈ ప్రక్రియ ద్వారా చర్మానికి ఎలాంటి హాని కలగదని ఆయన అంటున్నారు. ప్రయోగంలో తాము అత్యల్ప శక్తిని మాత్రమే వినియోగించామని, అయినా క్యాన్సర్ కణాలను సమర్థవంతంగా నిర్మూలించగలిగామని ఆయన తెలిపారు.

పనితనం

# ప్రచోదక శక్తినిచ్చే నాడీ వ్యవస్థ



మన శరీరంలోని ముఖ్య వ్యవస్థలలో నాడీ యంత్రాంగం ఒకటి. దేహం లోపల అవయవాల మధ్య, శరీరానికి బయట సమాచార మార్పిడితో పనిచేసే ప్రచోదక వ్యవస్థ ఇది. ఇదే సమయంలో దేహంలోని ఇతర వ్యవస్థలు దీని ద్వారానే పని చేస్తాయి. జ్ఞానేంద్రియాలు, సమాచార విధానాలు, ప్రతిస్పందనల చర్యలు (ఉదా॥కు నొప్పిని కలిగించే కండరాల కదలికలు వంటివి) అన్నీ నాడీ వ్యవస్థల ద్వారానే జరుగుతాయి. వేడి వస్తువులను తాకిన వెంటనే మన చేయిని వెనక్కి లాక్కోవడం వంటి తక్షణ (involuntary) చర్యలన్నింటినీ స్వయంచాలక నాడులే నిర్వర్తిస్తాయి. ఇదే సమయంలో సంబంధిత సమాచారాన్ని మెదడుకు చేరవేయడం, జీర్ణక్రియ విధానాలను నియంత్రించడం వంటివన్నీ నాడుల ప్రచోదక శక్తితోనే జరుగుతాయి. మన నాడీ వ్యవస్థలో కేంద్రీయ- పరిధీయ (peripheral), స్వయంచాలక- నియంత్రితమైనవిగానూ నాడులను శాస్త్రవేత్తలు విభజించారు. దేహంలోని ఒక్కో నాడీవ్యవస్థలో బిలియన్ సంఖ్యలో నాడీకణాలు (న్యూరాన్లు) ఉంటాయి. ఒక్క మెదడులోనే సుమారు 100 బిలియన్ న్యూరాన్లు ఉంటాయని అంచనా. అవయవాల కదలికల నుంచి గుండె, శ్వాసకోశాలు వంటి అంతర అవయవాలకు చెందిన ఆటోమేటిక్ పనితనాల వరకూ ప్రతి చర్యా నాడుల శక్తివల్లే సంభవనీయం.

ఎవరేమన్నారు?



చికిత్సకుడు కేవలం చికిత్స చేస్తాడు. ప్రకృతి పూర్తిగా బాగు చేస్తుంది!

**-అరిస్టాటిల్**

ఆహారశాస్త్రం

# స్థూల-సూక్ష్మ పోషకాలు



మనం తినే ఏ రకమైన ఆహారంలోనైనా ఎంతో కొంత, ఏవో రకమైన పోషకాలు ఉంటాయి. పోషకాలు ప్రధానంగా రెండు రకాలు: స్థూల (macro), సూక్ష్మ (micro). కొవ్వు పదార్థాలు, ప్రొటీన్లు, నీరు వంటివి స్థూల (పెద్ద మొత్తం) పోషకాలు కాగా, విటమిన్లు, ఖనిజాలు సూక్ష్మ (తక్కువ మొత్తం) పోషకాల కిందికి వస్తాయి. పెద్ద మొత్తంగా తీసుకొనే ఆహారంలో స్థూల పోషకాలు అధికంగా ఉంటే, తక్కువ మొత్తంలోని ఆహారంలో సూక్ష్మ పోషకాలు ఎక్కువగా ఉంటాయి. మానవ శరీరానికి ఈ రెండు రకాల పోషకాలూ సమపాళ్లలో ఉండాల్సిందేనని శాస్త్రవేత్తలు అంటారు. దేహదారుఢ్యానికి సూక్ష్మపోషకాల కంటే స్థూలపోషకాల అవసరమే ఎక్కువని, అలాగే ఆరోగ్యరక్షణకు సూక్ష్మపోషకాలు ఎక్కువ అవసరమని వారు అంటారు. మనిషి వంటి పెద్ద ప్రాణికి ఆ మేరకు కండపుష్టి ఉండాల్సిందే. ఈ రెండు రకాల పోషకాలలో ఏది తక్కువైనా, ఏది ఎక్కువైనా మరో దాని లోటు మన ఆరోగ్యంపైనా, శరీర శక్తిపైనా స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి, ఏ ఆహార పదార్థంలో ఏవేం ఉన్నవీ తెలుసుకొని ఆ మేరకు నాణ్యమైన వాటిని తినడం ఉత్తమమని వారు అంటారు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

**కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2020-21 విద్యాసంవత్సరానికి 6వ తరగతి (రెసిడెన్షియల్ ప్రోగ్రామ్)లో ప్రవేశం కోసం నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష-2020
- **అర్హత:** ప్రస్తుత విద్యా సంవత్సరం (2019-20)లో ఏ జిల్లాలోనైతే నవోదయ విద్యాలయం పనిచేస్తుందో అదే జిల్లాకు చెందిన ప్రభుత్వ/ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వతరగతి చదువుతూ ఉండాలి.
- **గమనిక:** గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కనీసం 75 శాతం సీట్లు, బాలికలకు 1/3వ వంతు సీట్లు కేటాయించారు.
- **వయస్సు:** 2007 మే 1 నుంచి 2011 ఏప్రిల్ 30 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక:** జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఆధారంగా
- పరీక్ష మొత్తం 80 ప్రశ్నలకుగాను 100 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్షలో మూడు సెక్షన్లు ఉంటాయి. రెండు గంటల్లో పూర్తి చేయాలి. పరీక్ష పత్రం ఇంగ్లిష్/ హిందీతోపాటు ప్రాంతీయ (తెలుగు) భాషలో ముద్రిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చిరునామా:** నవోదయ విద్యాలయ సమితి, ప్రాంతీయ కార్యాలయం, 1-1-10/3, సర్దార్‌పటేల్ రోడ్, సికింద్రాబాద్ తెలంగాణ -500003
- **చివరితేదీ:** సెప్టెంబర్ 15
- **ప్రవేశపరీక్ష:** సమ్మర్ బౌండ్ ఎంపిక పరీక్ష-2020 జనవరి 11, వింటర్‌బౌండ్ ఎక్స్‌ట్రీమ్ ఎంపిక పరీక్ష-2020 ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** http://navodayahyd.gov.in

**పరీక్ష విధానం**

| అంశం | ప్రశ్నలు | మార్కులు | సమయం |
|---|---|---|---|
| మెంటల్ ఎబిలిటీ | 40 | 50 | 60 |
| అర్థమెటిక్ టెస్ట్ | 20 | 25 | 30 |
| లాంగ్వేజ్ టెస్ట్ | 20 | 25 | 30 |

## గురుకులాల్లో ఉచిత శిక్షణ

**హైదరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఐఐటీ -జేఈఈ లాంగ్‌టర్మ్, క్లాట్ ఉచిత శిక్షణ ప్రవేశాల కోసం ఎస్సీ/ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

**ఐఐటీ లాంగ్ టర్మ్, క్లాట్ ఉచిత శిక్షణ**

- **అర్హత:** ఐఐటీ శిక్షణకు ఇంటర్‌తోపాటు 2019లో జేఈఈ మెయిన్లో 60-70 శాతం పర్సంటైల్ మార్కులు పొందిన తెలంగాణకు చెందిన ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు. క్లాట్ శిక్షణకు పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఇంటర్ (ఆర్ట్స్/సైన్స్) మొదటి ఏడాది చదువుతున్న ఎస్సీ విద్యార్థులు మాత్రమే అర్హులు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **తరగతులు ప్రారంభం:** జూలై 15
- **చిరునామా:** ఐఐటీ లాంగ్ టర్మ్ కోసం ప్రిన్సిపాల్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ గౌలిదొడ్డి (ఫోన్-9398795047), క్లాట్ లాంగ్ టర్మ్ కోసం ప్రిన్సిపాల్ (ఫోన్- 9704550234, 9949356339, 8374161149 సంప్రదించవచ్చు.

## ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

**హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) ఖాళీగా ఉన్న టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల (తాత్కాలిక ప్రాతిపదికన) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- మొత్తం ఖాళీలు: 24
- టెక్నికల్ ఆఫీసర్-20 పోస్టులు (ఈసీఈ-8, మెకానికల్-3, సీఎస్ఈ-6, ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్-1, సీఎస్ఈ/ఈసీఈ-2)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** 23,000/- (కన్సాలిడేటెడ్ పే)
- సైంటిఫిక్ అసిస్టెంట్-2 పోస్టులు
- **అర్హత:** ప్రథమ శ్రేణిలో డిప్లొమా (ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 18,460/- (కన్సాలిడేటెడ్ పే)
- జూనియర్ ఆర్టిజియన్-2 పోస్టులు
- **అర్హత:** ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో రెండేండ్ల ఐటీఐ ఉత్తీర్ణత.

**గమనిక:** ప్రతి పోస్టుకు సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.

- **పే స్కేల్:** రూ. 16,770/- (కన్సాలిడేటెడ్ పే)
- **వయస్సు:** 2019 జూన్ 30 నాటికి టెక్నికల్ ఆఫీసర్‌కు 30 ఏండ్లు, మిగతా పోస్టులకు 25 ఏండ్లకు మించరాదు.



- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 11
- **వెబ్‌సైట్:**http://careers.ecil.co.in

## ఎగ్జిక్యూటివ్ పోస్టులు

**వైజాగ్‌లోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్) తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **పోస్టు పేరు:** ఎగ్జిక్యూటివ్-5 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డ్రెడ్జింగ్ అండ్ హార్బర్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ (ఎంఈ/ఎంటెక్) ఉత్తీర్ణతతోపాటు ఏడాది పాటు అనుభవం ఉండాలి. నెలకు రూ. 30,000/- చెల్లిస్తారు.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూలై 23
- **వెబ్‌సైట్:** www.dredge-india.com

## ఎన్‌సీఆర్‌ఏలో ట్రెయినీలు

**పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోఫిజిక్స్ (ఎన్‌సీఆర్‌ఏ) ఖాళీగా ఉన్న ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **పోస్టు:** అడ్మినిస్ట్రేటివ్ ట్రెయినీ-7 ఖాళీలు
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. టైపింగ్ స్కిల్‌తోపాటు కంప్యూటర్ అప్లికేషన్‌లో పరిజ్ఞానం ఉండాలి.
- **వయస్సు:** 2019 జూలై 1 నాటికి 28 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రెండేండ్లపాటు స్టయిఫండ్ రూ.15,000/- చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** www.ncra.tifr.res.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
మంగళవారం 9 జూలై 2019

## మార్కెట్లో ప్రజాస్వామ్యం సక్సెస్ కావాలి!



నారాయణమూర్తి

**ఆర్.**నారాయణమూర్తి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'మార్కెట్లో ప్రజాస్వామ్యం'. ఈ నెల 12న విడుదలకానున్న ఈ చిత్రాన్ని సినీ ప్రముఖులు కైకాల సత్యనారాయణ , నిర్మాతలు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పోకూరి బాబూరావు, జెమిని కిరణ్‌లు ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ 'నారాయణమూర్తి తెరకెక్కించిన ఈ సినిమా చూసి గర్వపడుతున్నాను. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చిన ఆయన అప్పటి నుంచి ఇప్పటి వరకు అలాగే వున్నారు. నారాయణమూర్తి సినిమాలు సమాజంలోని సమస్యలను ఎత్తిచూపిస్తుంటాయి. ఈ చిత్రంలో కూడా రాజకీయాల్లోని కుళ్లును ఎంతో ధైర్యంగా చూపించారు. 100 కోట్లు పెట్టి తీసిన సినిమా చూసిన అనుభూతి కంటే ఎక్కువ ఆనందం కలిగింది. ఆయన ఇలాగే మరిన్ని మంచి సినిమాలు తీయాలి' అన్నారు. నారాయణమూర్తి అంకితభావంతో సినిమాలు తీస్తాడని, గత 35 సంవత్సరాలుగా విసుగు, విరామం లేకుండా సినిమాలు తీయడం గొప్ప విషయమని, ఈ షోకు హాజరైన నిర్మాతలు నారాయణమూర్తిని ప్రశంసించారు.



యష్, విజయ్ దేవరకొండ, ఆనంద్, మహేంద్ర, శివాత్మిక, రాజశేఖర్, శ్రీధర్‌రెడ్డి

## 'దొరసాని'తో మ్యాజిక్ సృష్టించారు

**'ఇ**క్కడ మనల్ని ప్రేమిస్తారు, ద్వేషిస్తారు. అర్థం చేసుకుంటారు. అపార్థం చేసుకుంటారు. ఎవరేమనుకున్నా మన ధర్మం పాటిస్తూ ముందుకెళ్లాలి. అప్పుడే విజయాలు వరిస్తాయి' అన్నారు విజయ్ దేవరకొండ. ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'దొరసాని'. రాజశేఖర్ తనయ శివాత్మిక నాయికగా అరంగేట్రం చేస్తున్నది. కేవీఆర్ మహేంద్ర దర్శకుడు. మధుర శ్రీధర్‌రెడ్డి, యష్ రంగినేని నిర్మాతలు. ఈ నెల 12న ప్రేక్షకులముందుకురానుంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయ్ దేవరకొండ తన తమ్ముడి గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కన్నీటిపర్యంతమయ్యారు. అమెరికాలో ఉద్యోగం చేస్తూ తమ్ముడు ఇంటికి డబ్బులు పంపించేవాడని, వాడి సహాయం వల్లనే తానీ స్థాయిలో ఉన్నానని చెప్పారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'అమెరికాలో ఉద్యోగం చేస్తున్న తమ్ముడు సినిమాల్లోకి వస్తానంటే వద్దని చెప్పాను. స్క్రిప్ట్ మొదలుకొని సినిమా విడుదల వరకు ఎన్నో కష్టాలుంటాయని వారించాను. కథ బాగా నచ్చింది.. సినిమా చేస్తానన్నాడు. సినిమా కష్టాలేమిటో వాడే స్వయంగా తెలుసుకోవాలని వదిలేశాను. ప్రమోషన్ విషయంలో కూడా జోక్యం చేసుకోలేదు. చిన్నప్పుడు నేను, తమ్ముడు పుట్టపర్తిలో చదువుకున్నాం. నేను నాలుగో తరగతిలో ఉన్నప్పుడు వాడు ఒకటో తరగతిలో చేరాడు. స్కూల్ ప్రారంభమైన రోజున ఉరుక్కుంటూ వచ్చి మా క్లాస్ ముందు కూర్చున్నాడు. ఐదు నిమిషాలకొకసారి నా వైపు చూస్తూ నేనున్నానని ధైర్యంగా ఫీలయ్యాడు. అలా మూడు రోజులు నా క్లాస్‌లోనే కూర్చున్నాడు. నేనంటే తమ్ముడికి అంత ఇష్టం. ఈ వేడుకకు వచ్చేముందు సినిమా చూపించమని అడిగా. సినిమా చూశాక దర్శకుడు మహేంద్ర ఓ మ్యాజిక్ క్రియేట్ చేశాడనిపించింది. కొన్ని చోట్ల సంభాషణలు లేకుండా పర్‌ఫార్మెన్స్ రాబట్టుకున్నాడు. శివాత్మిక అద్భుతమైన నటిగా పేరు తెచ్చుకుంటుంది. ఆనంద్ నటన గురించి నేను చెబితే బాగుండదు. సినిమా విడుదలయ్యాక మీరే మాట్లాడుతారు. మహేంద్ర నాకోసం కథ రాస్తున్నానని చెప్పాడు. త్వరగా పూర్తి చేసి నాకు వినిపించమన్నాను. పరిశ్రమలో ప్రతి నటుడికి విమర్శలు ఎదురవుతాయి. వాటిని స్వీకరించినప్పుడే ఇక్కడ నిలబడగలుగుతాం' అన్నారు. ''దొరసాని' కథ దాచుకోలేని ఓ ఎమోషన్. వాస్తవికత..కొత్తదనం కలబోతగా ఆకట్టుకునే పీరియాడిక్ ప్రేమకథ' అని దర్శకుడు తెలిపారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ 'జీవితంలో డబ్బుల గురించి చాలా కష్టాల్ని ఎదుర్కొన్నాం. గత మూడేళ్లలో అవన్నీ తీరిపోయాయి. విజయ్ కష్టం వల్లే అది సాధ్యమైంది. నా వెనక దేవరకొండ అనే పేరు ఉందని సినిమా చేయడం లేదు. దర్శకుడు మహేంద్ర చెప్పిన కథ నన్ను కదిలించింది. రాజు అనే పాత్రలో ప్రేక్షకులు నన్ను స్వీకరిస్తారని నమ్ముతున్నాను' అన్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి యాక్టర్ కావాలన్నది తన కోరికని, అది ఈ సినిమాతో తీరిందని శివాత్మిక చెప్పింది. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, జీవిత, నందినిరెడ్డి, రామజోగయ్యశాస్త్రి, తరుణ్‌భాస్కర్, గోరటి వెంకన్న, ప్రశాంత్ విహారి, వెంకట్ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రవి ఉద్యావర్, నమిత్, అల్లు అరవింద్, మధు మంతెన, నితేష్

## 1500 కోట్లతో 'రామాయణ్'

• డిసెంబర్‌లో చిత్రీకరణ మొదలు

**ప్ర**ముఖ నిర్మాత సంస్థ గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్, బాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌస్ ప్రైమ్ ఫోకస్ పతాకంపై నమిత్ మల్హోత్ర సంయుక్తంగా నిర్మించబోతున్న చిత్రం 'రామాయణ్'. 1500కోట్ల భారీ బడ్జెట్‌తో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కించబోతున్నారు. మధు మంతెన నిర్మాణ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. నితేష్ తివారి, రవి ఉద్యావర్ సంయుక్తంగా దర్శకత్వం బాధ్యతల్ని నిర్వర్తిస్తారు. ఈ చిత్రాన్ని మూడు భాషల్లో మూడు భాగాలుగా నిర్మించనున్నారు. ఒక్కో భాగానికి 500కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఈ సినిమాకు నటీనటుల్ని ఇండియా వ్యాప్తంగా వివిధ భాషా చిత్రాల నుంచి ఎంపిక చేసుకుంటారు. ఈ సినిమా షూటింగ్ డిసెంబర్ నుంచి ప్రారంభమవుతుంది. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ప్రపంచస్థాయి నిర్మాణ విలువలతో, అత్యున్నత గ్రాఫిక్స్ హంగులతో ఈ సినిమాకు రూపకల్పన చేస్తున్నారు. భారతదేశపు తొలి భారీ బడ్జెట్ చిత్రంగా 'రామాయణ్' అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది.

## ఒక ఏలియన్ ప్రేమకథ



సుష్మా, తిలక్

**తి**లక్, సుష్మా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఒక ఏలియన్ ప్రేమకథ'. లెన్నీ దర్శకుడు. తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిస్తున్నారు. పిఆర్‌కే ప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర గీతాలను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'మా స్వస్థలం కర్ణాటక. తెలుగు సినిమా చేయాలనే తపనతో ఇక్కడకొచ్చాను. ప్రేమను వెతుక్కుంటూ ఓ ఏలియన్ భూగ్రహానికి వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో హీరో సైనికాధికారిగా నటిస్తున్నాడు. ఆగస్ట్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రుద్రమని, సంగీతం: వికాస్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: లెన్నీ.

## రాజారాణి ప్రణయం

**కి**రణ్, రహస్య గోరక్ జంటగా నటిస్తున్న చిత్రం 'రాజావారు రాణిగారు'. రవికిరణ్ దర్శకుడు. డి. మనోవికాస్ నిర్మాత. ఈ చిత్ర టీజర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే కుటుంబ కథా చిత్రమిది. ఓ అందమైన జంట ప్రేమ ప్రయాణానికి దృశ్యరూపంలా ఉంటుంది. పల్లెటూరి అనుబంధాలకు దర్పణంలా ఆకట్టుకుంటుంది' అన్నారు. ఆద్యంతం చక్కటి వినోదంతో అందరిని అలరించే చిత్రమిదని, నటీనటులందరూ మంచి అభినయాన్ని కనబరిచారని నిర్మాత తెలిపారు. 'గతంలో నేను వెబ్‌సిరీస్‌లో నటించాను. 'రాజావారు రాణిగారు' ఆహ్లాదభరిత ప్రేమకథ. అందమైన పల్లెటూరిలో కథ నడుస్తుంది. మూడు నెలల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని కథానాయకుడు పేర్కొన్నారు. రాజ్‌కుమార్ కాశిరెడ్డి, యజుర్వేద్ గుర్రం, స్నేహమాధురి శర్మ, దివ్యనార్ని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విద్యాసాగర్, అమర్‌దీప్, కథ, దర్శకత్వం: రవికిరణ్ కోలా.



రహస్య

**'కెరీర్ ఆరంభం నుంచి వినూత్న కథా చిత్రాల్ని ఎంచుకుంటూ సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు యువహీరో సందీప్‌కిషన్. ఆయన సినిమాలో ఏదో కొత్తదనం ఉంటుందని ప్రేక్షకులు విశ్వసిస్తారు. 'జయాపజయాల గురించి ఆలోచించకుండా కథలో నవ్యతకు పెద్దపీట వేయాలన్నదే నా సిద్ధాంతం' అని చెబుతున్నారు సందీప్‌కిషన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'నిను వీడని నీడను నేనే' చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. కార్తీక్‌రాజు దర్శకుడు. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ పాత్రికేయులతో ముచ్చటించారు.**



సందీప్‌కిషన్

## పద్నాలుగు సినిమాల్ని ఫ్రీగా చేశాను!

**హారర్ జోనర్ సినిమాలంటే అంతగా ఇష్టం ఉండదని ఓ సందర్భంలో చెప్పారు?**

• స్వతహాగా నాకు హారర్ జోనర్ మీద ఆసక్తి ఉండదు. అయితే ఈ సినిమా కాన్సెప్ట్‌లో హారర్‌కు మించిన అంశాలున్నాయి. కథ వినగానే ఉద్వేగానికి గురయ్యాను. థియేటర్ నుంచి బయటకు వచ్చే ముందు ప్రేక్షకులెవరూ హారర్ సినిమా చూశామని అనుకోరు. కథానుగుణంగా వినోదంతో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయి.

**ఇంతకి ఈ సినిమా కథేమిటి?**

• 2043లో మొదలైన కథ తిరిగి వర్తమానికి వస్తుంది. మరలా భవిష్యత్తులోకి వెళ్తుంది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా నడిచే సబ్జెక్ట్ ఇది. ఓ ప్రమాదానికి గురైన కథానాయకుడు అద్దంలో చూసుకున్నప్పుడు అందులో మరొక వ్యక్తి (వెన్నెల కిషోర్) కనిపిస్తాడు. అలా ఎందుకు కనిపిస్తాడన్నదే కథలో సస్పెన్స్. చాలా రోజుల తర్వాత భవిష్యత్తును ఆవిష్కరిస్తూ తెలుగులో వస్తున్న చిత్రమిది. 2043లో హైదరాబాద్ ఎలా ఉండబోతుంది? అప్పుడు ఉండబోయే సాంకేతికత, ప్రజల జీవితం..ఈ అంశాలన్నింటికి వాస్తవికంగా సినిమాలోని ఓ ఎపిసోడ్‌లో చూపించబోతున్నాం.

**ఈ సినిమాకు నిర్మాణ బాధ్యతలు మీరే తీసుకోవడానికి కారణమేమిటి?**

• నా గత మూడు చిత్రాలు ఆశించిన విజయం సాధించలేదు. రిలీజ్ ముందే వాటి ఫలితం ఎలా ఉంటుందో తెలిసిపోయింది. ఈ సినిమాలో అలాంటి తప్పులు జరగొద్దని నిర్మాణ బాధ్యతల్ని తీసుకున్నాను. గతంలో చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రతి విషయంలో జాగ్రత్తలు తీసుకొని ఈ సినిమా చేశాం. ఈ చిత్ర భారాన్నంతా నామీదే వేసుకున్నాను. విడుదలకు ముందే ఈ సినిమాకు పాజిటివ్ స్పందన లభిస్తున్నది.

**నిర్మాణ వ్యవహారాల వల్ల ఒత్తికి ఎక్కువై దాని ప్రభావం నటనపై పడుతుందని ఎప్పుడైనా భయపడ్డారా?**

• అలాంటిదేమి లేదు. నటన నాకు అలవాటైపోయింది. కెమెరా ముందు నేను 200శాతం శ్రమిస్తాను. కాబట్టి యాక్టింగ్ పరంగా ఎలాంటి ఒత్తిడి లేదు.

**గత రెండేళ్లుగా మీ సినిమాలేవి రాలేదు. ఎందుకు విరామం తీసుకున్నారు?**

• రెండేళ్లు ఎంతో సంఘర్షణకు లోనయ్యాను నన్ను నేను తెరపై చూసుకొని రెండేళ్లయింది. 'నక్షత్రం' తర్వాత నా సినిమా ప్రేక్షకులముందుకు రాలేదు. అయితే ఆ సినిమా ఫలితం విషయంలో నాకు ఎలాంటి బాధ లేదు. కృష్ణవంశీ దర్శకత్వంలో నటించడం గొప్పగా అనిపించింది. ఈ రెండేళ్లలో దాదాపు 40కథల్ని విన్నాను. నా వ్యక్తిగత అనుభవంతో చెప్పాలంటే పరిశ్రమలో అవకాశాలు ఎవరూ ఇవ్వరు. మనమే సృష్టించుకోవాలి.

**ఇప్పటివరకు దాదాపు 25 సినిమాలు చేశారు. మీ కెరీర్‌ను పరిశీలించుకుంటే ఏమనిపిస్తుంది?**

• 'స్నేహగీతం' చిత్రంతో నా ప్రయాణం మొదలైంది. తెలుగు, తమిళం, హిందీ చిత్రాల్లో నటించాను. నా మనసుకు నచ్చిన కథాంశాల్ని ఎంచుకొని సినిమాలు చేశాను. అందులో జయాపజయాలు ఉన్నాయి. అయితే పరభాషల్లో చేసిన చిత్రాల్లో కొన్ని మంచి విజయాలు సాధించాయి. హోమ్ గ్రౌండ్‌లో ఓడిపోయి బయటదేశంలో బాగా ఆడిన చందంగా నా పరిస్థితి తయారైంది (నవ్వుతూ). అయితే అవకాశాలపరంగా మాత్రం ఎప్పుడూ వెనకబడలేదు.

**• హిందీలో మనోజ్‌బాజ్‌పాయ్‌తో కలిసి అమెజాన్ వారు నిర్మిస్తున్న వెబ్‌సిరీస్ 'ది ఫ్యామిలీ మేన్'లో నటించాను. చిత్రీకరణ పూర్తయింది. ఇందులో నేను కమెండోగా కనిపిస్తాను. దీనిని తెలుగులో అనువదించబోతున్నారు. 'నిను వీడని నీడను నేనే' చిత్ర హిందీ రీమేక్ హక్కుల్ని అక్కడి ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ వారు అడిగారు. అందుకు సంబంధించిన ఒప్పందం గురించి త్వరలో వెల్లడిస్తాను.**

**అపజయాల గురించి ఎప్పుడైన పునఃసమీక్ష చేసుకున్నారా?**

• కథల్లో కొత్తదనానికే ప్రాధ్యానతనిస్తూ నేను సినిమాలు చేశాను. కొన్నిసార్లు నా అంచనాలు తప్పాయి. కెరీర్‌లో దాదాపు 14 సినిమాల్ని ఎలాంటి పారితోషికం తీసుకోకుండా ఫ్రీగా చేశాను. ఒకవేళ సినిమా ఆడితే లాభాల్లో వాటా ఇవ్వాలనే ఒప్పందంతో సినిమాలు చేసేవాడిని. అందులో కొన్ని సినిమాలు ఆడాయి. మరికొన్ని ఫ్లాప్ అయ్యాయి. అయితే ఈ ప్రయాణంలో నాకంటూ ఓ ఇమేజ్‌ను సృష్టించుకున్నాను. తెలుగు, తమిళం, హిందీ చిత్రసీమల్లోనాకంటూ గుర్తింపును సంపాదించుకున్నాను.



నభా నటేష్, పూరి జగన్నాథ్, రామ్, ఛార్మి, నిధి అగర్వాల్

## పూరితో సినిమా చేస్తే ఆ కిక్కే వేరు!

**రా**మ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్ దర్శకుడు. నిధి అగర్వాల్, నభా నటేష్ కథానాయికలు. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మాతలు. ఈ నెల 18న ప్రేక్షకులముందుకు రానుంది. ఆదివారం రాత్రి 'ఇస్మార్ట్ బోనాలు' పేరుతో వరంగల్ పట్టణంలో వేడుకను నిర్వహించారు. రామ్ మాట్లాడుతూ 'బోనాల పండగను వరంగల్‌లో సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సినిమా పాయింటే చాలా కొత్తగా ఉంది. తెలంగాణ యువకుడి పాత్రలో నటించడం అంత సులభం కాదు. నభా నటేష్ చక్కటి నటనను కనబరిచింది. వరంగల్ కాలేజీ యువకుల మీద ఓ కౌంటర్ వేసింది. సినిమాలో బోనాల పాట హైలైట్‌గా నిలుస్తుంది. పూరి జగన్నాథ్‌తో సినిమా చేస్తే ఆ కిక్కే వేరు. షూటింగ్ పూర్తవుతుందంటే చాలా బాధగా అనిపించింది' అన్నారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ 'హైదరాబాద్ రౌడీ అయిన ఇస్మార్ట్ శంకర్‌కు పోలీసోళ్లు డిప్పలో బొక్కపెట్టి చిప్పలోకి సిమ్‌కార్డ్ పెట్టింద్రు. అదెందుకు పెట్టారు? ఆ తర్వాత ఏమైందన్నదే చిత్ర కథ. ఆద్యంతం వినోదప్రధానంగా సాగే కథ ఇది. 'టెంపర్' తర్వాత నాకు సరైన హిట్ లేదు. విపరీతమైన ఆకలితో ఉన్న సమయంలో రామ్ దొరికాడు. వెజిటేరియన్ ముసుగులో ఉన్న నాన్ వెజిటేరియన్ యువకుడు రామ్. అతను చిరుతపులిలాంటోడు. సినిమా తప్ప మరో ధ్యాస ఉండదు. ఈ సినిమాకు మణిశర్మగారు అద్భుతమైన ఐదు పాటలిచ్చారు. బోనాలు టైంలో ఈ సినిమా విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా హిట్ అయ్యాక డబుల్ ఇస్మార్ట్ శంకర్ సినిమా తీయాలి. అంతకుమించి కోరికలు ఏం లేవు' అన్నారు. ప్రేక్షకులందరికి నచ్చే కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్ ఇదని, ఆద్యంతం ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారని ఛార్మి చెప్పింది. తామిద్దరం వరంగల్ రావడం ఇది రెండోసారని.. పూరిజగన్నాథ్, రామ్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందని కథానాయికలు నభానటేష్, నిధి అగర్వాల్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## సంగీతభరిత ప్రేమకథ



రేష్మా

**ఉ**మాపతి, రేష్మా జంటగా ఆర్.ఇన్బ శేఖర్ దర్శకత్వంలో తమిళంలో తెరకెక్కిన 'గిటార్' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులోకి అనువదించారు. 'ఐమిస్‌యూ' ఉపశీర్షిక. యమ్‌ఆర్ఆర్ మూవీస్ పతాకంపై వాసుపల్లి బ్రహ్మ సమర్పణలో నిర్మాత యం.రవిశేఖర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. వచ్చే నెలలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ ' తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. ఇమాన్ అందించిన సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా వుంటుంది. ఆగస్టులో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు, పాటలు: వెన్నెలకంటి, సహ నిర్మాత: వానపల్లి లక్ష్మి.





